SAPTHAGIRI (TELUGU)
SPIRITUAL
ILLUSTRATED MONTHLY
Volume: 53, Issue: 11
April-2023, Price Rs. 20/-

తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక

ఏప్రిల్ 2023
వెల రూ.20/-
పుటలు-56



05-04-2023న
శ్రీకోదండరామస్వామివారి కల్యాణోత్సవం,
ఒంటిమిట్ట

## తిరుమల తిరుపతి దేవస్థానములు

### 2023 ఫిబ్రవరి 11 నుండి 19 వరకు జరిగిన
## శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామి(శ్రీనివాసమంగాపురం)వారి బ్రహ్మోత్సవ దృశ్యాలు










### 2023 ఫిబ్రవరి 11 నుండి 20 వరకు జరిగిన
## శ్రీకపిలేశ్వరస్వామి(తిరుపతి)వారి బ్రహ్మోత్సవ దృశ్యాలు





# గీతాశ్లోకార్థసారం

**శ్లో :** క్లైబ్యం మాస్మగమః పార్థ నైతత్త్వయ్యుపపద్యతే ।
క్షుద్రం హృదయదౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరన్తప ॥

(శ్రీమద్భగవద్గీత 02వ అధ్యాయం- 03వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** పార్థ= ఓ అర్జునా!; క్లైబ్యమ్= అధైర్యాన్ని; మాస్మగమః= పొందకుము; ఏతత్= ఇది; త్వయి= నీయందు; న ఉపపద్యతే= తగదు; పరన్తప= శత్రువులను తపింపజేయు ఓ అర్జునా!; క్షుద్రమ్= నీచమైన; హృదయదౌర్బల్యమ్= మనోదుర్బలత్వాన్ని; త్యక్త్వా= విడిచి; ఉత్తిష్ఠ= (యుద్ధమునకు) లెమ్ము.

**భావం:** ఓ అర్జునా! అధైర్యాన్ని పొందకుము. ఇది నీకు తగదు. నీచమైన ఈ మనోదుర్బలత్వాన్ని వీడి యుద్ధం చేయడానికి లెమ్ము.

## అన్నీ దైవికాలే!

మానుషము గాదు మఱి దైవికముగాని
రానున్నా అది రాకుమన్నఁ బోదు

అనుభవనకుఁబ్రాప్తమైనది
తనకుఁదానె వచ్చి తగిలికాని పోదు

తిరువేంకటగిరిదేవుని
కరుణచేతఁ గాని కలుష మింతయుబోదు.

(సంపుటం-01, సంకీర్తన-06)



మానవప్రయత్నంతో జరిగేవి ఏవీ లేవు. అన్నీ దైవనిర్ణయాన్ని బట్టి వస్తాయి. తెలుసుకుని జీవనం సాగించండి. రావలసి ఉన్నది మంచి గాని చెడు గాని రావద్దు అంటే రాకుండా ఉండదు. వచ్చే తీరుతుంది. దైవవశాన కలిగేదానిని ఎవరూ ఆపలేరు.

ఏనాడో చేసిన కర్మకు ఫలంగా మన అనుభవానికి ప్రాప్తించేది- దానంతటదే వచ్చి తగులుకుని గాని పోదు. అది- ఎంత తగలాలో అంతా తగిలి గానీ పోదు.

మనంచేసిన పాపం కొంచెం కూడా పోదు. పాపకర్మల ఫలం అనుభవించక తప్పదు. అయితే శ్రీవేంకటేశుని కరుణ కలిగితే పాప ఫలం తొలగడానికి అవకాశం ఉంది.

ఈ లోకంలో జరిగేవన్నీ మానవుని శక్తియుక్తులతో జరుగుతున్నవి కావు. దైవికాలే అని అన్నమయ్య పై సంకీర్తనలో తెలియజేశాడు.



# శ్రీవేదవల్లీ సమేత శ్రీవేదనారాయణస్వామి, నాగులాపురం

– శ్రీ ముదుచూరు దొరైస్వామి రెడ్డి, 98403 71576

వేదాలు అపహరించిన సోమకాసురుణ్ణి సంహరించి, వేదాలను రక్షించి, తిరిగి బ్రహ్మదేవునికి ఇవ్వడం వల్ల ఇక్కడి స్వామివారి పేరు శ్రీవేదనారాయణుడుగా సార్థకమైంది.

మత్స్యరూపుడైన శ్రీమన్నారాయణుడిని వెతుకుతూ శ్రీమహాలక్ష్మి, పరమశివుడు వెతకసాగారు. అప్పుడు శివుడు మత్స్యావతారాన్ని దర్శించి లక్ష్మీదేవికి "హరిని కంటి" అని తెలిపారు. ఆయనే ఇప్పుడు "శ్రీహరికంటేశ్వర స్వామి"గా కొలువై పూజలు అందుకుంటున్నాడు.

మత్స్యావతారుడై ఉన్న స్వామిని, బిడ్డల రూపంలో ఉన్న వేదాలను దర్శించిన లక్ష్మీదేవి మాతృస్పర్శతో బిడ్డలను తాకగా వారు వేదాలుగా మారారు. వేదాలను తాకిన అమ్మవారు అనర్గళంగా వల్లె వేయడంచేత అమ్మవారినామం శ్రీవేద వల్లిగా సార్ధకమైంది. ప్రస్తుతం స్వామి వారికి అభిముఖంగా శ్రీవేదవల్లి అమ్మ వారు భక్తులకు దర్శనమిస్తున్నారు. శ్రీమహా విష్ణువు వేదాలను మహేశ్వరుడు, లక్ష్మీ దేవి సమక్షంలో బ్రహ్మదేవునికి అప్పగిం చిన స్థలమే ఈ వేదపురి అనే వేదారణ్య క్షేత్రం. వేదోద్ధరణకోసం వచ్చిన హరిని వెతుకుతూ వచ్చిన పరమేశ్వరునికి ఇక్కడ హరి కనిపించడం వల్ల "హరికంటా పురం"గా పేరు గాంచింది.



## ఆలయ ప్రాశస్త్యం

మత్స్యరూపంలో శ్రీమహా విష్ణువు సముద్రగర్భంలో సంవత్సరాల కొద్దీయుద్ధం చేయడం వల్ల స్వామి దివ్యశరీరానికి వెచ్చదనం కోసం సూర్యభగవానుడు తన కిరణాలను స్వామిమీద ప్రసరింపచేశాడు. ఈ కారణంగానే నేటికీ సూర్యపూజోత్సవం జరుగుతుంది. సూర్యాస్తమయానికి ముందు ప్రధాన రాజగోపురం నుండి 630 అడుగుల దూరంలో గల మూలవిరాట్టుపై సూర్యకిరణాలు నేరుగా ప్రసరింపబడుతాయి. మొదటిరోజు స్వామివారి మత్స్యభాగంమీద, రెండోరోజు స్వామి నాభిమీద, మూడవరోజు శిరస్సుమీద సూర్య కిరణాలు ప్రసరించబడి స్వామిదివ్యమూర్తిని తేజోవంతం చేస్తాయి. ఈ అపురూపదృశ్యం చూడడానికి ఆంధ్రప్రదేశ్, తమిళ నాడు, కర్ణాటక, తెలంగాణనుండి ఎందరో భక్తులు వస్తారు.

జ్ఞానప్రదాయకుడు శ్రీహయగ్రీవస్వామిఆలయంలో ప్రదక్షిణమార్గంలో మనకు దర్శమిస్తారు. అందుచేత ఈ వేద క్షేత్రంలో అక్షరాభ్యాసం చేయిస్తే చిన్నారులకు బుద్ధివికాసం బాగా కలిగి చక్కని విద్యాబుద్ధులతో రాణిస్తారు.

స్వామివారిచెంత ఉంచి పూజించిన మత్స్యయంత్రాన్ని, శంకుస్థాపనకు, ఇంట్లో పెట్టుకుని పూజిస్తే వాస్తు దోషనివారణ జరుగుతుంది. ఆలయంలో మహామండపంలో ఉన్న నాగరాజ, గణేశస్వామివారిని, విష్ణు, దుర్గ అమ్మవారిని ఏకకాలంలో దర్శించడం వల్ల రాహు, కేతు దోషనివారణ, సర్పదోష నివారణ జరుగుతుంది.

మనశ్శాంతి, నవగ్రహశాంతి, కల్యాణసౌభాగ్యం, పుత్రసంతానం, భోగ భాగ్యాలకోసం కుటుంబసమేతంగా దర్శించుకోవాల్సిన పుణ్యక్షేత్రం ఈ స్వయంభూ మత్స్యావతార శ్రీ వేదనారా యణస్వామివారి క్షేత్రం. ఇక్కడ మత్స్య జయంతి, సూర్యపూజోత్సవం, వార్షిక బ్రహ్మోత్సవాలు మొ॥న ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి.

తిరుపతి–చెన్నై రహదారిలో (వయా పుత్తూరు, పిచ్చాటూరు, ఊత్తుకోట), తిరుపతికి 60 కి.మీ. దూరంలోను, చెన్నైకి 73 కి.మీ. దూరంలోను ఉన్న నాగులాపురం శ్రీవేదనారాయణ స్వామి దేవాలయం 24-09-1967 నుండి తి.తి.దేవస్థానం అధీనంలోకి వచ్చింది. అప్పటినుండి పూజకార్యక్రమాలు వైభవంగా జరుగుతున్నాయి.



వేంకటాద్రి సమం స్థానం
బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో
న భూతో న భవిష్యతి ॥


**గౌరవ సంపాదకులు**
శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఇ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి(ఎఫ్.ఏ.సి.), తి.తి.దేవస్థానములు.

**ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు**
డా॥ కె.రాధారమణ
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

**సంపాదకులు**
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

**ఉపసంపాదకులు**
డా॥ కంపల్లె రవిచంద్రన్,
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

**ముద్రాపకులు**
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

**ఫోటోలు**
శ్రీ పి.ఎన్.శేఖర్, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

సప్తగిరి మాస పత్రిక
ఇతర వివరాలకు
ఫోన్ నెంబర్లు
0877-2264543
0877-2264359
0877-2264360

విడి ప్రతి : రూ. 20/-
సంవత్సర చందా : రూ. 240/-
జీవితచందా(12 సం॥లకు) : రూ. 2400/-
విదేశాలకు సం॥చందా : రూ. 1030/-



తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక


# సప్తగిరి


సంపుటి : 53 ఏప్రిల్, 2023 సంచిక : 11


## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| శ్రీవేదవల్లీ సమేత శ్రీవేదనారాయణస్వామి, నాగులాపురం | శ్రీ ముడుచూరు దొరైస్వామి రెడ్డి | 04 |
| అరచేతిలో.. ఆనందనిలయుడి సేవలు!! | డా॥ కంపల్లె రవిచంద్రన్ | 07 |
| పుష్కర గంగ! | శ్రీ ఎస్.టి.జి.అంతర్వేది కృష్ణమాచార్యులు | 11 |
| శ్రీవేంకటాచల మాహాత్మ్యం | వచనం- ఆచార్య కె. సర్వోత్తమరావు | 15 |
| దర్శించండి! తరించండి!! | విద్వాన్ ముమ్మడి నారాయణ రెడ్డి | 17 |
| తండ్రికోపాన్ని పోగొట్టిన కొడుకు | డా॥ గుమ్మనూరు రమేష్‌బాబు | 20 |
| తిరుమల సమయాచారములు | కీ.శే. డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు<br>కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు | 21 |
| తల్లీ విశాలాక్షీ! | శ్రీమతి రమా శాండిల్య | 22 |
| గురువే దైవం! | శ్రీ వైద్యం వేంకటేశ్వరాచార్యులు | 24 |
| శ్రీకృష్ణామృతం | “అనంత” (కృష్ణసుందరి సత్తిరాజు) | 24 |
| తిరునత్తైయూర్ (నాచ్చియార్ కోయిల్) | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 25 |
| దివ్యకాశీ భవ్యకాశీ | శ్రీమతి భాగి సూర్య రమాలక్ష్మి | 31 |
| మనస్సును మార్చగలిగిన గురువు | బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు శర్మ | 34 |
| అపురూపం ఈ దర్శనం | శ్రీ బులుసు ప్రభాకరశర్మ | 36 |
| అలౌకిక అనుభూతి | ఆచార్య పాపిరెడ్డి నరసింహారెడ్డి | 37 |
| మోక్షమార్గదర్శి | ఆచార్య మాడభూషి శ్రీధర్ | 38 |
| రవ్వంత పుణ్యానికి కొండంత ఫలితం | శ్రీమతి జానపాటి మనస్విని | 39 |
| ఒక్కసారి స్నానం చేస్తే చాలు.. | శ్రీమతి పి.యస్.యమ్.లక్ష్మి | 41 |
| తిరుమల అడవుల్లోని అద్భుతం! | శ్రీ బి.వి.రమణ | 43 |
| ఆకలి తీర్చే తల్లి | డా॥ కందుకూరి వేంకటసత్యబ్రహ్మాచార్య | 45 |
| అల్లుల అధికారం | కీ.శే. విద్వాన్ కట్టానరసింహులు | 46 |
| దేహముంటేనే ధర్మాచరణ సాధ్యం! | డా॥ వడ్డేపల్లి శ్రీనివాసరావు | 46 |
| వేసవిని జయించండి!! | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 47 |
| భగీరథప్రయత్నం (చిత్రకథ) | కథ: డా॥ కంపల్లె రవిచంద్రన్<br>చిత్రాలు: శ్రీ తుంబల్లి శివాజీ | 48 |
| శివాజ్ఞ లేనిదే... | శ్రీమతి నల్లాని రాజేశ్వరి | 50 |
| బాలవినోదం | | 51 |
| క్విజ్ (09) | | 52 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి | 53 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకటఅప్పలాచార్యులు | 54 |


ముఖచిత్రం : శ్రీసీతాసమేత శ్రీకోదండరామస్వామివారు, ఒంటిమిట్ట
వెనుకచిత్రం : గంగాహారతి (చిత్రం- శ్రీ పి.శివప్రసాద్)


ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.



24 గంటలూ పనిచేసే
తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్ నెం.
0877 2277777 / 2233333

వెబ్‌సైట్- www.tirumala.org; 'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు- sapthagiri.helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

సంపాదకీయం

# గంగకు నమస్కారం!

మానవుడి జీవితమంతా నదులతోనే ముడిపడి ఉంది. ఒక ప్రాంతంలోని ప్రజలసంస్కృతి, ఆచారవ్యవహారాలు, ఆర్థిక స్థితిగతులు, అభివృద్ధివంటివన్నీ అక్కడున్న నది నీటిపైనే ఆధారపడి ఉంటాయి. అందుకే మానవుడు తన జీవనానికి ఆలంబన, ఆధారం అయిన నదీమతల్లులను, నీటివనరులను ప్రకృతి దేవతలుగా ఆరాధిస్తూ ఉన్నాడు. మన సనాతనధర్మంలో నదులది విశేషస్థానం.

మనకెన్నో నదులు ఉన్నప్పటికీ ప్రధానంగా మనం నది అనేటప్పటికి స్మరించేది, నది అంటే నమస్కరించేది, జీవితంలో ఒక్కసారైనా మనం వెళ్ళి స్నానం చేసేది, చెయ్యాలని కోరుకునేది గంగానది. ఈ నదిని అమ్మ అన్న పేరు కలపకుండా మనం అసలు సంబోధనచేయం. గంగమ్మ అనే అంటాం. అమ్మ అన్న సంబంధంతో గంగ అంత అనుబంధాన్ని పెంచుకుంది. భారతీయుల జీవితాలలో మమేకమైపోయింది. సనాతనధర్మానికి ఆయువుపట్టుగా గంగానది ఉన్న కారణం చేతనే, భారతదేశానికి ఇంత ఖ్యాతి వచ్చింది. ఏడాదికి రెండు కోట్లమందికి పైగా సందర్శించుకునే గంగానదిని భారతీయుల ఆత్మగా భారతప్రప్రథమ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ అభివర్ణించాడు. మనం ఎక్కడకు వెళ్లినా గంగానది అని పేరు చెప్పే టప్పటికి రెండుచేతులూ ఎత్తి నమస్కరించని వాళ్లు ఉండరు. గంగాస్నానం అంటే పరవశించిపోతారు. మిగిలిన నదులజలాలు ఇంట్లో ఉంటాయో ఉండవో కానీ, ఎవరైనా కాశీ యాత్ర చేసి వచ్చి గంగానది జలం ఉన్న చిన్న కలశం తీసుకుని వచ్చి ఇస్తే ఎంతో పవిత్రంగా పూజామందిరంలో ఉంచుకుని నమస్కరించు కుంటాం. పరమపవిత్రమైన వస్తువు గురించి చెప్పాల్సివస్తే 'గంగ అంత పవిత్రం', అంటారు. గంగ సంబంధం, స్పర్శ లేకుండా ఏ పురాణం, కావ్యం కనబడవు. గంగా స్నానం, సంప్రోక్షణం, దర్శనం, గంగనామం, స్మరణం అంత గొప్పవిగా కీర్తించబడ్డాయి.

శంకరభగవత్పాదులు భజగోవిందంలో– *'భగవద్గీతా కించిదధీతా గంగాజల లవకణికాపీతా। సకృదపి యేన మురారి సమర్చా క్రియతే తస్య యమేన న చర్చా॥'* అంటారు.

కొంచమైనా భగవద్గీత చదివి, గంగ నీరు ఒక్క బొట్టైనా తాగి, ఒకసారైనా మురారిని పూజించినవారికి యముడితో వివాదం ఉండదు అని పై శ్లోక తాత్పర్యం.

ఇంతటి గొప్పదైన మహిమాన్వితమైన గంగానదీమతల్లి పుష్కరాలు ఈ నెల 22వ తేదీ నుండి ప్రారంభమౌతున్నాయి. పుష్కరాలంటే స్నానాలు, దానాలు. ప్రకృతి ఆరాధనలో ఇది ఒక భాగం.

ఆకాశం అంత గంగ! అనంతంగా ఉంటుంది. భూదేవంత గంగ, బుజబుజరేకుల్లా ఉంటుంది. కళ్ల నిండుగా గంగ, గుండె నిండుగా గంగ, గుడిదీపంలా గంగ.

ఒకసారి గంగను దర్శిస్తే, భక్తులు తన్మయత్వానికి లోనౌతారు. పుష్కరాల సమయాల్లో గంగ మహా సుందరంగా తీర్చదిద్దబడి ఉంటుంది. కాశీక్షేత్రంలోని ఘాట్‌లన్నీ దీపాలతో వెలిగిపోతుంటాయి. పాటలతో పరవశించిపోతుంటాయి. శంఖ ధ్వని చెలరేగుతుంటుంది. ఢమరుకనాదం జలదరిస్తోంటుంది. గంటలు గణగణమంటుంటే గంగ గల గల మంటూంటుంది. భక్తులలో తెలియని తన్మయత్వం, చెప్పలేని సంతోషం. ఎక్కడ చూచినా పట్టుపంచెలు, పట్టు ఉత్తరీయాలు ఎరుపురంగుదుస్తులు, చేతిలో హారతిదివ్వెలు, కళ్లల్లో భక్తి ప్రపత్తులు... చూడముచ్చటగా ఉంటుంది గంగమ్మతల్లి. హారతులూ చల్లనిగాలులూ గుండెల్లో పొదువుకుని గంగామాత గంభీరంగా సాగిపోతుంది. నిత్యావసరమైన నీటిదేవతకు పుష్కరసందర్భంలో పూజలు చేయడం, ధూపదీపనైవేద్యాలు సమర్పించడం గొప్ప సంస్కారం.

ఇందులో భాగంగా పవిత్ర గంగామాత పుష్కరాలను పురస్కరించుకుని ఈ మాసం సప్తగిరి పత్రికను గంగాపుష్కరాల ప్రత్యేక సంచికగా తీసుకుని వస్తున్నాం! భక్తులు, పాఠకులు ఈ ప్రత్యేకసంచికను ఆదరించి, గంగమ్మతల్లి కృపకు పాత్రులు కావాలని ఆకాంక్ష! అలాగే భక్తులందరూ గంగాపుష్కరయాత్రలు చేసి ముక్తిని, మనోల్లాసాన్ని పొందగలరని ఆశిస్తున్నాం!

*దేవి! సురేశ్వరి! భగవతి! గంగే త్రిభువనతారిణి తరళతరంగే!*
*శంకరమౌళి విహారిణి! విమలే! మమ మతి రాస్తాం తవ పదకమలే!*




"నీ కొండకు నీవే రప్పించుకో..
ఆపదమొక్కులు మా చే... ఇప్పించుకో.."

కుల, మత, ప్రాంత, వర్గ, వర్ణాలకు అతీతంగా కొండలయ్యకి మొక్కే కోట్లాదిమంది భక్తుల్లో ప్రతి ఒక్కరి వేడుకోలూ ఇదే.

"ఓ ..తిరుపతి వేంకటేశా....
ఓ ..తిరుపతి వేంకటేశా.. ఓ శ్రీనివాసా...
నీవిచ్చిన ఈ జన్మకు విలువ కట్టుకో.." అంటూ ఎలుగెత్తి మొక్కే ఆ భక్తజన ప్రతిరూపమైన తిరుమలతిరుపతిదేవస్థానం (తి.తి.దే.) వహిస్తున్న అనుసంధానకర్తృత్వానికి చోదకం కూడా–

'నీ కొండకు నీవే.. రప్పించుకో..
ఆపదమొక్కులు మా చే...ఇప్పించుకో...' అనే గీత పరమార్థమే!

"వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన వేంకటేశ సమోదేవో న భూతో న భవిష్యతి..." – కదా. అటువంటి వేంకటేశుడు, తిరుమలయ్య తన చెంతకు అశేషభక్తకోటిని రప్పించుకునే మార్గాలు సుగమం కావడానికి, నిధాన విధానాలు సులభతరం చేయడానికి ఎప్పటికప్పుడు వినూత్న సదుపాయాలను తి.తి.దే. కల్పిస్తూనే ఉంది. ఆ కల్పనలో తాజా తరుణోపాయ మంత్రమే–'శ్రీ టీటీ దేవస్థానమ్స్' మొబైల్ యాప్.

-----

"మా మనస్సు, మా హృదయం పరస్పరం శత్రువులై
మా లోపలి దివ్యజ్యోతి మసకేసి పోతున్నది
అహంకార మణగించి మమకారం తొలగించి
చేయూత నిచ్చి మమ్ము చేరదీసుకో..
..... ..... ..... ..... .....
నీ కొండకు నీవే.. రప్పించుకో..."

ఆ పాట రచయిత తనలోని ఆర్తిని, ఆరాటాన్నీ ప్రతి భక్తుడిలో పలికించేలా రాశాడేమో అనిపిస్తుంది.

ఊపిరి సలపనంత పనుల ఒత్తిడి వల్ల తిరుపతి వెంకన్నని దర్శించుకోలేకపోతున్నాననే దిగులుతో, విచారంతో రాశారట ఆ గీతాన్ని:

"కొండంత సంసారం మోయలేని మానవులం
ఏడూకొండలనెక్కి రమ్మంటే రాలేము
సాటిమనిషి సౌఖ్యానికి సాయపడని దుర్బలులం,
స్వర్గానికి నిచ్చెనలు వేయలేమూ...
..................
నీ కొండకు నీవే..రప్పించుకో..
ఆపద మొక్కులు మాచే...ఇప్పించుకో..."

ఆ గీతానికి మునుపు, ఆ తర్వాత కూడా ఆ బ్రహ్మాండ నాయకుడు తన సన్నిధానానికి భక్తకోటిని రప్పించుకుంటూనే ఉన్నాడు.

**(తి.తి.దేవస్థానం నూతనంగా ప్రారంభించిన 'శ్రీ టి.టి.దేవస్థానమ్స్' యాప్ పై ప్రత్యేకకథనం)**

కానీ, సౌకర్యాల్లో అప్పటికి ఇప్పటికీ ఎంత తేడా! అనుసంధానకర్త పాత్ర నిర్వహించే తి.తి.దే. ఎప్పటికప్పుడు వ్యవస్థల్ని ఆధునికం, అత్యాధునికం చేస్తూ వస్తోంది. విధానాల మెరుగుదల, పద్ధతుల ఉన్నతీకరణ, లోపాల సవరణ, వ్యవస్థల ప్రక్షాళన... ఇత్యాదులన్నీ భగవంతుడిని భక్తుడికి చేరువ చేయడమే! బాధ్యతాయుతంగా, పూర్తి అంకితభావంతో తి.తి.దే. చేస్తున్న సేవ పరమార్థం – భగవద్దర్శనానికి సాధ్యమైనంత వెసులుబాటు కల్పించడమే.

“కట్టెదుర వైకుంఠము కాణాచయిన కొండ
తెట్టెలాయ మహిమలే తిరుమలకొండ...” అని సన్నుతించి, సంతోషించాడు కదా అన్నమయ్య.

‘వేదములే శిలలై వెలసిన దీ కొండ
ఏదెస పుణ్యరాసులే యేరులైనదీ కొండ
గాదిలి బ్రహ్మాదిలోకముల కొనల కొండ
శ్రీదేవు డుండేటి శేషాద్రి ఈ కొండ...’కి, తన కొండకి తానే భక్తుణ్ని రప్పించుకునే శ్రీవారికి ఉడతాభక్తిగా తన వంతు సేవ అందిస్తున్న తి.తి.దే. ఇప్పుడు ‘శ్రీ టీటీ దేవస్థానమ్స్’ యాప్ ని అందుబాటులోకి తీసుకురావడం ఒక కీలకఘట్టం అని చెప్పవచ్చు.

### వేంకటేశ నీ చే నిమ్మపండైన

నెరబిరుదిన్నిటాను నీ బంటు
వారసె గగనమదివో నీ బంటు

మించిన చుక్కలు మొలపూసలుగాc
బెంచె మేను పెళపెళనార్చి
అంచులు మోవcగ నబ్జభవాండము
నించె నార్భటము నీ బంటు

గగనలోకములు గడగడ వణcకcగ
నెగసె హుటాహుటి నీ బంటు
మగటిమి మెరయcగ మందులకొండకు
నిగిడి కోయనుచు నీ బంటు

## ఈ కొత్త యాప్ కచ్చితంగా అవసరమా?

మొబైల్ అప్లికేషన్ని కంప్యూటర్ యాప్ అంటారని తెలిసిందే! ప్రస్తుతం సర్వం యాప్స్ మయం కదా! తినడానికి, ఆరోగ్యానికి, వినోదానికి, చదువుకోవడానికి... ప్రతిదానికీ యాప్స్. అసలు యాప్స్ అంటే ఏమిటో తెలుసుకోకుండానే వాడేస్తాం. ఈ రోజుల్లో స్మార్ట్ ఫోన్ లేని మనుషులు ఉండటం చాలా అరుదే కదా.

ఫోన్లు, టాబ్లెట్లు మరియు ఇతర పరికరాల ఆపరేటింగ్ సిస్టమ్లో ఉపయోగించడానికి ‘శ్రీ టీటీ దేవస్థానమ్స్’ యాప్ రూపొందించబడింది.

జియో ప్లాట్ఫార్మ్ సపోర్ట్తో అభివృద్ధి చేయబడ్డ ఈ యాప్కోసం కోట్లాది రూపాయలను తిరుమల తిరుపతి దేవస్థానం వెచ్చించింది. ప్రపంచంలోని ఏ యాప్ స్థాయికైనా మించిన ఫీచర్లు ఉన్న ‘శ్రీ టీటీ దేవస్థానమ్స్’ను తీసుకురావడంలో యాజమాన్యం కృషి ఎన్నదగింది.

ఇంత శ్రమకోర్చి, అన్ని కోట్ల వ్యయాన్ని భరించి ఈ కొత్త యాప్ తీసుకురావల్సిన అవసరం ఉన్నదా? కచ్చితంగా ఉంది. కరోనా తర్వాత తిరుమల దర్శనానికి అనుమతించే విధానంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. దర్శనానికి వచ్చే భక్తులకు ఆన్లైన్ టిక్కెట్ బుకింగ్ తప్పనిసరి అయ్యింది. అంతకుముందు కూడా వెబ్సైటులో ఆన్లైన్ దర్శనం టికెట్ బుకింగ్ విధానం ఉన్నప్పటికీ, కరోనా కారణంగా అది ఆన్లైన్ దర్శనం టిక్కెట్ బుకింగ్ ఒక చాయిస్గా కాకుండా, తప్పనిసరి చేశారు.

కాబట్టి నేటి యువ యుగంలో, ప్రతిదీ మొబైల్ యాప్ ఆధారితసేవలతో అభివృద్ధి చెందుతోంది కాబట్టి యాప్ అనివార్యం అయ్యింది. అందరి అరచేతిలో ఇప్పుడు ఉసిరికాయ అయ్యింది.

**ఇమ్ముల రఘుపతి హితుఁడై సీతకు**
**నెమ్మన మలరిన నీ బంటు**
**కమ్మర నిదె వేంకటేశ నీచే**
**నిమ్మపండైన నీ బంటు (4-67)**

హనుమయ్య శ్రీవేంకటేశ్వరుని నమ్మినబంటు అని స్తుతిస్తూ అన్నమయ్య చేసిన సంకీర్తనం ఇది. 'నెరబిరుదు' అంటే గొప్ప సమర్థుడనే కదా అర్థం. కలియుగప్రత్యక్షదైవం వేంకటేశ్వరుడికి అలాంటి సమర్థవంతమైన బంటు- తి.తి.దే. 'వేంకటేశ నీచే నిమ్మపండైన నీ బంటు- అంటే, ఆ నమ్మిన బంటు ఆయన చేతిలో నిమ్మపండు వంటివాడని అభివర్ణన. అరచేతిలో నిమ్మకాయ, అంటే ఉసిరికాయ అని హస్తామలకము (హస్త- చేయి, అమలకం- ఉసిరికాయ) అని, ఇంకా కరతలమలకం అనీ అంటారని తెలిసిందే కదా. శ్రీవారికి అరచేతి ఉసిరి వంటి టీటీడీ- భక్తజనావళికి అందించిన కరతలామలకం- **'శ్రీ టీటీ దేవస్థానమ్స్' యాప్.**

తిరుమలను దర్శించడానికి శ్రీవారిభక్తులకు- **'శ్రీ టీటీ దేవస్థానమ్స్' యాప్** నిజంగా అరచేయి అంత మొబైల్‌ఫోన్‌లో ఉసిరికాయే. తిరుమలకు వెళ్లిన భక్తుల్లో ఎక్కువమందికి- ఎక్కడ ఉండాలో? ఎలా టిక్కెట్లు కొనాలో కూడా తెలీదు. మధ్యవర్తుల మాటలను నమ్మి మోసపోయేఘటనలు కోకొల్లలు. అలాంటి వారికి కచ్చితంగా ఈ యాప్ కరతలామలకమే. ఈ యాప్‌లో కాటేజీలను బుక్ చేసుకోవచ్చు. వసతిసౌకర్యాల ఏర్పాట్లను ఈ యాప్ ద్వారా ముందే ఏర్పాటు చేసుకోవచ్చు. అలాగే దర్శనానికి సంబంధించిన టిక్కెట్లను కూడా కొనుగోలు చేసుకోవచ్చు. ప్రత్యేకప్రవేశ దర్శనంనుంచి, దివ్యాంగులు, వయోవృద్ధులవంటి వారి కోసం కూడా ప్రత్యేకంగా టికెట్లను కొనుక్కోవచ్చు. కల్యాణ మంటపాల్ని కూడా ఆన్‌లైన్లోనే బుక్ చేసుకోవచ్చు.

తిరుపతికి రాలేక.. స్వామివారికి విరాళాలు అర్పించాలని ఉన్నా.. అర్పించలేకపోతున్న భక్తులకు కూడా ఈ యాప్ ద్వారా ఒక మార్గాన్ని సూచించారు. **'నీ కొండకు నీవే రప్పించుకో.. ఆపదమొక్కులు మా చే... ఇప్పించుకో..'** అని స్వామివారికే తమ బరువుబాధ్యతలు అప్పగించేసినట్టు ఈ యాప్‌ను డిజైన్ చేశారు. విరాళాలను కానివ్వండి.. స్వామి వారికి కానుకలను కానివ్వండి.. ఈ యాప్ ద్వారా ఆన్‌లైన్లో పంపించొచ్చు. శ్రీ వేంకటేశ్వర ప్రాణదానట్రస్టుకు విరాళాలను కూడా ఆన్‌లైన్‌లోనే పంపించవచ్చు. ఇక దర్శనం, కానుకల వంటివే కాకుండా.. భక్తులకు విలువైన సమాచారం కూడా ఈ యాప్‌లో ఉంది.

**ఈ 'శ్రీ టీటీ దేవస్థానమ్స్' యాప్ ను ఈ (https:// play. google.com/ store/apps/details?id= com.ttdapp) లింక్ ద్వారా డౌన్ లోడ్ చేసుకోవచ్చు.**



స్వామివారి **రింగ్‌టోన్స్**ను ఈ యాప్‌ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వీనులవిందైన 17 రకాల రింగ్ టోన్స్ ఈ యాప్‌లో భక్తులకు అందుబాటులో ఉన్నాయి. అంతేకాదు.. వీటిని ఇతరులకు నేరుగా యాప్‌నుంచే షేర్ కూడా చేసుకోవచ్చు. రింగ్‌టోన్సే కాకుండా **వీడియోలు** కూడా ఈ యాప్‌లో అందుబాటులో ఉన్నాయి. శ్రీవారి బ్రహ్మోత్సవం, శ్రీపద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవం, పవిత్రోత్సవం, శ్రీవారిసేవలకు సంబంధించిన వివిధవీడియోలు ఈ యాప్‌లో ఉన్నాయి.

అంతే కాదు.. భక్తులకు ఎంతో విలువైన సూచనలు, సలహాలు ఈ వీడియోల రూపంలో ఉన్నాయి. చాలామంది భక్తులకు అసలు తిరుమలయాత్రలో ఏం చేయాలి? ఏం చేయకూడదు...? వంటి విషయాలు తెలియదు. తెలియక పొరపాట్లు చేసి స్వామివారి కృపకు పాత్రులు కాకుండా పోతుంటారు. అయితే ఈ యాప్‌లో తిరుమల యాత్రకు వచ్చేవారు ఏం చేయాలి. ఏమేం పనులు చేయకూడదు వంటి అంశాలను వీడియోలరూపంలో అందుబాటులో ఉంచారు.

అలాగే తిరుమలకు సంబంధించిన వార్తలు, ఇతర నియమనిబంధనలకు సంబంధించిన పూర్తి సమాచారం కూడా ఈ 'శ్రీ టీటీ దేవస్థానమ్స్' యాప్‌లో ఉన్నాయి.

## భక్తులు ఇబ్బంది పడకూడదని...

27-01-2023 న 'టీ.టీ. దేవస్థానమ్స్' పేరుతో రూపొందించిన మొబైల్ యాప్‌ను తి.తి.దే. ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ వై.వి. సుబ్బారెడ్డి ప్రారంభించారు.

భక్తుల కోసం ఇదివరకు 'గోవింద' మొబైల్ యాప్ ఉండేది. దీన్ని మరింత ఆధునీకరించి, మరిన్ని అప్లికేషన్స్ పొందుపరచి నూతన యాప్‌ను రూపొందించారు.

ఈ మొబైల్ యాప్ ద్వారా భక్తులు తిరుమల శ్రీవారి దర్శనం, సేవలు, వసతి, అంగప్రదక్షిణ, సర్వదర్శనం, శ్రీవారిసేవ బుక్ చేసుకోవచ్చు.

విరాళాలు కూడా ఇదే యాప్ నుండి అందించవచ్చు. పుష్ నోటిఫికేషన్స్ ద్వారా తిరుమల శ్రీవారి ఆలయంలో ముందుగా జరిగే ఉత్సవాలు తెలుసుకోవచ్చు.

ఎస్.వి.బి.సి. ప్రసారాలను లైవ్ స్ట్రీమింగ్ ద్వారా ఈ యాప్ సహాయంతో చూడవచ్చు.

భక్తులు లాగిన్ అయ్యేందుకు యూజర్ నేమ్‌తో పాటు ఓటిపి ఎంటర్ చేస్తే చాలు, పాస్‌వర్డ్ అవసరం లేదు.

కంప్యూటర్ వాడకం తెలియనివాళ్లు కూడా వినియోగించేందుకు ఈ ప్రపంచస్థాయి యాప్‌ను రూపొందించారు.

ప్రారంభించిన ఒక రోజులోనే పది లక్షలమందికి పైగా భక్తులు ఈ మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం విశేషం!



సుందరకాండ పఠనం, శ్రీమద్భగవద్గీత, ఆదిపర్వం, వేదపారాయణం, బాలకాండ, విరాటపర్వం, సభాపర్వం, సంపూర్ణ సుందరకాండ.. వంటి అమూల్యమైన సమాచారం వీడియోల రూపంలో ఉంది.

ఇవే కాకుండా.. శ్రీవారికి సంబంధించిన **పుస్తకాలు, ఇతర ధార్మికప్రచురణలను** కూడా ఈ యాప్‌లో పొందు పరిచారు. ఈ యాప్‌లోనే వాటి పీడీఎఫ్ ఫైల్స్‌ను ఉచితంగా డౌన్లోడ్ చేసుకుని చదువుకునే వెసులుబాటు కూడా ఉంది.

శ్రీవారి భక్తులు తమ ఫోన్లలో పెట్టుకునే **వాల్‌పేపర్స్ ఫోటో**లను అత్యంతనాణ్యతతో ఈ యాప్‌లో ఉంచారు. పలు రూపాల్లో ఉన్న శ్రీవారి ఫొటోలు భక్తులను ఆకట్టుకుంటాయి. రింగ్‌టోన్స్‌వంటివే కాకుండా.. భక్తిపాటలు కూడా ఈ యాప్ ద్వారా వినొచ్చు. ఆస్వాదించొచ్చు.

అలాగే ఈ యాప్‌లో ఉన్న టోల్ ఫ్రీ నెంబర్, ఈమెయిల్ ఐడీల ద్వారా ఇబ్బందులను, ఇతర సమాచారాన్ని కూడా సంబంధిత అధికారులతో పంచుకోవచ్చు. పరిష్కార మార్గాలను కోరవచ్చు. ఇవే కాకుండా పంచ గవ్యఉత్పత్తులను కూడా ఈ యాప్ ద్వారా కొనుగోలు చేసుకోవచ్చు.

తి.తి.దే. నూతనంగా ప్రవేశపెట్టిన ఈ యాప్‌ను భక్తులు విరివిగా ఉపయోగించుకొని, దళారీలను ఆశ్రయించ కుండా, దేనికీ ఇబ్బందిపడకుండా మీ తిరుమల యాత్రను సుఖప్రదం, శుభప్రదం చేసుకోండి.



మనదేశంలోని సప్తమోక్షనగరాల్లో కాశీ ఒకటి



# పుష్కర గంగ!

- శ్రీ ఎస్.టి.జి. అంతర్వేది కృష్ణమాచార్యులు
99123 53423

భారతదేశనదులలో అతిముఖ్యమైంది, అత్యంత పవిత్రమైంది, హిందువులందరికి పరమపూజనీయమైంది గంగానది. ఈ నది స్మరణం వలనే సమస్తపాపాలు శమిస్తాయి. సకలశుభాలు కలుగుతాయి. బలిచక్రవర్తి యాగం చేసే సమయంలో, శ్రీమహా విష్ణువు వామనరూపంలో వచ్చాడు. మహాదాత అయిన బలి చక్రవర్తిని, వటుడు మూడుఅడుగుల నేలను దానం చేయమని అడుగగా దానికి సమ్మతించిన బలిచక్రవర్తి మూడడుగుల నేలను దానం చేశాడు. వామనుడు ముందడుగుతో భూలోకాన్ని, రెండవ అడుగుతో ఆకాశాన్ని ఆక్రమించాడు. వామనుడు మూడవ అడుగును బలి తలపై నిలిపి అతణ్ణి పాతాళలోకానికి అణచివేశాడు. వామనమూర్తి రెండవ అడుగు ఆకాశమంతటిని ఆక్రమించగానే పరమేష్ఠి ఆ పాదపద్మానికి నమస్కరించాడు.

బ్రహ్మ తన కమండలంలోని జలంతో వామనుని పాదాన్ని కడిగాడు. ఆ జలమే మరింత పవిత్రమై ఆకాశగంగా రూపంగా పరిణితి చెందింది. విష్ణు పాదోద్భవి అయిన, ఈ నది ఆకాశం నుండి ప్రవహించి శ్రీహరి కీర్తి వలె ముల్లోకాలను పవిత్రం చేసింది.

వామనావతారసమయంలో శ్రీహరి రెండవ అడుగుతో ఆకాశాన్ని ఆక్రమించినపుడు ఆయన పాదాంగుళి తాకిడికి బ్రహ్మాండానికి రంధ్రమై దానినుండి బయటకి వచ్చిన జలధార విష్ణుపాదంపై బడి సురనది(గంగ)గా మారిందని వామన పురాణం చెబుతోంది.

గంగానది శ్రీకృష్ణుని దేహంనుండి పుట్టిందని బ్రహ్మ వైవర్త, నారదపురాణం, భాగవతం చెబుతున్నాయి. గోలోకంలో రాధాదేవి కార్తిక పౌర్ణిమనాడు ఒక ఉత్సవం జరిపింది. ఆ ఉత్సవానికి బ్రహ్మాది దేవతలందరూ వచ్చారు. బ్రహ్మ ప్రేరేపితుడైన శంకరుడు శ్రీకృష్ణుని గురించి గానం చేయగా, ఆ గానానికి ముగ్ధుడైన శ్రీకృష్ణుడు ద్రవీభూతుడౌతాడు. ఆ ద్రవమే గంగా నదిగా మారింది. ఆ గంగను బ్రహ్మ తన కమండలంలో పట్టి తన లోకానికి, శంకరుడు ఆమెను శిరస్సున ధరించి కైలాసానికి తీసుకువెళ్లారని పురాణోక్తి.

ఆకాశసముద్రమని ప్రసిద్ధికెక్కిన సోమ మను పేరుగల సముద్రంనుండి ఆకాశంలో ప్రవహించే నది ఒకటి బయలుదేరింది. అది మేరు శిఖరం పైబడి సీత, అలకనంద, చక్షు, భద్ర అనేపేర్లతో నాలుగు పాయలుగా చీలింది. ఆయా స్థలాల్లో ప్రవహించి కొన్ని వందలపర్వతాలను చీల్చుకుని భూమికి చేరుటచేత ఆ నదికి గంగ అనేపేరు కలిగిందని వరాహపురాణం చెబుతోంది.

**ఏప్రిల్ 22వ తేదీ నుండి గంగానది పుష్కరాలు ప్రారంభం**

ఆకాశంలో ఉన్న సముద్రం పేరు సోమార్ణవం. అది దేవతలకు అమృతజలాన్ని ప్రసాదిస్తోంది. దాని నుంచి గంగా నది పుట్టిందని లింగపురాణం చెబుతోంది. బ్రహ్మాండ పురాణ కథనం ప్రకారం అగస్త్యుడు సముద్రజలం మొత్తం త్రాగగా, ఆ సముద్రజలాలు మళ్లీ గంగానదీజలంతో నిండాయి. రామాయణంలో గంగను హిమవంతుని పెద్దకూతురుగా వర్ణించారు.

గంగాదేవి తొలిజన్మలో కర్దమపుత్రిక కళకు మరీచునకు పుట్టిన కుమార్తె. అపుడామె పేరు పూర్ణిమ. ఆమే మరుజన్మలో శ్రీహరిపాదాల నుండి గంగ అనే పేరుతో పుట్టింది.

## గంగకు కల వివిధపేర్లు

**భాగీరథీ:** సూర్యవంశంలో భగీరథుడు తపస్సు చేసి శివుడిని మెప్పించి శివుని శిరసుపై గల గంగను తన వెంట తీసుకుని వెళ్లి తన పితృ దేవతల భస్మరాశి మీద ప్రవహింపచేసి వారికి సద్గతులను కల్పించాడు. ఇలా ఆకాశంలో ఉన్న గంగ భగీరథునిచే భూమికి తీసుకురాబడింది గనుక గంగకు భాగీరథీ అనే పేరు వచ్చింది.

**జాహ్నవి:** గంగను భగీరథుడు తన వెంట తీసుకు వెళుతుండగా, మార్గమధ్యంలో గల జహ్నుమహర్షి ఆశ్రమాన్ని గంగ ముంచెత్తింది. అందుకు జహ్నువు ఆగ్రహించి గంగను మ్రింగాడు. అది చూచిన భగీరథుడు గంగను విడవమని, జహ్నుని ప్రార్థించాడు. శాంతించిన జహ్నుడు మ్రింగిన గంగను తన కుడి చెవి నుండి వదిలాడు. ఈ విధంగా జహ్నుని నుండి కన్యాస్వరూపంలో (జహ్నుని కూతురుగా) వచ్చినందువల్ల గంగ జాహ్నవి అయింది.

**భీష్మసూ:** ప్రదీపుని కుమారుడు శంతనుడు. పూర్వజన్మలో ఇతడు బ్రహ్మచే శపింపబడ్డ మహాభిషుడనే రాజర్షి. శంతనుడు ఒకనాడు అరణ్యంలో సంచరిస్తూ దప్పికతో నదీ సమీపానికి వెళ్లాడు. అక్కడ సుందరశరీరంతో విహరిస్తున్న గంగాదేవిని చూచి మోహించి ఆమెను పెళ్లాడాలనుకున్నాడు. అతని అభిలాష తెలుసుకున్న గంగ, "ఓ రాజా! నేను నిన్ను పెళ్లి చేసుకుంటాను. కానీ, నేను ఏమి చేసినా నీవు కారణమడుగ కూడదు. ఒకవేళ నీవు నన్ను ఏమైనా ప్రశ్నించిన పక్షంలో నేను నీ వద్ద నుండి వెళ్లిపోతాను", అని షరతు విధించింది. దానికి అంగీకరించిన శంతనుడు గంగను గాంధర్వ వివాహం చేసుకున్నాడు. కొంతకాలానికి గంగ ఒక మగశిశువును ప్రసవించింది. గంగ పూర్వం అష్టవసువులకు ఇచ్చినమాట ప్రకారం ప్రసవించిన శిశువును నదిలో పడవేసింది. అది చూచిన శంతనుడు తీవ్రంగా చింతించాడు.



ఇదే విధంగా గంగ ఆరుగురు కుమారులను నదిలో పడవేసింది. గంగ అష్టమసంతతిని కూడా పైవిధంగా చేయడానికి నిశ్చయించుకుంది. శంతనుడు వారించాడు. ఇందుకు శంతనునిపై ఆగ్రహించిన గంగ ఆ పుత్రుని శంతనుని వద్దే విడచి వెళ్లిపోయింది. ఆ పుత్రుడే శంతనుని కోరిక తీర్చడానికి ఆజన్మ బ్రహ్మచర్యవ్రతాన్ని పూనిన భీష్ముడు. వసువైన భీష్ముని కనడం వల్ల గంగకు 'భీష్మసూ' అనే పేరు వచ్చింది.

విష్ణుపాదం నుండి ఉద్భవించడం వల్ల గంగకు **'విష్ణుపది'** అని పేరు. గంగానది స్వర్గలోకంనుండి భూలోకానికి, అక్కడి నుండి పాతాళలోకానికి చేరడం వల్ల 'త్రిపథ'గా అని పిలువబడుతోంది. వైకుంఠంలో పుట్టి బ్రహ్మలోకాన్ని, అక్కడ నుండి దేవలోకాన్ని గంగ చేరవచ్చింది. అక్కడ 'మందాకిని' అనే పేరుతో గంగ వ్యవహరింపబడుతోంది. అంతేకాక దేవలోకంలో గంగ ఉండడంవల్ల 'సుర నిమ్న' అని, ఆకాశంలో ప్రవహించడం వల్ల ఆకాశగంగ, వియద్గంగ అని పిలువబడుతోంది. దేవలోకంనుండి, హిమవత్పర్వతం పైబడి, భూమిని చేరే గంగాప్రవాహం 'అలకనంద' అనేపేరుతో కీర్తించబడుతోంది. ఇంకా 'నంది', 'నళిని', 'దక్షపుత్రి', 'విహగ', 'విశ్వకాయ', 'అమృత', 'శివ', 'విద్యాధరి', 'సుప్రశాన్త', 'విశ్వప్రసాదిని', 'క్షేమ', 'జాహ్నవి', 'శాన్త', 'శాన్తిప్రదాయిని' అన్న పేర్లు గంగకు ఉన్నట్టు మత్స్యపురాణం ద్వారా తెలుస్తోంది.

## గంగానది ప్రస్థాన ప్రగతి

గంగానది హిమాలయాలలోని గల్‌దాల్‌ప్రాంతంనుండి మొదలై గోముఖం నుండి భాగీరథిగా బయటకు వస్తోంది. గోముఖం నుండి బయటకు వచ్చిన భాగీరథి గొప్ప ప్రవాహంతో సుడులు తిరుగుతూ, కొండరాళ్ల, బండరాళ్ల మీదుగా పారుతూ చీర్‌బాసా అడవుల్లో ప్రవహిస్తోంది. వాయవ్యదిశగా పయనించి గోముఖం నుంచి ఇరవైఎనిమిది కిలోమీటర్ల దూరంలో కల గంగోత్రిని చేరుతోంది. గంగోత్రి సముద్రమట్టానికి పదమూడువేల అయిదువందల అడుగుల ఎత్తున ఉంది. ఇక్కడ గంగామాత గుడి ఉంది. దీనిలో గంగామాత, భగీరథుని విగ్రహాలున్నాయి. గుడివద్ద కల నదీఘట్టంలో ఉన్న ఒక పెద్ద రాతిఫలకం భగీరథునికి అంకితం చేయబడింది.

కేదార్‌నాథ్ శిఖరాలలో పుట్టిన కేదారగంగానది గంగోత్రి దగ్గర భాగీరథిలో కలుస్తోంది. ఈ రెండు కలిసి పెద్ద జలపాతమౌతున్నాయి. గంగోత్రికి ఒక కిలోమీటరు దిగువున భాగీరథి ఒక కొలనులో

పడి, అక్కడ నుండి ప్రవహిస్తుంది. ఆ కొలనునే 'గౌరీకుండ్' (గౌరీకుండం) అని అంటారు. గౌరీ దేవి ఇక్కడే స్నానాదులను చేసి పరమశివునికి సపర్యలు చేసింది. గౌరీదేవి నివాసమున్న పర్వతం క్రిందనే ఈ సరస్సు ఉండటం వల్ల ఇది గౌరీకుండంగా ప్రసిద్ధ మైంది. దీన్నే మత్స్యపురాణం 'బిందుసరస్సు'గా అభివర్ణించింది. గంగావతరణ సమయంలో శివుని శిరస్సు మీదకు దూకే సమయంలో చిందిన బిందువులే బిందుసరస్సుగా అయిందని మత్స్యపురాణం చెబుతోంది.

టిబెట్‌లో మానా కనుమకు ఉత్తరాన పుట్టిన జాహ్నవి (జడగంగ) గంగోత్రికి తొమ్మిదిన్నర కి.మీ. దిగువన కల భైరవీఘటీ భాగీరథిలో కలుస్తోంది. ఇక్కడ నుండి భాగీరథి ఉత్తరకాశిని చేరి, అక్కడ నుండి పయనించి తెహ్రీ నగరశివార్లలో బిలగంగను కలుపుకుని ముందుకు సాగుతోంది. తెహ్రీకి యాభై ఎనిమిది కి.మీ. దిగువన, దేవప్రయాగవద్ద, భగీరథిలో అలక్‌నందా నది కలుస్తుంది. దేవప్రయాగ 2,200 అడుగుల ఎత్తులో ఉంది. అలకనంద కలసిన తరువాత భాగీరథి పేరు 'గంగ'గా మారుతోంది.

గంగావతరణసమయంలో ఆకాశంనుండి గంగమేరుపర్వతం పైబడి నాలుగుపాయలుగా చీలింది. సీత, అలకనంద, సంక్షు, భద్ర అని ఆ నాలుగుపాయల పేర్లు. వీటిలో మేరుపర్వతంనుంచి సీత తూర్పువైపుకు, సంక్షు పశ్చిమానికి, భద్ర ఉత్తరానికి వెళ్లాయి.

దేవప్రయాగ నుంచి, గంగ హిమాలయాల, శివాలిక్ శ్రేణుల్లోంచి నైరుతిదిశగా 97 కి.మీ. ప్రవహించి హృషీకేశ్ చేరుతుంది. అక్కడకి పదమూడు కిలోమీటర్ల దిగువన హరిద్వార్ దగ్గర మైదానప్రాంతంలో అడుగిడుతుంది. ఇప్పటికి గంగ 290 కి.మీ ప్రయాణం చేసింది. (భగీరథి పుట్టిన చోటునుండి). హరిద్వార్ నుంచి గంగ తూర్పు దిశగా మందగతిలో ప్రవహించి ఫరుక్కాబాద్‌లో రామగంగను కలుపుకొని వేగం పుంజుకుని అలహాబాద్ చేరుకొంటుంది. ఇక్కడ గంగ, యమునతోనూ, అంతర్వాహిని అయిన సరస్వతితోను కలుస్తుంది. ఇలా కలిసిన ఈ ప్రదేశాన్నే "త్రివేణీసంగమం", ప్రయాగక్షేత్రం అని అంటారు.

ప్రయాగనుంచి తూర్పుదిశగా పారుతూ వారణాసి (కాశీ) చేరుకుంటుంది. ఇక్కడనుండి అనేక ఉపనదులను కలుపుకొని బీహార్ రాష్ట్రం గుండా ప్రవహించి బెంగాల్‌లోనికి, బంగ్లాదేశ్ లోనికి చేరుకుంటుంది. బెంగాలీలు గంగను "పద్మ" అని కూడా పిలుస్తారు. చాందీపూర్ మీదుగా వెళ్లిన గంగ ఏడు పాయలుగా చీలి బంగాళాఖాతంలో కలుస్తుంది. ఈ విధంగా హిమాలయాలలో పుట్టి సముద్రంలో కలిసేదాకా గంగ 2525 కిలోమీటర్ల పొడవున ప్రవహిస్తుంది.


## ఉపనదులు

గంగకు కల ఉపనదులలో శోణ, కోసి, గండకీ, దామోదరీలు ముఖ్యమైనవి.

**శోణా:** నది వింధ్య పర్వత ప్రాంతాలలో పుట్టి మేనరీ అనే చోట గంగానదిని కలుస్తోంది. దీనికి రిహాండ్, కన్‌హరీ అనే ఉపనదులు ఉన్నాయి.

**గండకీనది:** హిమాలయలలో పుట్టి, నేపాల్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల గుండా పారిసోన్‌పూర్ వద్ద గంగానదిలో కలుస్తోంది. దీన్ని నేపాల్‌లో నారాయణీ అని అంటారు.

**కోసీనది:** నేపాల్‌లో పుట్టి, బీహారు రాష్ట్రంలో గంగానదిలో కలుస్తోంది. దీన్నే కౌశికా అనే పేరుతో కూడా పిలుస్తారు.



**దామోదరి నది:** చోటానాగపూర్ పీఠభూమిలో పుట్టి బీహార్ రాష్ట్రంలో ప్రవహించి బెంగాల్లో గంగా(హుగ్లీ)నదిలో కలుస్తోంది. ఇవిగాక గోగ్రా, శరద, గోమతి, కూసీ అనే మరికొన్ని ఉపనదులు కూడా గంగానదికి ఉన్నాయి.

## గంగానదీ పరీవాహక ప్రాంతం

గంగానదీ పరీవాహకప్రాంతమంతా అనేక నగరాలు, పుణ్యక్షేత్రాలతో నిండి ఉంది. ఈ నది ఎక్కువభాగం మైదాన ప్రాంతాలు కలిగి ఉంది. అవి ఎంతో సారవంతమైనవి. దాని వల్ల ఆ తీరపు ప్రజలకు సేద్యమే ప్రాథమిక ఉపాధి.

గంగానది సముద్రంలో కలిసేముందు అనేకపాయలుగా చీలి వాటి మధ్య విశాలమైన డెల్టాను ఏర్పరుచుకుంది. బ్రహ్మపుత్రానదితో కలిసిన తరువాతే ఈ నదుల ఉమ్మడి డెల్టా ప్రారంభమైంది. ఈ విశాలమైన డెల్టాకు సుందర్బన్స్ (సుందర వనాలు) అనిపేరు. ఇది గంగానదియొక్క మైదానపు చివరి (మూడవ)భాగం. భారతదేశంనుండి బంగ్లాదేశ్‌వరకు విస్తరించిన ఈ ప్రదేశం చిత్తడిగా ఉండి వలలాగా అల్లుకున్న నీటికాలువల మధ్య ఉంటుంది. టైడల్‌స్వాంపుఫారెస్ట్(ప్రవాహపు చిత్తడి అడవులు) అనబడే ఈ ప్రదేశం 15,500 చ.కి.మీ. ఉంటుంది. ప్రపంచంలోనే అతిపెద్ద చిత్తడి నేలగా పేరుగాంచిన ప్రాంతం ఇది. ఇక్కడ ఉండే వృక్షాలు, మొక్కలు, పువ్వులు శాస్త్రజ్ఞులకి చాలా ఆసక్తికరంగా ఉంటాయి.

## గంగానదీతీరాన పుణ్యక్షేత్రాలు

గంగానదీ తీరాన అనేక ప్రసిద్ధక్షేత్రాలు ఉన్నాయి.

**గంగోత్రి:** ఈ ప్రాంతంలో గంగకు ఆలయం ఉంది. ఈ ప్రదేశానికి చేయబడే యాత్ర గంగోత్రియాత్ర. ఇది ఎంతో సత్ఫలితాలను ఇచ్చే యాత్ర. గంగోత్రిలో సూర్యకుండం, విష్ణుకుండం, బ్రహ్మకుండం మొదలైన తీర్థాలున్నాయి. ఇక్కడ విశాలమైన పెద్దశిల ఉంది. దాన్ని భగీరథి శిల అని అంటారు. ఆ శిలపైనే భగీరథుడు గంగ గురించి తపస్సు చేశాడు. గంగోత్రికి ఎక్కువభాగాన గంగ యొక్క ఉద్గమ స్థానం ఉంది. దిగువ భాగాన మార్కండేయక్షేత్రం, గౌరీకుండం ఉన్నాయి.

**కేదార్‌నాథ్:** ఈ క్షేత్రం కేదారేశ్వర పర్వతశిఖరంపై ఉంది. ఇక్కడ శివుని పన్నెండు జ్యోతిర్లింగాలలో ఒకటైన కేదారేశ్వరలింగం ఉంది.

**బదరీనాథ్:** శ్రీమన్నారాయణుని క్షేత్రాలలో బదరీనాథ్ ప్రసిద్ధ క్షేత్రం. ఇక్కడే నారాయణుడు నరునకు అష్టాక్షరీమంత్రాన్ని ఉపదేశించాడు. ఈ క్షేత్రానికి దగ్గరలో కల రుద్ర-ప్రయాగలో అలకనంద, మందాకిని నదులు కలసి గంగా నదిగా రూపాంతరం చెందుతున్నాయి.

**బ్రహ్మకపాళం:** ఇది అలకనందా నదికి దక్షిణపు ఒడ్డున ఉంది. ఇక్కడ చేయబడే పితృకర్మలన్నీ విశేషఫలితాలను ఇస్తాయి.

**హరిద్వార్:** ఇది చాలా పవిత్రమైన క్షేత్రం. ఇక్కడ జరిగే కుంభ మేళా చాలా ప్రసిద్ధి పొందింది. హరిద్వార్‌నే గంగాద్వారమని, మాయాపురి అని పిలుస్తారు. ఈ క్షేత్రాన్ని స్వర్గానికి ద్వారంగా కూడా పరిగణిస్తారు.

**కనీఖలీ:** ఈ క్షేత్రం హిమాలయాలలోని శివాలిక్ పర్వతపంక్తులలో ఉంది. హరిద్వార్ నుండి రెండుమైళ్ల దూరంలో ఉన్న ఈ కనీఖలీ కూడా గొప్ప పవిత్రస్థలంగా భావించబడుతోంది.

**హృషీకేశ్:** ఉత్తరాదిన కల ప్రసిద్ధక్షేత్రాలలో ఇదీ ఒకటి. ఇక్కడ భరతమందిరం, రామ, వారాహ, చంద్రేశ్వరమందిరాలున్నాయి.

**త్రివేణీసంగమం:** గంగా, యమునా, సరస్వతీనదుల కలయిక వల్ల ఈ క్షేత్రానికి ఆ పేరు వచ్చింది. ఇక్కడ కూడా కుంభమేళా ఆచరిస్తారు.

**కాశీ:** హిందువులందరూ కూడా దర్శించాల్సిన ప్రసిద్ధ పుణ్య క్షేత్రం కాశీ, దీన్నే వారణాశి అనికూడా అంటారు. ఇక్కడి స్వామి విశ్వేశ్వరుడు. కాశీలో హిందూవిశ్వవిద్యాలయం ఉంది. ఇది చాలా ప్రఖ్యాతి పొందింది. ఇక్కడ ప్రవహించే గంగానదికి అనేక స్నానఘట్టాలున్నాయి.


ఈ క్షేత్రాలేకాక గంగానదీతీరంలో దేవప్రయాగ, కేశవ్ ప్రయాగ, రుద్రప్రయాగ, కర్ణప్రయాగ, మన్యాదేవి ఆలయం, జ్వాలాపురం, పాండుకేశ్వర్, వంటి అనేక పుణ్యక్షేత్రాలున్నాయి.

గంగ మాహాత్మ్యం ఇంతని చెప్పటానికి వీలులేదు. ఎన్ని వందల మైళ్ల దూరాన ఉన్నా గంగా, గంగా, గంగా అని ఎవరైతే స్మరిస్తారో వారి సకల పాపాలు శమిస్తాయి. స్మరించుట వల్ల ఇంతటి ఫలితం వస్తే ఇక స్నానం చేయటం వలన వచ్చే ఫలితం వెలకట్టలేనిది. పుష్కరాలు వచ్చే నదులలో ఇది మొదటిది. మేషరాశిలోకి గురుడు ప్రవేశిస్తే ఈనదికి పుష్కరాలు వస్తాయి.

# శ్రీవేంకటాచల మాహాత్మ్యం


(తరిగొండవెంగమాంబ ప్రణీతం)

వచనం- ఆచార్య కె.సర్వోత్తమరావు, 97041 04000



పుణ్యభూమి, కర్మభూమి అయిన భారత దేశంలో నైమిశారణ్యం, దండకారణ్యం అలాంటి ప్రదేశాలు పురాణ వాఙ్మయంలో సుప్రసిద్ధాలు. నైమిశారణ్యం ఋషులకి, మునులకు, యోగులకు వాసస్థానం. అక్కడి మునులందరు విజ్ఞానఖనులు, వివేకధనులు, ధర్మచిత్తులు. సర్వదాసమస్త లోకాల సంక్షేమం కోరేవారు. అక్కడి శౌనకాదిమునులు సూత మహర్షిని గౌరవిస్తూ తమకు గల అనేకానేక సందేహాలను నివృత్తి చేసుకొనేవారు. సూతమహర్షి కూడా అడిగేవారి ఆసక్తిని గుర్తించి వారి సంశయాలను కథల ద్వారా, వేదపురాణేతిహాసాలలోని అంతరార్థాలను విశదంగా రమ్యంగా చెప్పేవాడు. నైమిశ్యంలో నిత్యమూ సాగే జ్ఞానయజ్ఞం ఇది.

ఒక మంచిరోజున శౌనకాదిమునులు సూతమహర్షితో "విద్వన్మణీ! మీ ప్రవచనంతో సనాతనధర్మానికి సంబంధించిన అనేకాంశాలను తెలుసుకోగలిగాం. అయినా మాకొక చిన్నిసందేహం- భూలోకంలో మహావిష్ణువు అర్చావతార మూర్తియై సామాన్యులకు సంసేవ్యమానుడై 108 దివ్యదేశాలలో నెలకొని ఉన్నాడు కదా! వాటిలో శ్రీరంగం, శ్రీముష్ణం, తోతాద్రి, సాలగ్రామం, నైమిశం, బదరికాశ్రమం, కాంచీపురం, వేంకటచలం అనే ఎనిమిదిక్షేత్రాలను స్వయంవ్యక్త క్షేత్రాలుగా పెద్దలు చెబుతున్నారు కదా! ఈ ఎనిమిదింటిలో సర్వశ్రేష్ఠక్షేత్రమేదో తెలుసుకోవాలని మా జిజ్ఞాస. ఈ అష్టక్షేత్రాలలో సేవించే వారి రకరకాలైన కోరికల సిద్ధిని కలిగించే క్షేత్రమేదో తెలుసుకోవాలని మా కుతూహలం. మీరు దయతో అలాంటి దివ్యదేశం గురించి చెప్పవలసిందిగా కోరుతున్నాం. మా కోరికను మన్నించండి" అని అన్నారు. అంతేకాదు "అర్చావతార మూర్తులకు సంబంధించిన వృత్తాంతాలను కూడా మీ నోట ఆలకించాలనుకొంటున్నాం" అన్నారు.



సూతుడు శౌనకాది మహామునులను తేరిపార చూచాడు. వారందరిలోనూ గల జిజ్ఞాసతీవ్రతను గుర్తించాడు.

"తాపసులారా! అనంతమైన దేవదేవుని చరిత్రలను నేనొక్కడను చెప్పగలనా! నేనెంత? నా శక్తి ఎంత? అయినా శ్రీవేదవ్యాసుల అవ్యాజమైన కరుణతో నాకు

తోచినరీతిలో మీకు తప్పక నివేదిస్తాను. మీరు చెప్పిన ఎనిమిది స్వయం వ్యక్త క్షేత్రాలలో 'వేంకటాచలమే' సర్వశ్రేష్ఠం. ఆ క్షేత్రమొక్కటే ఐహిక ఆముష్మికఫలాలను ప్రసాదించగలది. ఇందుకు ఎలాంటి సందేహం లేదు.

మరొక్కటి – శ్వేతవరహకల్పంలో శ్రీమహావిష్ణువు వైకుంఠాన్ని వదలి శేషాద్రిలో నెలకొన్న ఆ పుణ్యవృత్తాంతాన్ని మీకు చెబుతాను. వినండి."

శ్రీమన్నారాయణుని నాభీకమలంనుండి నాలుగు మోముల బ్రహ్మ అవతరించాడు. సృష్టి చేయడం మొదలెట్టాడు. అంతేకాదు ఎలాంటి ఏమరుపాటు లేక ఒక్క క్షణమైనా సేదతీర్చుకోక స్థావరజంగమాదుల సృష్టియే ధ్యేయంగా కార్యనిమగ్నుడయ్యాడు. ఈ సృష్టి సాగినంతకాలం సూర్యుడుగాని, వాయువుగాని, అగ్నిగాని, వరుణుడుగాని వారి వారి హద్దులలో ఉండేలాగున కట్టడి చేయడమే కాకుండా వారిని రక్షగా కల్పించాడు. ఇలా సృష్టి కార్యక్రమం అవిచ్ఛిన్నంగా పధ్నాలుగు మన్వంతరాలు గడిచాయి. ఇన్నేళ్లు బ్రహ్మకు ఒక పగలు. ఆ పగలు గడవగా రాత్రి మొదలుకావడంతో బ్రహ్మకు సేద తీర్చుకోవాలనిపించింది. నిద్రాదేవత ఆ దేవదేవుణ్ణి ఆవహించింది. బ్రహ్మ నిద్రలో జారుకున్నాడు.

సృష్టికర్త అయిన బ్రహ్మ నిదురపోవడంతో భూతలంలో పెనుమార్పులు సంభవించాయి. లోకబాంధవుడైన భానుడు తీక్ష్ణ కిరణాలతో స్థావరజంగమాలను తపింపజేశాడు. ప్రళయకాలంలో అకాల తాండవం చేసే జ్వాలలాగా తానేమి తక్కువ తినలేదని మహోన్నతశిఖలతో ప్రజ్వలింపసాగాడు. ఆ జ్వాలలకు అచేతనాలు, చేతనాలన్నీ నల్లబడ్డాయి. ఇవేమీ చాలవన్నట్లు అగ్నికి వాయువు తోడయ్యాడు. సప్తవాయువులు విజృంభించాయి. సంవర్తకాది మేఘాలు ఉఱుము మెఱపులతో ఏనుగు తొండం లాంటి ధారలతో వర్షధారలను కురిపించాయి. ఇంకేం? ఎక్కడ చూసినా జలం. హోరున సాగే ప్రవాహసాంద్రత కారణంగా భూమి క్రుంగిపోసాగింది. ఇలాంటి వాతావరణానికే ఎదురుచూస్తున్న హిరణ్యాక్షుడనే రాక్షసుడు సముత్సాహంతో భూమిని రసాతలానికి చేర్చాడు. భూమి రాక్షసకరగ్రస్తమైంది. ఇలాగే చాలకాలం గడచింది. చతుర్ముఖునికి రాత్రి గడచింది. బ్రహ్మలేచి మునుపటి లాగే సృష్టికార్యం మొదలు పెట్టాలనుకొన్నారు. ఇవన్నీ ఒక కంట కనిపెడుతున్న విష్ణువు సర్వలోకసంక్షేమార్థం శ్వేతవరాహరూపుడయ్యాడు. ఆ రూపంతోనే రసాతలం చేరుకున్నాడు. రసాతలంలో క్రుంగిన భూమిని పైకి ఎత్తడానికి ప్రయత్నిస్తుంటే హిరణ్యాక్షుడు అడ్డుతగిలాడు. ఇరువురి మధ్య హోరాహోరిగా పోరుసాగింది. చివరకు శ్వేతవరాహరూపధారి అయిన శ్రీమహావిష్ణువు తన కోరల వాడిమితో హిరణ్యాక్షుని తలను ముక్కలు ముక్కలు చేశాడు. భయంకరంగా సాగిన పోరులో స్రవించిన రక్తధారతో ఆ ప్రదేశమంతా ఎర్రబడింది. ఈ మార్పును గుర్తించిన దేవతలు భయపడ్డారు. అయినా కాసేపటికి తేరుకొని యోగదృష్టితో రసాతలంలో జరిగిన పరిణామాన్ని తెలుసుకోగలిగి శాంతచిత్తులయ్యారు. ప్రకృతినే శాసించే లోకకంటకుడు సంహరింపబడినందుకు సంతోషం వ్యక్తం చేస్తూ శ్వేతవరాహధారిని వేనోళ్ల స్తుతించారు.

*(ఇంకా ఉంది)*

## 2023, మే నెల ఉత్సవాలు, పర్వదినాలు

| | |
|---|---|
| 01 | మేడే |
| 02-05 | తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి వసంతోత్సవం |
| 04-12 | నాగులాపురం శ్రీవేదనారాయణస్వామివారి బ్రహ్మోత్సవం |
| 04 | శ్రీనృసింహజయంతి, తరిగొండవెంగమాంబ జయంతి |
| 05 | శ్రీకూర్మజయంతి |
| 06 | శ్రీఅన్నమాచార్య జయంతి |
| 13-21 | కార్వేటినగరం, శ్రీవేణుగోపాలస్వామివారి బ్రహ్మోత్సవం |
| 14 | శ్రీహనుమజ్జయంతి |
| 16 | తిరుపతి గంగజాతర |
| 26 నుండి జూన్ 03 వరకు | తిరుపతి, శ్రీగోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవం |
| 30 నుండి జూన్ 03 వరకు | తిరుచానూరు శ్రీపద్మావతీఅమ్మవారి తెప్పోత్సవం |
| 31 నుండి జూన్ 08 వరకు | హృషీకేశ్, నారాయణవనం, అప్పలాయగుంట, శ్రీస్వామివార్ల బ్రహ్మోత్సవాలు |



# దర్శించండి! తరించండి!!

– విద్వాన్ ముమ్మడి నారాయణ రెడ్డి, 94418 93986

వందల సంవత్సరాలక్రితం ఒంటిమిట్ట ప్రాంతం అరణ్యంతో నిండి ఉండేది. శేషాచలం కొండలలోని ఒకశాఖ ఈప్రాంతంలో విస్తరించి ఉంది. కాశీనుండి రామేశ్వరం, రామేశ్వరంనుండి కాశీ వెళ్లే యాత్రికులు ఈ మార్గంలో ప్రయాణం చేసేవారు.

సమీపంలో మృకండుమహాముని ఆశ్రమం ఉండేది. ఆ ఆశ్రమానికి సమీపంలో తూర్పుగా జాంబవంతుని ఆశ్రమం ఉండేది. ఈ ఆశ్రమంలోనిదే ఏకశృంగశైలం. ఈ శైలంమీద ఎలుగుబంట్లు సంచరిస్తూ ఉండేవి. జాంబవంతుడు తన ఆశ్రమంలో ఏకశృంగశైలంమీద శ్రీరామచంద్రుని గూర్చి తపస్సు చేశాడు.

జాంబవంతుడు ఉత్తరదిక్కుగా కూర్చొని తపస్సు చేశాడు. శ్రీరామచంద్రుడు ప్రత్యక్షమయ్యాడు. కేవలం తానొక్కడే కాదు, సీతాలక్ష్మణులతో సహా కనిపించాడు. జాంబవంతునికి దర్శనమిచ్చినచోట కుటీరం నిర్మించుకుని కొంతకాలం నివసించారు. ఆ పవిత్రమైన ప్రదేశంలోనే నేడు కోదండరామాలయం వెలసింది.

**31-03-2023 నుండి 08-04-2023 వరకు ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా...**

ఒకనాడు సీతమ్మకు దప్పిక అయింది. రామయ్య వెంటనే బాణం సంధించి భూమిలోకి వదిలాడు. పాతాళగంగ పైకి వచ్చింది. అక్కడ నీటిబుగ్గ ఏర్పడింది. దీన్నే రామబుగ్గ అంటారు.

ఒంటడు, మిట్టడు అనే అన్నదమ్ములు అడవి మీద పెత్తనం చెలాయిస్తూ ఉండేవారు. ఒకనాడు ఉదయగిరి రాజు కంపరాయలు ఈ ప్రాంతానికి వచ్చాడు. ఒంటడు, మిట్టడు రాజుకు రాజోపచారాలు చేశారు. ఎండాకాలం అయినా రామబుగ్గ నీటితో రాజుకు ఆహారపానీయాలు సమకూర్చారు. జాంబవంతుని ఏకశృంగపర్వతం చూపించారు. రామయ్య నివసించిన కుటీరం ఉన్న తిప్ప చూపించారు. అక్కడ రామయ్యకు గుడి కట్టించమని కోరారు. కంపరాయలు అంగీకరించాడు.

గుడి, చెరువు నిర్మించే బాధ్యతలు ఆ అన్నదమ్ములకు అప్పగించాడు. నిర్మాణంకోసం అవసరమైన ధనం, ధాన్యం ఏర్పాటు చేశాడు.

ఒంటడు, మిట్టడు తమ బాధ్యతను భక్తిశ్రద్ధలతో నిర్వర్తించారు. కొన్నిసంవత్సరాలకు చెరువు, గుడి తయారయ్యాయి. గర్భగుడి, గర్భగుడి చుట్టూ అంతరాళమండపం, దానికి ముందు ముఖమండపం, గర్భగుడి పైన చిన్నగోపురం నిర్మించారు. ఇక స్వామి ప్రతిష్ఠ జరగాలి! అప్పటి హంపీ విజయనగరచక్రవర్తి బుక్కరాయలు రామేశ్వరం వెళుతూ గోదావరీతీరం ఇసుకపల్లె నుంచి నాలుగు విగ్రహాలు తన వెంట తీసుకువచ్చారు. మూడువిగ్రహాలను గండికోట, గుత్తి, పామిడి గుళ్లకు పంపించారు. సీతారామలక్ష్మణులను ఒకే పీఠంలో మలచిన ఏకశిలా విగ్రహాన్ని ఈ గుడిలో నిలిపారు. విద్యారణ్య మహర్షి పర్యవేక్షణలో గుడి ప్రతిష్ఠ అయింది. ఒంటడు, మిట్టడి చేసిన సేవకు గుర్తుగా - ఇక్కడ ఏర్పడ్డ

## శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు, ఒంటిమిట్ట

### 2023, మార్చి 30 నుండి ఏప్రిల్ 09 వరకు

| తేదీలు | వారం | పగలు ఉత్సవం | రాత్రి ఉత్సవం |
|---|---|---|---|
| 30-03-23 | గురు | న్యాసాభిషేకము | అంకురార్పణం |
| 31-03-23 | శుక్ర | ధ్వజారోహణం | శేషవాహనం |
| 01-04-23 | శని | వేణుగానాలంకారం | హంసవాహనం |
| 02-04-23 | ఆది | వటపత్రశాయి అలంకారం | సింహవాహనం |
| 03-04-23 | సోమ | నవనీతకృష్ణాలంకారం | హనుమత్సేవ |
| 04-04-23 | మంగళ | మోహినీసేవ | గరుడసేవ |
| 05-04-23 | బుధ | శివధనుర్భాణాలంకారం | ఎదుర్కోలు, కల్యాణోత్సవం, గజవాహనం |
| 06-04-23 | గురు | రథోత్సవం | ---- |
| 07-04-23 | శుక్ర | కాళీయమర్ధనాలంకారం | అశ్వవాహనం |
| 08-04-23 | శని | చక్రస్నానం | ధ్వజావరోహణం |
| 09-04-23 | ఆది | పుష్పయాగం | |

ఊరిని ఒంటిమిట్ట అన్నారు. ముగ్గురుదేవతలు ఒకే శిలలో కొలువై ఉన్నందున ఏకశిలానగరం అని అన్నారు.

సిద్ధవటాన్ని పాలించిన మట్లరాజులు అనంతరాజు, ఆయన కుమారుడు తిరువెంగళనాథుడు, ఆయన కుమారుడు కుమార అనంతరాజు గుడిని వైభవోపేతంగా అభివృద్ధి చేశారు. కోటగోడలాంటి మహాప్రాకారం, ఎత్తైన మూడుగోపురాలు, రంగమండపం, సంజీవరాయస్వామిగుడి వాళ్లు నిర్మించినవే.

స్వామిదర్శనానికి తూర్పుద్వారం నుంచి ఆలయంలోకి వెళ్లాలి. ఆరాధనభావంతో విశాలమైన సోపానాల మీదుగా నడుస్తూ ఉంటే అలవైకుంఠపురంలోకి వెళుతున్నట్లుంటుంది. ద్వారంలో అడుగులువేస్తున్నపుడు ఎడమచేతి వైపున ఎద్దు ఏనుగుతో పోరాడుతున్న దృశ్యం కన్పిస్తుంది. మనిషి ధర్మమార్గంలో జీవిస్తూ అష్టమదాలను అణచివేసినప్పుడు దైవం సాక్షాత్కరిస్తుందన్న రహస్యం తెలిపే ఆ శిల్పాన్ని చూస్తూ ముందుకు నడుస్తుండగా ధ్వజస్తంభం కనిపిస్తుంది. ఆ స్తంభానికి దండం పెట్టుకొని ఆలయానికి ప్రదక్షిణం చేయాలి. కుడివైపు మందిరం–ఎడమవైపు ప్రాకారం ఉన్నాయి. నైరుతి దిశలో కల్యాణమండపం ఉంది. భక్తులరద్దీ కారణంగా ఇప్పుడు కల్యాణోత్సవం బయట జరిపిస్తున్నారు. ఉత్తరదిశలో తూర్పుపడమరలుగా ఎదుర్కోలు మండపాలు రెండున్నాయి. శ్రీసీతారాముల పెండ్లినాడు ఎదుర్కోలుసంబరం ఇక్కడే జరుగుతుంది.

ప్రదక్షిణం పూర్తిచేసుకుని రంగ మండపం దక్షిణంవైపున్న మెట్లమీదుగా మండపంలోకి ప్రవేశిస్తాం. ముప్పైరెండు బలమైన రాతిస్తంభాలమీద రంగమండపం నిర్మించారు. స్తంభాలమీద ప్రతి అంగుళంలోను అద్భుతమైన శిల్పకళ ఉట్టిపడుతూ ఉంది. ఇది విజయనగరరాజులకాలంనాటి శిల్పకళ. రెండుస్తంభాలు మాత్రం చోళులకాలం నాటి శిల్పకళను గుర్తుకు తెస్తాయి. వటపత్రశాయి, బాలగోపాలుడువంటి శిల్పచిత్రాలు ముద్దులు కురిపిస్తుంటాయి.

రంగమండపంనుంచి ముఖమండపం, అంతరాళ మండపందాటుకుంటూ గర్భగుడి చేరుకోవచ్చు. ముఖమండపం





ద్వారంలో జయవిజయులు దర్శనమిస్తారు. ముఖమండపంలో ఆళ్వారులు కొలువుదీరి ఉన్నారు. గర్భగుడికి ప్రదక్షిణం చేసి స్వామిసన్నిధిలో నిలబడితే ఎదురుగా సీతారామలక్ష్మణస్వాముల దివ్యసందర్శనం, స్వామిసన్నిధిలో బ్రహ్మానందానుభూతి లభిస్తుంది.

రామస్వామి గుడిలో ఆయన బంటు ఆంజనేయస్వామి లేదు. “స్వామి ఉన్నచోటు వైకుంఠం కదా! వైకుంఠం మా స్వామిదే! బయట ఉండి ఆత్మారాముడైన మా రాముణ్ణి చూచు కొంటూ ఉంటాను. ఆ స్వామి నా గుండెగుడిలో కొలువై ఉన్నాడం టాడు”– ఆంజనేయస్వామి. తూర్పుగాలిగోపురానికి ఎదురుగా సంజీవరాయస్వామిదేవాలయం ఉంది. లక్ష్మణుడికోసం సంజీవని తీసుకువచ్చిన ఆంజనేయుణ్ణి సంజీవరాయడు అని పిలుస్తారు.

సంవత్సరం పొడవునా ఆలయంలో ఉత్సవాలు జరు గుతూ ఉంటాయి. రథసప్తమి, వైకుంఠఏకాదశి, హనుమ జ్జయంతి ఘనంగా నిర్వహిస్తారు. వైకుంఠఏకాదశినాడు స్వామి ఉత్తరద్వారంలో కొలువై భక్తులకు దర్శనమిస్తారు. చైత్ర మాసంలో శ్రీరామనవమి ముందురోజునుంచి పదకొండు రోజులు బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా జరుగుతాయి. పోతన జయంతి, గరుడసేవ, హనుమత్సేవ, చతుర్దశినాటిరాత్రి కల్యాణం, మరునాడు రథోత్సవం, ఆ తరువాత చక్రస్నానం, ఏకాంతసేవ– ప్రసిద్ధ ఉత్సవాలు.

సంజీవరాయస్వామిగుడి పక్కగా రథశాల ఉంది. స్వామి రథంకూడా గొప్పది. రాముడు సీతమ్మకోసం సృష్టించిన బుగ్గ రామతీర్థమైంది. బ్రహ్మోత్సవాల చివర ఇక్కడ చక్రస్నానం జరుగుతుంది. ఇక్కడే ఒక చిన్నకొండ ఉంది. దీన్ని రామగిరి అంటారు. ఇక్కడ కనుమపండుగనాడు పారువేట ఉత్సవం జరుగుతుంది. స్వామి విల్లంబులు ధరించి ఈ కొండపైకి వస్తారు.

గుడి తూర్పుసోపానాల ముందు ఓబన్న మండపం కన్పిస్తుంది. గరుడసేవనాడు స్వామికి ఓబన్న హారతి పట్టేవాడు. ఈ సంప్రదాయం ఇప్పటికీ ఉంది. ఈ సోపానాల పక్కన ఇమాంబేగ్ బావి ఉంది. టిప్పుసుల్తాన్ కాలంలో ఆయన దగ్గర పనిచేసిన ఇమాంబేగ్ ఇక్కడ భక్తుల సౌకర్యార్థం బావి తవ్వించాడు.

ఒంటిమిట్ట గుడికి ప్రాకారం బయట ఎనిమిదిదిక్కుల్లో ఎనిమిదిమంటపాలున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌నుండి తెలంగాణా విడిపోయాక మన రాష్ట్ర ప్రభుత్వలాంఛనాలు 2015వ సం॥ నుండి ఒంటిమిట్ట గుడికి అందుతున్నాయి.



ఒంటిమిట్ట ఆలయాన్ని అభివృద్ధి చేసి, భక్తులకు సకలసదుపాయాలు సమకూర్చే బాధ్యత 2016వ సం॥ నుండి తిరుమల తిరుపతి దేవస్థానం స్వీకరించింది. ప్రతియేటా అంగరంగవైభవంగా జరిగే ఒంటిమిట్ట శ్రీకోదండ రామయ్య బ్రహ్మోత్సవాలకు భక్తులు తరలివచ్చి దేవతామూర్తులను దర్శించి శ్రీసీతారాములకృపకు పాత్రులై తరిస్తారు.

# తండ్రి కోపాన్ని పోగొట్టిన కొడుకు

-డా॥గుమ్మనూరు రమేష్‌బాబు
98499 15351


శ్రీమహావిష్ణువు ఎత్తిన దశావతారాలలో శ్రీపరశురామావతారం ఆరవది. అయితే అన్ని అవతారాలలో లాగా ఈ అవతారంలో శ్రీపరశురాముడు తనువు చాలించలేదు. చిరంజీవిగా ఇంకా ఈ లోకంలో తిరుగుతున్నాడని భక్తుల నమ్మకం.

త్రేతాయుగానికి చెందిన పరశురాముడు ద్వాపరయుగానికి చెందిన భీష్ముడికి, ద్రోణుడికి, కర్ణుడికి ఎన్నో విద్యలు నేర్పించాడు. తన తరువాతి అవతారమైన శ్రీరామచంద్రుణ్ణి చూచుకున్న అదృష్టం పరశురాముడికి దక్కింది. ఈ స్వామి విఘ్నేశ్వరుడికి, కుమారస్వామికి విద్యలు నేర్పాడని ప్రతీతి. ఆలోచిస్తే అన్నీ అవతారాలకన్నా అత్యంత విశిష్టమైన అవతారం శ్రీపరశురామావతారం అని చెప్పుకోవచ్చు.


**ఏప్రిల్ 22న శ్రీపరశురామజయంతి సందర్భంగా...**

జమదగ్ని, రేణుకాదేవి దంపతులకు నలుగురు కుమారులు. వీరిలో నాలుగవపుత్రుడు పరశురాముడు. ముందు పరశురాముడి పేరు కేవలం రాముడు మాత్రమే. కాని శివుణ్ణి మెప్పించి పరశువు (గొడ్డలి)ని సాధించడం వల్ల పరశురాముడు అయ్యాడు. చేతిలో గొడ్డలి ఉండగా పరశు రాముడిని ఎవరూ జయించలేరు. భృగువంశీకుడు కనుక భార్గవరాముడు కూడా అయ్యాడు. జమదగ్ని నిత్యం చేసే పూజకోసం గంగానదినుంచి నీటిని తీసుకొచ్చే బాధ్యత రేణుకది. ఒక రోజు ఆమె పూజకోసం నీటిని తీసుకురావడంలో ఆలస్యం చేసింది. దీనికి కోపగించుకున్న జమదగ్ని రేణుకను సంహరించాల్సిందిగా తన కుమారులను ఆదేశించాడు. పెద్దవారు ముగ్గురు తమవల్ల కాదన్నారు. దాంతో వారిని మరణించవలసిందిగా శపించాడు జమదగ్ని. చివరివాడైన పరశురాముడు ముందుకు వచ్చి తల్లిని వధించాడు.

ప్రసన్నుడైన జమదగ్ని పరశురాముడికి మూడువరాలు ఇచ్చాడు. మొదటివరం వల్ల తల్లిని, రెండవవరం వల్ల తన సోదరులను బ్రతికించుకొన్నాడు. మూడవవరంగా తండ్రిని కోపాన్ని త్యజించమని కోరుకున్నాడు. తల్లిని వధించిన పాపం పరశురాముణ్ణి వదలిపెట్టలేదు. దాన్ని వదలించుకోవడం కోసం తీర్థ యాత్రలు చేశాడు. లోహితనదికి దగ్గరగా వెలిసిన పరశురామ్‌కుండ్‌లో స్నానం చేయగా బ్రహ్మ హత్యాపాతకం నశించింది. ఈలోగా జమదగ్ని వద్ద ఉన్న కామధేనువు(సురభి)కోసం కార్త వీర్యార్జునుడు యుద్ధానికి వచ్చాడు. కోపాన్ని త్యజించిన జమదగ్ని ఆ కార్తవీర్యార్జునుడి చేతిలో మరణించాడు. తిరిగి వచ్చిన పరశురాముడికి విషయం తెలిసింది. క్రోధంతో ఊగిపోయాడు. మదమెక్కిన రాజులకు బుద్ధి చెప్పాలనుకున్నాడు పరశురాముడు. శాంతిని నెలకొల్పడమే లక్ష్యం. అందుకోసం క్షాత్రవులను సంహరించడానికి బయలుదేరాడు.



జైత్రయాత్ర ముగిశాక తాను జయించిన రాజ్యాలనన్నింటినీ బ్రాహ్మణులకు అప్పగించి నీతి తప్పకుండా జీవించమని చెప్పి తపస్సు చేసుకోవడం కోసం ఏకాంతం లోకి వెళ్లాడు. తనకు కావాల్సిన భూమి కోసం సముద్రుని ప్రార్థించి తన గొడ్డలిని సముద్రంలోకి విసిరేశాడు. ఆ గొడ్డలి పడ్డ చోటువరకు సముద్రుడు, వెనక్కివెళ్లి పరశురాముడికి అంతవరకు ఉన్న భూమిని అప్పగించాడు. దీన్నే పరశురామ భూమి అంటారు. కొంకణతీరం పరశురామ భూమేనని జనుల విశ్వాసం. పరశురాముని గుడులు చాలా అరుదే కాని కేరళప్రాంతంలో, కొంకణతీరంలో చెప్పుకోదగ్గ ప్రశస్తమైన పరశురాముని గుడులు ఉన్నాయి. ఈ స్వామి అవతారం చాలించలేదు. భక్తిశ్రద్ధలతో త్రికరణశుద్ధిగా ఈ స్వామిని ఆరాధిస్తే అనుగ్రహం, సాక్షాత్కారం రెండూ లభ్యమౌతాయని భక్తులు నమ్ముతారు.



# తిరుమల సమయాచారములు

## (తిరుమల–తిరుపతి ఐతిహ్యామాల)

తెనుగు అనువాదకులు:
కీ.శే. డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు,
కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు

*గత సంచిక తరువాయి భాగం....*

### శ్రీ వేంకటాచలపతి దివ్యప్రబంధాలను ఆకర్ణించి అనుగ్రహించే విధానం

మార్గళి (ధనుస్సు) మాసం ముప్పైరోజుల్లోనూ బ్రహ్మ ముహూర్తంలో తలుపులు తెరిచేటప్పుడు మొదటిరోజు మాత్రం ఆరాధన, నైవేద్యం తర్వాత 'తిరుప్పావై', 'తిరుప్పళ్ళి యెళుచ్చి' ప్రబంధాల అనుసంధానం ప్రారంభమౌతుంది. మరునాటి నుండి ఆరాధన సందర్భంలోనే అనుసంధానం, మధ్యాహ్నం 'ఉపదేశ రత్నమాల', సాయంకాలం 'తిరువాయ్‌మొళి నూత్తందాది' అను సంధానించాలి. శ్రీకృత్తికాదీపోత్సవం మొదలుకుని అధ్యయ నోత్సవం జరిగేంతవరకు 'ఉపదేశరత్నమాల', 'తిరువాయ్ మొళి నూత్తందాది' అనుసంధేయాలు. ఇతర నెలల్లో ప్రాతః కాలంలో తిరుమాలియ (తోమాలసేవ) సమర్పించేటప్పుడు 'తిరుప్పావై', 'తిరుప్పళ్ళియెళుచ్చి' ప్రబంధాల్ని అనుసంధా నించాలి. మధ్యాహ్నం తిరుమాలియ సమర్పించేటప్పుడు 'శిఱియ తిరుమడల్' అనుసంధానించాలి. సాయంకాలం 'నిత్యానుసంధానం' పఠించాలి.

అందు ప్రకారభేదం–మొదట తిరుప్పల్లాణ్డు, పూచ్చుడల్, కాప్పిడల్, శెన్నియోఙ్గు, విణ్ణీలమేలాప్పు, ఉనేఱుశెల్వత్తు, అఙ్గ ణెడు మదిళ్, తాయే తన్దై, ఊన్‌వాడ ఉణ్ణాదు, వాడమరుదిడై, ఒళువిల్‌కాలమ్, ఉలగముణ్డ పెరువాయా, కఙ్గులుమ్ పగలుమ్ ఉళి ఎళ, అమలనాదిపిరాన్, కణ్ణినుణ్ శిఱుత్తాంబు– మొదలై నవి అనుసంధేయాలు. నాయ్‌చ్చియార్ తిరుమొళి, పెరుమాళ్ తిరుమొళి, పెరియతిరుమొళి, తిరువాయ్‌మొళి– వీటి గీతదశ కాన్ని అనుసంధానించేటప్పుడు, పూర్తిగా కాక ఏకదేశం మాత్రమే (కొన్ని దశకాలే) అనుసంధానించడం వల్ల ఆ యా ప్రబంధాల తనియనులను (ప్రశస్తి పద్యాలు) అనుసంధానించ కూడదు. అమలనాదిపిరాన్, కణ్ణినుణ్ శిఱుత్తాంబు అనే ప్రబంధాలను పూర్తిగా అనుసంధానించడం వల్ల తనియనులు సేవించడం కలదు. పూర్వాచార్యులు ఇలా నియమం చేశారు.

నిత్యానుసంధానంతో పాటు 'కఙ్గులుమ్ పగలుమ్', మధ్యాహ్నం తిరుమాలియ సమర్పించే సమయంలో 'శిఱియ తిరుమడల్'– వీనిని సేవించడానికి కారణం–

పూర్వకాలంలో విషయాంతర విముఖులైన పెద్దలు పరివేష్టించి నివసించే మనోజ్ఞశీతల జనసమృద్ధిగల శ్రీరంగంలో నిరంతరం ఉంటూ శ్రీరంగనాథస్వామి దివ్యదేహంపై ప్రేమాతి శయం ఉన్న వారు కోనేటిలో స్నానం చేసి, సకలానుష్ఠానాలు ముగించుకుని జ్ఞానవరాహస్వామి శ్రీపాదాలకు మొక్కి సేవా క్రమాన్ని అనుసరించి, లోపలకు వెళ్లి శ్రీభగవద్రామానుజులకు పాదాభివందనం చేసి శ్రీకృష్ణ(శర్మ) మండపానికి పోయి గరుత్మంతుని, ద్వారపాలకుల్ని సేవించి భగవద్రామానుజుల చెంత వారిని పురుషకారంగా చేసుకొని శ్రీవేంకటాచలపతికి ప్రణామాలు చేసి, 'తాయే తంద్రై' అనే తిరుమొళిని అను సంధించి లోపలికి వెళ్లాలి. *(ఇంకా ఉంది)*



# తల్లీ విశాలాక్షీ!

- శ్రీమతి రమా శాండిల్య, 96187 66600

అష్టాదశశక్తిపీఠాలలో పదిహేడవది వారణాసి. ఇక్కడ విశాలాక్షి అమ్మ కొలువై ఉన్నది. ఇది అమ్మవారి చెవి కుండలాలు పడినచోటు! కొన్నిచోట్ల కళ్లు పడిన చోటని, అందుకే అమ్మ పేరు విశాలాక్షి అని కూడా చెబుతుంటారు. మనం ఉభయసంధ్యలలో దీపారాధన చేసుకుని కొలిచే అమ్మవారి ప్రార్థన, లంకాయాం శాంకరీ దేవి, అంటూ శక్తి ప్రార్థనే కదా చేస్తాం? శక్తిని ప్రార్థించట మంటే, మనలోని శక్తికి నమస్కరించటమే కదా!

ముఖ్యంగా, ఇక్కడ తెలుసుకోవాల్సిన విషయం ఏమిటంటే, గుడిలోకి వెళ్లగానే కనిపించే అమ్మవారు 'అర్చకమూర్తి' మాత్రమే. కుంకుమపూజ టిక్కెట్ తీసుకుని పూజ చేయించుకుంటే శ్రీచక్రాన్ని చూసి, ఆ శ్రీచక్ర మేరువుకి కుంకుమతో పూజచేసుకుని, దణ్ణం పెట్టుకోవచ్చు. అలాగే అమ్మవారికి, మనం చీరను సమర్పిస్తే, దానిని అమ్మవారికి తాకించి, ఆ చీరను మనకు ఇచ్చేస్తారు. జగన్మాతయే కాశీలో విశాలాక్షిగా వెలిసింది. సతీదేవి 'చెవిపోగు' పడ్డ ప్రదేశంలోనే ఏర్పడ్డ అమ్మవారి క్షేత్రమిది. అయ్యవారి జ్యోతిర్లింగంతో పాటుగా, అమ్మవారి శక్తిపీఠం కూడా కావడంతో అందరికి ఈ క్షేత్రం ఎంతో ఆరాధ్యనిలయం. ఆ ఆదిదంపతులు స్వయంగా వెలసిన అరుదైన క్షేత్రాల్లో ఇది ఒకటి. ఈ క్షేత్రం ఒక మహాశక్తిపీఠంగా కూడా ప్రసిద్ధి చెందింది.

ముందుగా చెప్పినట్టు అష్టాదశ శక్తిపీఠాలలో పదిహేడవది శ్రీవిశాలాక్షీదేవి శక్తిపీఠం. ఈ శక్తిపీఠంలోని గర్భాలయంలో విశాలాక్షి రెండు రూపాలతో దర్శనమిస్తుంటుంది. విశాలాక్షి అంటే 'విశాలమైన కన్నులు కలది...' అని అర్థం. విశాలాక్షీదేవి కొలువుదీరిన అత్యంత పుణ్యప్రదమైన క్షేత్రమే వారణాసి. అమ్మ కొలువైన శక్తిక్షేత్రం కాశీ. కాశీక్షేత్రం, ఉత్తరప్రదేశ్‌రాష్ట్రంలో గంగానదీతీరాన ఉందనే విషయం మనకు విదితమే...

గంగానదీతీరంలో మీర్ ఘాట్ వద్ద, కాశీవిశ్వేశ్వరుని గుడికి కొంతదూరంలో విశాలాక్షి అమ్మవారి క్షేత్రం ఉంది. వారణాసిలో సతీదేవి కన్నులు పడిన కారణంగా, ఇక్కడ కాజలి (కాటుక) పండుగకు విశిష్టత ఉంది. వారణాసిలో ఈ పండుగను మహిళలు ఆచరిస్తారు. విశాలాక్షి ఆలయంలో కాజలి పండుగ. నిర్వహిస్తారు. ప్రతీ ఏటా, భాద్రపదశుద్ధ తదియనాడు వారణాసిలో ఈ 'కాజలీ ఉత్సవం' జరుగుతుంది.

కాలభైరవాలయానికి, రెండువీథులవతల దక్షిణంగా ఉండే వీథిలో విశాలాక్షి అమ్మవారి ఆలయం ఉంది. ఈ విశాలాక్షీదేవి ఆలయంలో 'శ్రీచక్రం' ఉండటాన్ని మహా విశేషంగా చెప్పుకుంటారు.

ఇక్కడ అమ్మవారి పురాతన విగ్రహాన్ని 'ఉద్భవమూర్తి'గా భావిస్తారు. ప్రస్తుతమున్న విగ్రహానికి వెనుక వైపున ఈ విగ్రహం ఉంది. ఆలయంలో అమ్మవారు బంగారుతొడుగుతో దర్శనం ఇస్తారు. పసుపుకుంకుమలతో ప్రకాశిస్తూ, పుష్పమాలాలంకృతురాలైన ఆమెను, భక్తులు మనసారా పూజిస్తే, తమ కోరికలు తప్పక నెరవేరుతాయని విశ్వసిస్తారు.

కాశీవిశాలాక్షి అమ్మవారిని 'గౌరి' అని కూడా పిలుస్తారు. ఈ క్షేత్రంలో పార్వతీదేవి అన్నదానం చేయడంవల్ల, పార్వతీదేవిని 'అన్నపూర్ణ'గా కొలుస్తుంటారు. ఈ తల్లిని కాశీలోని అన్నపూర్ణేశ్వరిగా, మరొక అంశతో కంచిలో కామాక్షి మాతగా కొలుస్తారు. కాశీలో విశాలాక్షీమాత దేవాలయం అన్నపూర్ణాదేవి ఆలయానికి అత్యంత సమీపంలో ఉంది. ఈ ఆలయగోపురం దక్షిణాది సంప్రదాయ శైలిలో ఉంటుంది.

కాశీలో మరణించిన వారికి ఈమె కర్మబంధాలను తొలగిస్తుంది. కాశీవిశ్వనాథుడు మహాకాళరూపం ధరించి వారికి మోక్షాన్ని అనుగ్రహిస్తాడు. కాశీలో మరణించిన వారికి, శివుడు వారి ఆత్మ యొక్క చెవిలో తారకమంత్రాన్ని ఉపదేశిస్తాడని పెద్దలు చెబుతారు.

వారణాశిలో వ్యాసభగవానునికి, ఆయన శిష్యులకు ఏడురోజులపాటు భిక్ష దొరకలేదు. ఆయనకు విపరీతంగా కాశీపై కోపం వచ్చి, "కాశీనగరం మొత్తం కరవుకాటకాలతో నిండి, క్షామమయం కావాలి" అని శపించాడు.

అప్పుడు విశాలాక్షీదేవి, ఒక బ్రాహ్మణగృహిణిగా మారి తన ఇంటికి వ్యాసభగవానుడిని, అతని శిష్యులను భిక్షకు ఆహ్వా నించింది. వారందరికీ విశాలాక్షీ, విశ్వేశ్వర దంపతులు షడ్రసోపేత మృష్టాన్నభోజనం పెట్టారు. అయితే, వ్యాసుడు కాశీ పట్టణాన్ని శపించటాన్ని, మహానేరంగా భావించిన శివుడు వ్యాసుడిని కాశీక్షేత్రం నుండి బహిష్కరిస్తాడు.

వ్యాసుడు, కాశీని విడచి, అక్కడికి కొంత దూరాన ఒక నగరాన్ని నిర్మించుకుంటాడు. అదియే 'వ్యాసకాశీ'గా పిలవ బడుతోంది. అన్నపూర్ణామాతలాగే, విశాలాక్షీమాత కూడా శివుడికి భోజనం సమకూరుస్తుంది కాబట్టి, విశాలాక్షి పెట్టిన భోజనానికి సంతృప్తిచెందిన ఆ పరమేశ్వరుడు కాశీక్షేత్రానికి ముఖ్యదేవతగా ఉండే యోగ్యతను ఈమెకు కల్పిస్తాడు. చాలా కాలం అన్నపూర్ణామాత అంటే విశాలాక్షిదేవి అనే భావించారు. కాలక్రమంలో రెండు వేరు వేరు ఆలయాలు ఏర్పడ్డాయి. విశ్వనాథుని గుడికి దగ్గరలో అన్నపూర్ణ ఆలయం ఉంటే, దీనికి కొద్ది దూరంలో విశాలాక్షి ఆలయం ఉంది.

వివాహం కాని యువతులు గంగాస్నానాన్ని ఆచరించి, అత్యంత నియమనిష్ఠలతో విశాలాక్షిని అర్చిస్తే, త్వరలోనే అను కూలుడైన భర్త లభిస్తాడనే విశ్వాసం జనులలో ఉంది. ఇక్కడి నల్లరాతి అమ్మవారి విగ్రహాలు తేజోవంతంగా ఉంటాయి. నవరాత్రి ఉత్సవాలను ఘనంగా ఇక్కడ నిర్వహిస్తారు. భాద్రపద మాసంలో జరిగే ఉత్సవాలు కూడా చెప్పుకోదగ్గవే.

మహిమాన్వితమైన కాశీపుణ్యభూమిలో కొలువైన విశాలాక్షీదేవిని నవరాత్రుల సందర్భంగా దర్శించుకునే వారికి సకలసంపదలు, సుఖసంతోషాలు చేకూరుతాయి. దసరా నవ రాత్రులలో చాలా ప్రత్యేకమైన హోమాలు, అర్చనలు, పూజలు ఇచట జరుగుతూ ఉంటాయి.

కాశీవిశాలాక్షి అమ్మవారి ఆలయం చుట్టూ శివ లింగాలు ప్రతిష్ఠించి ఉన్నాయి. గర్భగుడిలో అమ్మవారితో పాటు ఆదిశక్తి కూడా కొలువై ఉంది. అమ్మవారి ఎదురుగా ఉన్న మహిమాన్వితమైన శ్రీచక్రాన్ని భక్తులు చేతులతో స్పృశించి, దర్శించుకోవటానికి అనుమతిస్తారు.

శక్తిపీఠం, ద్వాదశ జ్యోతిర్లింగమున్న ప్రదేశాలు మూడే– కాశీ, శ్రీశైలం, ఉజ్జయిని.

కాశీలోని విశాలాక్షి మందిరంలో మధ్యాహ్నం పన్నెండు గంటలసమయంలో ఇచ్చే ఆ హారతిని చూసి తీరా ల్సిందే కానీ, వర్ణించటానికి మాటలు చాలవు.

ఒక అందమైన ఆధ్యాత్మిక ఆనందమే ఆ హారతి. మనం క్రింద నిలబడి చప్పట్లు కొడితే చెట్టుమీద పిట్టలు ఎగిరిపోయినట్లు, మనలోని ఆలోచనలన్నీ ఎగిరిపోయి ఒక ప్రశాంతమైనస్థితిలోకి వస్తాం. హారతి ముగియగానే నైవేద్యంగా పెట్టిన పదార్థాల్ని మనకు ప్రసాదంగా పెడతారు. అన్నపూర్ణమ్మ స్వయంగా వండి, విశాలాక్ష్మమ్మ గుడిదగ్గర మనకు తినిపిస్తూ ఉంటుందేమో అనిపించేంత రుచి ఆ ప్రసాదానికి.

అమ్మవారిని చూచి, అర్చనాదులతో అమ్మను సేవించి, ప్రక్కనే కొలువున్న అయ్యవారిని కూడా సేవించి కొంతసేపు మనఃస్ఫూర్తిగా, శాంతిగా ఇరువురినీ ధ్యానించిన తరువాతనే గుడినుంచి బయటకు రావాలి.

బయటకు రాగానే, పెద్దబట్టల దుకాణం ఆ అంగడిలో మగవారికి బెనారస్ పట్టుపంచెలు, ధావళీలు, నారబట్టలు మహిళలకు చీరలు రంగురంగులవి దొరుకుతాయి. ఇక్కడి బట్టలు చాలా నాణ్యతను కలిగి ఉంటాయి.

భవసాగరాన్ని, దాని ఆలోచనలను ప్రక్కన పెట్టి, సుఖంగా మనతో మనం కూడా హాయిగా కాశీలో బ్రతికేయ వచ్చు. అలా అని మనసున అమ్మవారి ధ్యాస విడిచామో, ప్రపంచంలో అన్నిచోట్లా ఉన్నట్లే కాశీలో కూడా ఉంటాం. ఇక ఇక్కడికి వచ్చిన ప్రయోజనమేముంటుందని?

ఎప్పుడూ ఒక విషయం మాత్రం మననం చేసు కుంటూనే ఉండాలి. అది– కాశీనగరం, మహామాయ స్థిరనివాస మేర్పరచుకున్న నగరమని!!

# గురువే దైవం

- శ్రీ వైద్యం వేంకటేశ్వరాచార్యులు

శ్రీహరి కుముదగణేశాంశలో మధురకవి బ్రాహ్మణకులంలో అవతరించాడు. తామ్రపర్ణీతీరంలో గల తిరుక్కోళూరు వీరి జన్మస్థలం. వీరు ఈశ్వరనామసంవత్సర వైశాఖశుద్ధచతుర్దశి శుక్రవారం నాడు జన్మించారు. వీరి ఆచార్యులు నమ్మాళ్వారు. వీరు వయసులో నమ్మాళ్వారుకన్నా పెద్దవారు. అయితే వీరు వకుళాభరణులవారికి శిష్యులు.



మధురకవి ఆళ్వారు వకుళాభరణుల అర్చావిగ్రహాన్ని తిరునగరిలోని తింత్రిణీవృక్షమూలాన ప్రతిష్ఠించారు. అక్కడ సంవత్సరం పొడుగునా ఉత్సవాలు జరుగుతుంటాయి. నమ్మాళ్వారు బిరుదాంకితగాథలను పొగడుతూ ఉత్సవాలలో విజయ కాహళాదులు ఊదుతుంటారు, మోగిస్తుంటారు.

ఒక పర్యాయం అక్కడ ఉత్సవాలలో విజయకాహళ శబ్దం విన్న కంబనాథుడు అనే ద్రవిడ కవీంద్రుని శిష్యుడొకడు దీన్ని ఆక్షేపిస్తాడు. "మా గురువు కంబ కవీంద్రుని జయిస్తేనే ఈ కాహళ ఊదాలి. లేకుంటే ఊదరాదు" అని అడ్డుకుంటాడు. అపుడు మధురకవి ఇలా చెప్పాడు "మాగురువు శఠకోపసూరి అర్చారూపి. ఈ దివ్యదేశాన్ని వదలి బయటకు రారు. వారు ఆనతిచ్చిన ఒక సూక్తిని నీకు ఇస్తాను. దానిని మీ శంఖ ఫలకంలో ఉంచండి. ఫలకం ఈ సూక్తిని వహిస్తే మా గురువు మీ గురువును జయించినట్లు" అని చెప్పి, 'కణ్ణన్ కలవిన' అనే పాశురాన్ని మధురకవి ఒక పత్రంపై రాసి కంబకవి శిష్యునికి ఇస్తాడు.

**ఏప్రిల్ 25న**
**మధురకవి ఆళ్వార్ ఉత్సవారంభం**
**సందర్భంగా...**

కంబకవి శిష్యుడు ఆ పత్రాన్ని తీసుకొని వెళ్లి తన గురువు కంబనాథునికి ఇస్తాడు. అతడు దానిని శంఖఫలకంపై ఉంచుతాడు. శంఖఫలకం నాగదేవతాధిష్ఠితం. నమ్మాళ్వారుల సూక్తి పత్రాన్ని మహోన్నత శంఖఫలకం వహిస్తుంది. అపుడు కంబకవి పరాంకుశ మునీంద్రుని స్తుతిస్తూ 'శఠకోపవందాది' అనే స్తోత్ర ప్రబంధాన్ని చెప్పారు. మధురకవి పరాంకుశమునీంద్రుల ప్రభావాన్ని ప్రకాశితం కావించి, విభవరూపం చాలించి అర్చారూపం ధరించారు.

## శ్రీకృష్ణామృతం..



ఏల మోసితివయా ఇన్నిన్ని నెపములు
మూర్ఖజనులపై మక్కు వదేలా ॥ ఏల ॥

పాపులకైననూ పూజ్యులకైననూ తండ్రిని నేనని ప్రతిన పూనితివే
అందులకేమో అంతటి ఓర్మీ దీనుల బ్రోవగ దేవుడ వైతివి ॥ ఏల ॥

వెన్నల దొంగని ఉట్టిపైనే చూపని గోపకులిండ్లను చోరుడు నీవని
వరుసలెరుగనీ దుండగుడివనీ వనితల వలువలు దోచినావనీ
వేల గోవులను పోషణ చేసెడి నందనందనునిపై నింద లవేలా
పదునాల్గులోకములు ఉదరమున దాల్చిన ఆద్యంతరహితున కాచ్ఛాదములా.
మూర్ఖజనులపై మక్కువదేలా ॥ ఏల ॥

–'అనంత' కృష్ణసుందరి సత్తిరాజు, 99103 45794



కాశీక్షేత్రాన్ని 'ఆనందకాననం' అని కూడా పిలుస్తారు

# 108 దివ్యదేశాలు


# తిరునరైయూర్

## (నాచ్చియార్‌కోయిల్)

- ఆచార్య చక్రవర్తి రంగనాథన్

ఈ క్షేత్రం కుంభకోణం నుండి దాదాపు 9 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ క్షేత్రం దాదాపు 5 ఎకరాలస్థలంలో అద్భుతమైన ఐదు ప్రాకారాలతో, ఐదు శిఖరాలతో ఉన్న రాజ గోపురంతో, పదహారు చిన్నచిన్నగోపురాలతో అలరారుతోంది. ఈ క్షేత్రం యొక్క గర్భగృహవిమానమే గోపురంలా కనిపిస్తుంది. అది మాత్రమేకాదు ఇక్కడ వైకుంఠద్వారం అనేది ఉత్తరాన కాక దక్షిణాన ఉండడం విశేషం.

క్షేత్రం యొక్క ఉత్సవమూర్తి శ్రీనివాస పెరుమాళ్. గర్భగృహంలో సంకర్షణుడు, అనిరుద్ధుడు, సాంబుడు, బ్రహ్మ మొదలైన వాళ్లు కూడా వేంచేసి ఉన్నారు. పుష్కరిణి మణిముక్తా పుష్కరిణి. సంకర్షణ తీర్థం, ప్రద్యుమ్నతీర్థం, అనిరుద్ధతీర్థం, సాంబతీర్థం అని అనేకతీర్థాలతో ఈ దివ్యదేశం వెలసి ఉంది. ఎడమవైపు ఉత్తరదిక్కుని చూస్తూ అత్యద్భుతమైన శిలారూపంలో ఉన్న గరుత్మంతుడు తన దర్శనభాగ్యాన్ని కలిగిస్తూ ఉంటాడు. ఉత్సవాలకాలంలో ఈ శిలా గరుడిడిపై భగవంతుడు వేంచేసి ఊరేగుతాడు.



### స్థలపురాణం

మేధావి అనే మహర్షి తపస్సు చేసి శ్రీమహాలక్ష్మిని పుత్రికగా పొందాడు. ఒక వృక్షఛాయలో సుగంధ వనంలో ఆవిడ ఆవిర్భవించింది. సాక్షాత్ భగవంతుడు అమ్మవారిని వెతుక్కుని వచ్చి ఇక్కడ వివాహం చేసుకున్నాడు. ఒకే స్వరూపంలో వెళితే అమ్మవారు తనని గుర్తించరనే ఉద్దేశంతో స్వామి తన వ్యూహమూర్తులతో లోకాలనంతా వెతికాడు. చివరగా మేధావిమహర్షి యొక్క తపః పుత్రిక వంజులవల్లిగా ఇక్కడ ఉంది అని గరుత్మంతుని ద్వారా తెలుసుకుని భగవంతుడు అక్కడికి వెళ్లి ఐదుమూర్తులనంతా కలిపి ఒకే మూర్తిగా మేధావిమహర్షి దగ్గరికి వెళ్లాడు. మహాలక్ష్మిని చూచిన వెంటనే అత్యుత్సాహంతో భగవంతుడు ఆమె చేతులను పట్టుకున్నాడు. మేధావిమహర్షి శాపం ఇవ్వడానికి ఉద్యుక్తుడవుతుంటే, భగవంతుడు శంఖచక్ర గదాధారియై దర్శనాన్ని ఇచ్చాడు. తర్వాత అమ్మవారితో స్వామికి వివాహం జరిగింది. మేధావిమహర్షి ప్రార్థనతో ఇక్కడ వంజులవల్లి అమ్మవారికి ప్రాధాన్యత నివ్వాలనే ఉద్దేశంతో, ఈ క్షేత్రంలో మొట్టమొదటగా ఆరాధన అమ్మవారికే. తరువాతే శ్రీనివాసస్వామికి. అదే ప్రకారం ఉత్సవాల సందర్భంలో వంజులవల్లి అమ్మవారు అలా ముందుకు వెళుతూ ఉండగా, వెనకాల భగవంతుడు వేంచేస్తాడు. ఇదీ ఈ క్షేత్రవైశిష్ట్యం.

తిరుమంగై ఆళ్వార్లు తన ధర్మపత్ని కుముదవల్లి ప్రోద్బలంతో పంచసంస్కారాలను స్వీకరించి వైష్ణవమతంలో ప్రవేశించింది ఇక్కడే!

63 నాయన్మారల్లో కొచ్చంగచోలన్ అనే శివభక్తుని రాజ్యం పోయింది. ఆ సమయంలో మనుషులద్వారా, మహర్షుల



ద్వారా ఈ క్షేత్ర వైభవాన్ని తెలుసుకొని ఆ మణిముక్తనదిలో స్నానంచేసి స్వామిని దర్శించుకున్నాడు. అతడే ఆ స్వామికి దేవాలయాన్ని కూడా కట్టించినట్టు చరిత్ర.

ఇంకొక ముఖ్యవిశేషమేమిటంటే కల్‌గరుడన్ అనే పేరుతో ఇక్కడ శిలారూపంలో ఉన్న గరుత్మంతుడిని ప్రతి ఒక్కరు కూడా దర్శించుకోవాలి. ఇది చాలా విశేషం. స్వామివారికి అమ్మవారికి వివాహం జరగడానికి గరుత్మంతుని పైన దేవదేవుడు వేంచేస్తాడు. ఆ వేంచేసే సందర్భంలో అద్భుతమైన ఘటన ఇక్కడ ఉన్నట్లు వేరే ఎక్కడా కూడా మనం చూడలేం. మార్గశిర మాసంలో చాలా అద్భుతంగా జరిగే సేవలో ఆ గరుత్మంతుడిని వేంచేపు చేస్తారు. దేవదేవుని సన్నిధానం నుండి వేంచేపు సందర్భంలో నలుగురు  దేవుణ్ణి తీసుకువస్తారు.

తరువాత అలా వస్తుండగా నలుగురు ఎనిమిది, 12 ఇలా వేంచేపు చేసి 64 మంది ఒకేసారి ఆ భగవంతుణ్ణి వేంచేపు చేస్తారట. అద్భుతమైన సేవ ఇది. భగవానుడు దివ్య మంగళవిగ్రహం నుండి చెమట కూడా వస్తుందని అనుభవజ్ఞుల మాట. ఈ క్షేత్రంలో వైఖానస ఆగమానుసారం పూజలు జరుగుతాయి. బ్రహ్మ, మేధావి మొదలగు వారికి ప్రత్యక్షంగా బంగారువిమానం లేక శ్రీనివాస విమానంలో ఆ వివాహ భంగిమలోనే అమ్మవారు దర్శనమిస్తారు.

ఈ క్షేత్రంలోని శ్రీనివాసస్వామిని ముఖ్యంగా అవివాహితులు దర్శించుకుంటే వాళ్లకు వివాహం తొందరగా జరుగుతుంది. కనుక భక్తులందరూ ఈ క్షేత్రానికి వెళ్లి ఆ దేవదేవుని దర్శించుకుని సమస్త శ్రేయస్సును పొందాలి.






ఆదిశంకరులు తన ధార్మిక ద్విగ్విజయ యాత్రను కాశీనుంచే ప్రారంభించారు

# గంగాస్తోత్రమ్



దేవి! సురేశ్వరి! భగవతి! గంగే త్రిభువనతారిణి తరళతరంగే!
శంకరమౌళివిహారిణి! విమలే! మమ మతిరాస్తాం తవ పదకమలే! ॥ 1

భాగీరథి! సుఖదాయిని మాతః! తవజలమహిమా నిగమే ఖ్యాతః
నాహంజానే తవ మహిమానం పాహి కృపామయి! మామజ్ఞానమ్ ॥ 2

హరిపదపాద్యతరంగిణి! గంగే హిమవిధు ముక్తాధవళతరంగే!
దూరీకురు మమ దుష్కృతిభారం కురు కృపయా భవసాగరపారమ్॥ 3

తవ జలమమలం యేన నిపీతం పరమపదం ఖలు తేన గృహీతమ్ ।
మాతర్గంగే! త్వయి యో భక్తః కిల తం ద్రష్టుం న యమః శక్తః ॥ 4

పతితోద్ధారిణి! జాహ్నవి! గంగే! ఖండితగిరివరమండితభంగే! ।
భీష్మజనని! హే! మునివరకన్యే! పతిత నివారిణి! త్రిభువనధన్యే ॥ 5

కల్పలతామివ ఫలదాం లోకే ప్రణమతి యస్త్వాం న పతతి శోకే ।
పారావారవిహారిణి! గంగే! విముఖయువతి కృత తరళాపాంగే! ॥ 6

తవ చేన్మాతః! స్రోతః స్నాతః పునరపి జఠరే సోఽపి న జాతః ।
నరక నివారిణి! జాహ్నవి! గంగే! కలుషవినాశిని! మహిమోత్తుంగే ॥ 7

పునరసదంగే పుణ్యతరంగే! జయ జయ జాహ్నవి! కరుణాపాంగే! ।
ఇంద్రమకుటమణిరాజిత చరణే! సుఖదే! శుభదే! భృత్యశరణ్యే! ॥ 8

రోగం శోకం తాపం పాపం హర మే భగవతి కుమతి కలాపమ్ ।
త్రిభువన సారే వసుధాహారే త్వమసి గతిర్మమ ఖలు సంసారే ॥ 9

అలకానందే! పరమానందే! కురు కరుణామయి కాతరవంద్యే!
తవ తటనికటే యస్య నివాసః ఖలు వైకుంఠే తస్య నివాసః ॥ 10

వరమిహ నీరే కమఠో మీనః కింవా తీరే శరటః క్షీణః ।
అథవా శ్వపచో మలినో దీనః తవ నహి దూరే నృపతి కులీనః ॥ 11

భోభువనేశ్వరి! పుణ్యే! ధన్యే! దేవి! ద్రవమయి! మునివరకన్యే!
గంగాస్తవమిదమమలం నిత్యం పఠతి నరోయః స జయతి సత్యమ్ ॥ 12


యేషాం హృదయే గంగాభక్తిః తేషాం భవతి సదా సుఖముక్తిః,
మధురాకాంతాపజ్ఝటికాభిః పరమానందకలిత లలితాభిః ॥ 13

గంగాస్తోత్రమిదం భవసారం వాంఛితఫలదం విమలం సారమ్,
శంకరసేవక శంకర రచితం పఠతి సుఖీ స్తవ ఇతి చ సమాప్తః ॥ 14


॥ఇతి శ్రీమచ్ఛంకరాచార్య విరచితం గంగాస్తోత్రం సంపూర్ణమ్ ॥

# నామరామాయణం

## బాలకాండ




01) శుద్ధబ్రహ్మ పరాత్పర రామ
02) కాలాత్మక పరమేశ్వర రామ
03) శేషతల్ప సుఖనిద్రిత రామ
04) బ్రహ్మాద్యమర ప్రార్థిత రామ
05) చండకిరణకుల మండన రామ
06) శ్రీమద్దశరథ నందనరామ
07) కౌసల్యా సుఖవర్ధన రామ
08) విశ్వామిత్ర ప్రియధన రామ
09) ఘోరతాటకా ఘాతక రామ
10) మారీచాది నిపాతక రామ
11) కౌశిక మఖ సంరక్షక రామ
12) శ్రీమదహల్యోద్ధారక రామ
13) గౌతమ ముని సంపూజిత రామ
14) సుర మునివర గణ సంస్తుత రామ
15) నావిక ధావిత మృదుపద రామ
16) మిథిలా పురజన మోహక రామ
17) విదేహ మానస రంజక రామ
18) త్ర్యయంబక కార్ముక భంజక రామ
19) సీతార్పిత వరమాలిక రామ
20) కృత వైవాహిక కౌతుక రామ
21) భార్గవదర్ప వినాశక రామ
22) శ్రీమదయోధ్యా పాలక రామ



## అయోధ్యకాండ

23) అగణిత గుణగణ భూషిత రామ
24) అవనీతనయా కామిత రామ
25) రాకా చంద్ర సమానన రామ
26) పితృవాక్యాశ్రిత కానన రామ
27) ప్రియ గుహ వినివేదిత పద రామ
28) తత్ క్షాలిత నిజ మృదుపద రామ
29) భరద్వాజ ముఖానందక రామ
30) చిత్ర కూటాద్రి నికేతన రామ
31) దశరథ సంతత చింతిత రామ
32) కైకేయీ తనయార్థిత రామ
33) విరచిత నిజ పితృకర్మక రామ
34) భరతార్పిత నిజపాదుక రామ





## అరణ్యకాండ

35) దండకావనజన పావన రామ
36) దుష్ట విరాధ వినాశన రామ
37) శరభంగ సుతీక్ష్ణార్చిత రామ
38) అగస్త్యానుగ్రహ వర్ధిత రామ
39) గృధ్రాధిప సంసేవిత రామ
40) పంచవటీ తట సుస్థిత రామ
41) శూర్పణఖార్తి విధాయక రామ
42) ఖరదూషణ ముఖసూదక రామ
43) సీతాప్రియ హరిణానుగ రామ
44) మారీచార్తి కృతాశుగ రామ
45) వినష్ట సీతాన్వేషక రామ
46) గృధ్రాధిప గతిదాయక రామ
47) శబరీదత్త ఫలాశన రామ
48) కబంధ బాహుచ్ఛేదన రామ

## కిష్కింధకాండ

49) హనుమత్సేవిత నిజపద రామ
50) నత సుగ్రీవాభీష్టద రామ
51) గర్విత వాలి సంహారకరామ
52) వానరదూత ప్రేషక రామ
53) హితకర లక్ష్మణ సంయుత రామ

**రామాయణాన్ని నూటఎనిమిది పాదాలతో వివరించిన నామరామాయణం సంప్రదాయంగా వస్తున్న స్తోత్రం. ఈ దివ్యస్తోత్రాన్ని పాడితే రామాయణాన్ని పారాయణం చేసిన ఫలితం లభిస్తుంది. ఏప్రిల్ 26న శ్రీరామజయంతి సందర్భంగా 'సప్తగిరి' పాఠకుల కోసం.**




## సుందరకాండ

54) కపివర సంతత సంస్మృత రామ
55) తద్గతి విఘ్నధ్వంసక రామ
56) సీతా ప్రాణాధారక రామ
57) దుష్ట దశానన దూషిత రామ
58) శిష్ట హనూమద్భూషిత రామ
59) సీతావేదిత కాకావన రామ
60) కృత చూడామణి దర్శన రామ
61) కపివర వచనాశ్వాసిత రామ

## యుద్ధకాండ

62) రావణ నిధన ప్రస్థిత రామ
63) వానరసైన్య సమావృత రామ
64) శోషిత సరిదీశార్థిత రామ
65) విభీషణాభయ దాయక రామ
66) పర్వతసేతు నిబంధక రామ
67) కుంభకర్ణ శిరచ్ఛేదక రామ
68) రాక్షస సంఘ విమర్దక రామ
69) అహిమహిరావణ చారణ రామ
70) సంహృత దశముఖ రావణ రామ
71) విధిభవ ముఖసుర సంస్తుత రామ
72) ఖస్థిత దశరథ వీక్షిత రామ
73) సీతాదర్శన మోదిత రామ
74) అభిషిక్త విభీషణ నత రామ
75) పుష్పక యానారోహణ రామ
76) భరద్వాజాభి నిషేవణ రామ
77) భరతప్రాణ ప్రియకర రామ
78) సాకేతపురీ భూషణ రామ
79) సకల స్వీయ సమానత రామ
80) రత్నలసత్పీఠాస్థిత రామ
81) పట్టాభిషేకాలంకృత రామ
82) పార్థివకుల సమ్మానిత రామ
83) విభీషణార్పిత రంగక రామ
84) కీశకులానుగ్రహకర రామ
85) సకలజీవ సంరక్షక రామ
86) సమస్త లోకాధారక రామ



## ఉత్తరకాండ

87) ఆగత మునిగణ సంస్తుత రామ
88) విశ్రుత దశకంఠోద్భవ రామ
89) సీతాలింగన నిర్వృత రామ
90) నీతి సురక్షిత జనపద రామ
91) విపిన త్యాజిత జనకజ రామ
92) కారిత లవణాసురవధ రామ
93) స్వర్గత శంబుక సంస్తుత రామ
94) స్వతనయ కుశలవ నందిత రామ
95) అశ్వమేధ క్రతుదీక్షిత రామ
96) కాలావేదిత సురపద రామ
97) ఆయోజగజ్జన ముక్తిద రామ
98) విధిముఖ విభుధానందక రామ
99) తేజోమయ నిజరూపక రామ
100) సంస్కృతి బంధ విమోచక రామ
101) ధర్మస్థాపన తత్పర రామ
102) భక్తిపరాయణ ముక్తిద రామ
103) సర్వచరాచరపాలక రామ
104) సర్వభవామయ వారక రామ
105) వైకుంఠాలయ సంస్థిత రామ
106) నిత్యానంద పదస్థిత రామ
107) రామరామ జయరాజా రామ
108) రామరామ జయసీతా రామ








తిరుమలలో జరిగిన శ్రీఅనంతాళ్వార్ అవతారోత్సవం (19-02-2023) దృశ్యాలు.
ఈ ఉత్సవంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి వార్లు అనుగ్రహభాషణం చేశారు.




శ్రీజ్ఞానప్రసూనాంబ, శ్రీకాళహస్తీశ్వర వారి కల్యాణోత్సవానికి (20-02-2023) తి.తి.దే. తరపున
తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఈ.ఎస్., దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు.
వీరితో పాటు తి.తి.దే. ధర్మకర్తలమండలి అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి సతీమణి శ్రీమతి స్వర్ణలత,
తి.తి.దే. పాలకమండలి సభ్యులు శ్రీపోకల అశోక్‌కుమార్ కూడా పట్టువస్త్రాలు సమర్పించారు.




శ్రీభ్రమరాంబ, మల్లికార్జునస్వామి (శ్రీశైలం) వార్ల బ్రహ్మోత్సవాలలో (14-02-2023) తి.తి.దే. తరపున
తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్., దంపతులు పట్టువస్త్రాలు సమర్పించిన దృశ్యం




తి.తి.దే. శ్రీపద్మావతీ చిన్నపిల్లల హృదయాలయంలో రెండవ గుండెమార్పిడి శస్త్రచికిత్సను విజయవంతం చేసి
అరుదైన రికార్డు సృష్టించిన సందర్భం(27-02-2023)గా తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఈ.ఎస్.,
అక్కడి వైద్యబృందాన్ని అభినందించిన దృశ్యం. ఈ కార్యక్రమంలో తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారిణి
శ్రీమతి సదా భార్గవి, ఐ.ఏ.ఎస్., ఆసుపత్రి డైరెక్టర్ డా॥ శ్రీనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# దివ్య భవ్య కాశీ

– శ్రీమతి భాగి సూర్య రమాలక్ష్మి

హిందువులందరికి పరమపవిత్రమైన ఆధ్యాత్మికశక్తి కేంద్రంగా విరాజిల్లుతున్న కాశీక్షేత్రం యొక్క నడవా(కారిడార్), మన ప్రధానమంత్రి శ్రీనరేంద్రమోదీ పట్టుదలతో సాకారమైంది.

'వరుణ', 'అసి' అనే రెండు నదులు కలిసిన భూభాగం ఏర్పడ్డచోట వెలసిన నగరాన్ని వారణాసిగా, కాశీగా పిలుస్తారు. ఒక ప్రక్క కాలభైరవుడు, మరొక ప్రక్క వారాహీమాత క్షేత్రపాలకులుగా కాశీనగరాన్ని రక్షిస్తుండగా... వేరొక ప్రక్క గంభీరంగా ప్రవహించే గంగమ్మ, వీటన్నింటికీమించి నిత్యాన్న దానేశ్వరి అన్నపూర్ణమ్మ, తన విశాలనేత్రాలతో కాశీనగరాన్ని నలువైపులా దృష్టిసారించి చూస్తూ కాచే విశాలాక్షి, విశ్వానికి నాథుడై అక్కడ వెలసిన పరమశివుడూ... వీరందరినీ దర్శించాలంటే, ఎన్నెన్నో జన్మలపుణ్యం ఉంటే కానీ సాధ్యంకాదు. వచ్చిన భక్తకోటిని, ప్రేమగా తన అక్కున చేర్చుకుంటున్నదీ కాశీనగరం. ఈ కాశీనగరం అతి పురాతన నగరం. ఇది రామాయణ, భారత, భాగవతకాలాలన్నీ చూసిన నగరంగా చెప్పుకునే ఎన్నో ఆధారాలున్నాయి. ఎన్నో ఆటుపోట్లను తట్టుకున్న నగరంగా చెప్పుకోవచ్చు.



రానురాను భక్తులసంఖ్య పెరిగి విశ్వనాథమందిరం, పురాతన గంగా ఘాట్లు ఇరుకుగా మారటం వల్ల, ఇప్పటి భక్తులకు అనుగుణంగా, మన భారతదేశ ప్రధానమంత్రి నూతనపథకాలతో తిరిగి కారిడార్ నిర్మించటానికి 2019లో శంకుస్థాపన చేశారు. మూడుసంవత్సరాలలోపు, తొంభై శాతం పని పూర్తిచేసి ప్రారంభోత్సవం చేసి, 13-12-2021న భారతజాతికి అంకితమిచ్చారు. ఈ ప్రాజెక్ట్ నిమిత్తం 399 కోట్లవరకు ధనం ఖర్చు పెట్టారు, విశాలమైన నడవాను తీర్చిదిద్దడమే కాదు, 3వేల చదరపుఅడుగుల విస్తీర్ణంలోని ఆలయప్రాంగణాన్ని సుమారు 5లక్షల చదరపు అడుగుల మేరకు విస్తరించారు. తత్ఫలితంగా సుమారు 75వేలమంది భక్తులు ఏకకాలంలో ఆలయసందర్శనకు విచ్చేయవచ్చు. దివ్యకాశీధామాన్ని భవ్యంగా, నవ్యంగా సుందరీకరించి, భక్తులందరూ చూచి తరించే భాగ్యం కలిగించింది మన భారతప్రభుత్వం.

ఒక కలగా మిగిలిపోయిన దాన్ని సాకారం చేసేలా చేపట్టిన బృహత్తర 'కే.వీ.టి.' (కాశీవిశ్వనాథ్ ఆలయ) ప్రాజెక్టుకు స్థలసేకరణలో భాగంగా స్థానికులను వివాదాలకు అతీతంగా ఒప్పించి, వారికి పునరావాసం కల్పించడంలో కేంద్రప్రభుత్వం కృతకృత్యమైంది. ముముక్షుభవన్, భోగశాల, నగరప్రదర్శన శాల, శివలింగాకృతిలోని రుద్రాక్షసభాసముదాయం వంటి వాటితో యాత్రికులకోసం ప్రత్యేక విశ్రాంతభవనాన్ని నిర్మించింది.

ఈ కారిడార్ ప్రవేశద్వారం, లలితాఘాట్ నుంచి గంగా నది వైపుగా ముఖద్వారం నిర్మించారు. ఈ నాలుగుద్వారాలు, 'శాండ్ స్టోన్'తో నిర్మించారు. కారిడార్ నేలంతా పాలరాళ్లతో నిర్మించారు. దాదాపు మూడుసంవత్సరాల లోపు, మొత్తం కారిడార్ నిర్మాణాన్ని, చాలా గౌరవప్రదంగా పూర్తి చేసిన ఘనత మన ప్రధాని శ్రీమోదీగారికి దక్కుతుందనటంలో ఎలాంటి సందేహం లేదు.

ఈ కారిడార్ పనుల నిర్వాహణాబాధ్యతలో సుమారు ఐదువందలమంది సివిల్ ఇంజనీర్లు, ఆర్కిటెక్ట్‌లు పనిచేశారు. అలాగే, మూడువేలమంది కార్మికులు కూడా పనిచేశారు. కాశీ విశ్వనాథ్ కారిడార్ నిర్మాణంలో భాగస్వాములైన కార్మికులతో గౌరవభారతప్రధానమంత్రి కలగలసిపోయారు. సాధారణ పౌరుడిలా వారి మధ్య కూర్చుని భోజనం చేశారు. కరోనాకు





కూడా వెరవక వాళ్లు ఏకధాటిగా పనులు కొనసాగించారని ప్రశంసించారు. అంతేకాదు నడవా పనుల్లో పాలుపంచుకున్న కార్మికులపై పూలవర్షం కురిపించి వారిని సంభ్రమాశ్చర్యాలకు గురిచేశారు.

ఇప్పుడు ఈ నెలలో వస్తున్న గంగానది పుష్కరాలకు వచ్చే భక్తులసంఖ్య లక్షలలో ఉంటుంది. కనుక, దాని కోసం కూడా అనేక పనులు, నిర్మాణాలు, ఘాట్లలో పుణ్యస్నానాలకు ప్రత్యేకఏర్పాట్లు జరుగుతున్నాయి.



## గంగానది హారతి

గంగ పుట్టినచోటు నుంచి కలిసే చోటు వరకూ తీరం వెంబడి అనేక చోట్ల, 'గంగా హారతి' ఇస్తారు. ఈ స్థలాలలో ముఖ్యమైనవి, ముచ్చటగా మూడింటిని గురించి చెప్పుకోవచ్చు.

1) దివినుండి భువికి దిగివచ్చిన తరువాత సాధారణనేలను తాకే ప్రాంతంగా, ఋషికేష్‌లో మొదటి హారతిగా చెప్పుకోవచ్చును. ఇక్కడ ధ్యాన, ప్రాణాయామం నేర్చుకునే సాధకులు, నేర్పే గురువులు గంగమ్మహారతి దర్శిస్తారు.

2) హరిద్వార్‌లోని దేశ, విదేశీభక్తులు చాలా శ్రద్ధగా గంగా హారతిని దర్శిస్తారు. ఇక్కడ యాత్రికులు అధికంగా ఉంటారు.

3) కాశీనగరంలో 'దశాశ్వమేధఘాట్'లో గంగా పవిత్రహారతి ఇస్తారు. ఇక్కడ ప్రతీరోజూ సూర్యాస్తమయం అయ్యాక గంగమ్మహారతి ఉంటుంది.

ఈ హారతి ఇవ్వటానికి ముందు అనేకమంది ప్రసిద్ధ గాయక కళాకారుల కచేరి ఉంటుంది. తరువాత, వారే గంగాహారతిని కూడా ఆలపిస్తారు. గంగమ్మకు షోడశోపచారాలతో పూజచేసి, హారతిస్తారు. ఈ హారతి అనేకరకాలుగా ఇస్తారు.








గంగాహారతి గురించి ఎంత చెప్పినా తనవితీరదు. ఒకేలాంటి కుర్తా, పైజామా, పైన ధావళీ ధరించిన పూజారులు హారతివ్వడానికి తయారుగా ఉంటారు. వీరు రెండుజట్లుగా ఉంటారు. ఒకరు ఆ హారతి ఇవ్వడానికి, రెండవవారు హారతిని ఇచ్చేవారికి అందించడానికి. గంగానది ముందుభాగంలో గట్టుమీద, ఒక పెద్దవేదిక మీద పెద్ద ఇత్తడి విగ్రహాన్ని అలంకరించి, అక్కడికి దగ్గరలోనే ధూపం, శంఖం, ఏకహారతి, ఇలా అనేకరకాలైన హారతులు తయారుగా ఉంచి, వెలిగించే పూజారులు కొంతమంది ఉంటారు.

వెలిగించిన ధూపం, హారతులు ఇచ్చే పూజారులు వేదిక మీద ఉంటారు. ఒకటి తర్వాత ఒకటిగా ఆరాధించేవారు అందిస్తుంటే, గంగకు హారతి ఇచ్చేవారు ఇస్తుంటారు. హారతి అయ్యాక ఇచ్చేప్రసాదం వేదిక దగ్గరగా ఉన్నవారికి మాత్రమే దొరుకుతుంది. పవిత్రగంగాజలం మాత్రం పూజారి అందరి మీద తానే స్వయంగా చల్లుతాడు. దేశ, విదేశాల నుంచి ఈ హారతిని దర్శించటానికి అనేకమంది భక్తులు వస్తారు. హారతిచ్చే సమయానికి దివినుంచి భువికి, స్వయంగా గంగమ్మ వచ్చి హారతి అందుకుంటుందని భక్తులనమ్మకం.



ముఖ్యమైన రోజుల్లో అంటే, పుష్కరాలు, కుంభమేళా, జాతరలు, గంగానది జన్మదినాన్ని పురస్కరించుకుని విశేషహారతులిస్తారు. ఈ సంవత్సరం గంగాపుష్కరాలసందర్భంగా ఇచ్చే ప్రత్యేక విశేష హారతులు చూడటానికి భక్తజనులు తరలి వెళ్లటానికి తయారుగా ఎన్నో ఏర్పాట్లు జరుగుతూనే ఉంటాయి. గంగాపుష్కరాల్లో పుణ్యస్నాన మాచరించి, గంగాహారతిని దర్శించి విశ్వేశ్వరదర్శనం చేసుకుని భక్తులు తరించాలని ఆకాంక్ష!

ఏప్రిల్ 25వ తేదీ
**శ్రీశంకరజయంతి** సందర్భంగా...



# మనస్సును మార్చగలిగిన గురువు

– బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు శర్మ

రైతు వర్షం పడినప్పుడు కేవలం నాగలిపట్టి దున్నడమే కాదు. పొలంలో మొలిచిన పిచ్చిమొక్కలను కూడా పీకేస్తాడు. చీడపీడలు రాకుండా ప్రతిరోజు పొలంలో తిరుగుతాడు. పక్షులు వాలకుండా కాపాడుకుంటాడు. ధాన్యం వచ్చిన తర్వాత దాన్ని జాగ్రత్తగా కాపాడతాడు. శంకరుడు కూడా తాను ఒక సిద్ధాంతాన్ని చెప్పి వెళ్లిపోలేదు. దాన్ని ప్రచారం చేయటంపై కూడా అపారమైన శ్రద్ధపెట్టాడు. కేవలం అద్వైతసిద్ధాంత ప్రచారమే చేసినా పరతత్త్వాన్ని ఎప్పుడూ చులకనభావంతో చూడలేదు. కనకధారా స్తోత్రంవంటివి అనేకం రచించాడు. అద్వైత సిద్ధాంతానికి పునాదుల్లాంటి మాటలు మూడున్నాయి. వాటిలో మొదటిది– ఎవడు బ్రహ్మాన్ని తెలుసుకుంటాడో, వాడే బ్రహ్మ అవుతాడు. రెండోది– జీవుడికి, బ్రహ్మమునకు భేదం లేదు. మూడోది– జీవుడే బ్రహ్మసమానుడు. ఈ మూడింటి ఆధారంగా ఆదిశంకరుడు 'అహం బ్రహ్మాస్మి' అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు.

ఆదిశంకరుడి సిద్ధాంతాన్ని ఇంకా సులభంగా తెలుసుకోవాలంటే– ఆయన రాసిన భాష్యంలోని ఒక ఉదాహరణను తెలుసుకోవాలి. ఒకడు చీకటిలో ప్రయాణిస్తున్నాడు. మార్గమధ్యంలో ఒక తాడు కనిపించింది. ఆ తాడును చూచి పాము అనుకున్నాడు. భయం ప్రవేశించింది. చెమట పట్టింది. ఒళ్లంతా వణుకుతోంది. ఇదే సమయంలో గాలి వీచింది. ఆ తాడు అటూ ఇటూ కదలటం మొదలుపెట్టింది. పాము పడగ విప్పి ఆడుతోంది అనుకున్నాడు. గాలి వీచినప్పుడు ఆకులు కదిలి చప్పుడు వచ్చింది. పాము బుసకొడుతోందనుకున్నాడు. ఇంతలో మరో ప్రయాణికుడు వచ్చాడు. అతని చేతిలో జ్యోతి ఉంది. ఆ కాంతిలో చూస్తే–అప్పటి దాకా తాను పాము అని భ్రమపడింది తాడు అని తేలింది.

దాంతో ఆ ప్రయాణికుడి భయం పోయింది. భయం పోవటానికి కారణం అది పాముకాదనే సత్యం తెలియటం. అద్వైతవాదులు తాడును ఈ జగత్తుగా పేర్కొంటారు. ఈ ప్రపంచంలో ఉన్నది ఒకటే. అది బ్రహ్మం. ఈ జ్ఞానం లేక అన్నింటినీ జగత్తుకు ఆపాదించుకుంటూ ఉంటాం. ఈ బ్రహ్మంలేకుండా జగత్తు ఉండదు. కానీ జగత్తు లేకపోయినా బ్రహ్మముంటుంది. ఆ బ్రహ్మమే మాయ రూపంలో జగత్తులో ఉంటాడు. ఈ మాయ భయాన్ని కలుగజేస్తుంది. జ్ఞానమనే కాంతి ఈ మాయను తొలగించినప్పుడు మానవుడు మహనీయుడు అయిపోతాడు. తాను చిదానందరూపుడిననే విషయాన్ని తెలుసుకుంటాడు. ఆత్మకు సంబంధించి జరిగే సంఘటనలకు తాను కేవలం సాక్షిననే అంశాన్ని గుర్తిస్తాడు.

ఒక ఐఏఎస్ అధికారి ఉన్నాడనుకుందాం. అతను ఒక జిల్లాకు కలెక్టర్‌గా పనిచేస్తున్నాడు. రాత్రి ఇంటికి వచ్చిన వెంటనే కొడుకు

వచ్చి అఆలు... చెప్పమని అడిగాడు. కొడుకు మీద ప్రేమతో ఆ కలెక్టర్ అఆలు చెబుతున్నాడనుకుందాం. అప్పుడు ఆయనను చూచి- ఎలిమెంటరీ స్కూలు మాష్టారు చేయాల్సిన పనిని ఒక కలెక్టరు చేస్తున్నాడు అనుకుంటే- అది మన తప్పు అవుతుంది. కొడుకు మీద ప్రేమ ఉంది కాబట్టి ఆ కలెక్టరు అఆలు చెప్పటం మొదలుపెట్టాడు.

ఆదిశంకరుడు కూడా ఈ విధంగానే తన వద్ద ఉన్న జ్ఞానాన్ని అందరికీ అందించటం మొదలుపెట్టాడు. దీనికి భక్తిని ఒక మార్గంగా ఎన్నుకున్నాడు. ఈ భక్తిలో నుంచి జ్ఞానమొస్తుం దని భావించాడు. అందరూ బ్రహ్మజ్ఞానుల స్థాయిలో ఉండరు కాబట్టి- వారికి తగినట్లుగా స్తోత్రాలను చేశాడు. మనస్సు ప్రశాంతంగా ఉండటానికి ఇవి అవసరం.

దీన్ని కూడా ఒక ఉదాహరణ ద్వారా అర్థం చేసు కోవచ్చు. ఒక నిర్మలమైన చెఱువు ఉందనుకుందాం. దీనిలో రాయి వేస్తే తరంగాలు ఏర్పడతాయి. ఒక దాని వెనక మరొకటి ఒడ్డు దాకా వస్తాయి. ఆ తర్వాత ఆగిపోతాయి. తరంగం పుట్టింది నీటిలో, కలిసిపోయిందీ నీటిలోనే, ఇదే విధంగా మన భావనలన్నీ మనస్సులోనుంచే పుడతాయి. తృప్తి, అసంతృప్తు లన్నీ దీని నుంచే వస్తాయి. అసంతృప్తిని అలలు అను కుంటే- మనస్సు ప్రశాంతంగా లేనంతసేపు అవి పుడు తూనే ఉంటాయి. దాన్ని శాంతపరచాలంటే ఈశ్వరుడి తత్త్వాన్ని గ్రహించాలి. కానీ ఈశ్వరుడితత్త్వాన్ని మనస్సు పట్టుకోదు. అలాంటి మనస్సును మార్చగలిగినవాడు గురువు.

## వైకుంఠపాళి
## :: 87 - సమాధానాలు ::

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 భ | గీ | 2 ర | థు | డు | | | 3 ప్ర | 4 భా | సు | డు |
| | | థ్యు | | | 5 హా | | | ర | | |
| 6 భీ | ష్మ | డు | | 7 గి | రి | జ | | తం | | 8 మొ |
| ము | | | | | శ్చం | | 9 పం | | 10 హం | స |
| డు | | 11 శు | | | ద్ర | | చ | | | లి |
| | 12 పు | ష్క | రా | లు | | 13 సౌ | గం | ధి | క | |
| 14 గం | | ము | | | 15 భా | | గ | | | 16 అ |
| గా | | | | | గీ | | | | 17 అ | న్న |
| 18 హా | స్య | ము | | 19 నా | ర | దు | డు | | | పూ |
| ర | | | 20 రా | | థి | | | 21 పా | | ర్ణ |
| తి | | 22 క్రో | ధ | న | | 23 అ | వి | ము | క్తం | |

## ఈశ్వరుడిని ప్రసన్నం చేసుకోవటం

ఈశ్వరుడిని ప్రసన్నం చేసుకోవటం ఆయనలో మమైకం అయిపోవటం అంత సులభం కాదు. ఆది శంకరుడు దాన్ని సాధించగలిగాడు.

ఆయన భక్తి ఏస్థాయికి చేరిందంటే ఒక చోట- "శివతవ పరిచర్యా సన్నిధానాయ గౌర్యా భవ" అంటాడు. "శంకరా! నీకు నా కూతురిని ఇచ్చి పెళ్లి చేద్దామనుకుంటు న్నాను..." అంటాడు. ఆదిశంకరుడికి పెళ్లికాలేదు అలాం టప్పుడు కూతురు ఎక్కడి నుంచి వచ్చింది? ఆమెను శివుడికి ఇచ్చి పెళ్లి చేసే ప్రతిపాదన ఎలా వచ్చింది?" అనే అను మానాలు వస్తాయి.

ఆదిశంకరుడు ఈ ప్రతిపాదన చేయటానికి ఒక కారణముంది. శివా అంటే మంగళప్రదమైన స్వరూపమున్న వాడు. పైకి శంకరుడు చూడ్డానికి చాలా అమంగళంగా కనిపిస్తాడు. మెడలో పునుకల మాల, పెద్దపెద్ద పాములు, ఒంటినిండా విభూతి- ఇలా చూడటానికి భయం కలిగిం చేలా ఉంటాడు. కానీ అసలు సౌందర్యం చాలా గొప్పగా ఉంటుంది.

అలాంటి శివుడికి, "లోకాలన్నింటినీ కన్న పురుషు డివి నీకు నా పిల్లను ఇస్తాను" అని ఆదిశంకరుడు ప్రతిపా దించాడు. ఆ పిల్ల ఎవరూ? ఆదిశంకరుడి బుద్ధి. ఆ బుద్ధి ఏం చేస్తుంది? శివుడికి, ఆయన భార్య గౌరీదేవికి సపర్యలు చేస్తూ ఉంటుంది. అయితే శంకరుడు ఇక్కడ ఒక షరతు పెట్టాడు. అది ఇల్లరికం. "నా బుద్ధి అనబడే కూతురును నీకిస్తాను. నువ్వు మాత్రం నా మనసులో స్థిరనివాసం ఉండిపోవాలి" అని ఈశ్వరుడిని ప్రార్థించాడు. ఈశ్వరుడితో మమైకం అయిపోవటానికి అవసరమైన సాధనాలన్నీ భక్తులకు అందించాడు-ఆదిశంకరుడు.

# అపురూపం ఈ దర్శనం

- శ్రీ బులుసు ప్రభాకరశర్మ,
9849595371

మనదేశంలోని సుప్రసిద్ధ నారసింహ క్షేత్రాలలో విశాఖపట్నం నగరంలోని సింహాచలం ఎంతో విశిష్టమైంది. చల్లని ఆహ్లాదకరమైన వాతావరణంలో సహజ జలధారల మధ్య సుగంధ పరిమళాలు వెదజల్లుతుండగా అక్కడ వెలసి ఉన్న చందనచర్చితుడైన శ్రీవరాహలక్ష్మీనృసింహ స్వామివారి దర్శనంకోసం భక్తులు తహ తహలాడుతుంటారు.


ఈ స్వామి రూపమే విచిత్రం. హిరణ్యాక్షుని సంహరించిన వరాహావతారం, హిరణ్యకశిపుని అంతమొందించిన నృసింహావతారం కలసి ఏకాకృతిలో వరాహలక్ష్మీ నరసింహమూర్తిగా వెలసిన స్వామి ఈయన. మూలవిరాట్టు గర్భగుడిమధ్యలో రాతిదిమ్మపై ఉంటుంది. స్వామివారు త్రిభంగిమలో నిలబడి ఉంటారు. రెండు చేతులు, వరాహముఖం, శరీరమంతా మనిషిలాగా, కాని వెనుక సింహవాలం ఉంది. స్వామివారికి ఇరువైపులా శ్రీదేవి, భూదేవి విగ్రహాలు నిలుచుని ఉంటాయి. ఈ మూడువిగ్రహాలు ఉన్న ప్రదేశాన్ని ప్రహ్లాదమండపం అంటారు.

ఈ అపురూపదర్శనం సంవత్సరం మొత్తంలో ఒక్క అక్షయతృతీయనాడు మాత్రమే లభించడంవల్ల దేశ విదేశాల నుంచి లక్షలాది భక్తులు ఆరోజున సింహగిరికి పోటెత్తుతారు. ఏడాది పొడుగునా మూలవిరాట్టు దళసరి చందనం పూతతో లింగాకారంలో ఉంటుంది. అందుకే సింహాచలేశ్వరుని చందనస్వామిగా కూడా పేర్కొంటారు. ఇద్దరు రాక్షసులను మట్టు బెట్టిన వరాహ, నారసింహ రూపాలు రెండూ ఉగ్రమైనవే. ఏకరూపంలో ఉన్న ఆ స్వామిని శాంతింప జేయడానికి చల్లని చందనాన్ని అద్దుతారు. ఒకటీ రెండూ కాదు, మొత్తం 500 కిలోల చందనం దట్టంగా పూసి ఉంటుంది.

పురూరవచక్రవర్తి కాలంనుండి ఈ చందనోత్సవవేడుక ప్రారంభమైంది. చందనంకోసం గంధపు చెక్కలను తమిళ నాడు నుంచి ప్రత్యేకంగా తెప్పించి అరగదీస్తారు. చందనోత్సవం ముందు రోజున బంగారుబొరిగెలతో చందనాన్ని ఒలిచి, దాన్నే తర్వాత భక్తులకు ప్రసాదంగా పంచుతారు.

నిజరూపదర్శనం పూర్తయ్యాక రాత్రి మళ్లీ చందనలేపనం ప్రారంభిస్తారు. దాదాపు మూడుమణుగులు అంటే 120 కిలోగ్రాముల చందనాన్ని ఈరోజున కప్పుతారు. మళ్లీ సంవత్సరంలో మరో మూడు సార్లు- వైశాఖ, జ్యేష్ఠ, ఆషాఢపౌర్ణమి దినాలలో 120 కి.లోల చొప్పున మొత్తం 500 కిలోల చందనంపూతతో స్వామివారు లింగాకారంలో అలరారుతుంటారు. ఈ ఆలయంలో పాంచరాత్రాగమం ప్రకారం పూజాదికాలు నిర్వర్తిస్తారు.

సింహాచలక్షేత్రంలో సంవత్సరం పొడుగునా జరిగే ఉత్సవాలలో చందనోత్సవమే చాలా ప్రముఖమైంది. ఇదికాక



కల్యాణోత్సవం, రథోత్సవం, తెప్పోత్సవం, గిరిప్రదక్షిణ కూడా ఎంతో ఉత్సాహ భరితంగా నిర్వహిస్తారు. ఉత్తరాంధ్రలో సింహాద్రి నరసింహస్వామిని ప్రజలు ప్రేమగా అప్పన్నస్వామి అని పిలుచుకుంటారు. చందనోత్సవం ముందు వచ్చే చైత్ర బహుళ అమావాస్యను గంధం అమావాస్యగా చాలా ఇళ్లల్లో పూజలు జరుపుకుంటారు.

**ఈ నెల 23న సింహాచలం చందనోత్సవ సందర్భంగా...**



## శ్రీవేంకటేశ్వరలీలలు



# అలౌకిక అనుభూతి

– ఆచార్య పాపిరెడ్డి నరసింహారెడ్డి, 90006 37657

అప్పుడు నేను ఆరుదాటి ఏడోసంవత్సరంలో పడ్డా. మొట్ట మొదటిసారి కొండకు రావడం లీలగా గుర్తు ఉంది. కారణం– నేను చేసిన అతిపనే! మాది అన్నమయ్యజిల్లా, రాయచోటి దగ్గర నాలుగు కి.మీ దూరంలో కదరిరోడ్డు మీద ఉన్న పెద్దకాల్వపల్లె. మాది నడింపల్లె. మా ఊరిపేరు పెద్దదే. కటవక్రింద పాపిరెడ్డి గారిపల్లె.

మా సుభద్ర పిన్నమ్మ 11 నెలల కొడుక్కి పుట్టెంటుకలు తీయించడానికి కొండకు బయలుదేరాం. ఆ కాలంలో అంటే 1953వ సం॥లో రాయచోటి నుండి తిరుమలకు బస్సుమార్గం లేదు. రైల్లో రావాల్సిందే! కలికిరిలో రైలెక్కి పీలేరు ద్వారా పాకాల చేరుకున్నాం. పాకాల ప్లాట్‌ఫాం మీద ఉన్నాం.

నేను రెండు నిలువు ఇనుపగరండాల మధ్య నా తలకాయ దూర్చాను. ఏలా దూర్చానో నాకే తెలీదు. తల ఒక వైపు మొండెం ఒక వైపు. ఎంత గింజుకున్నా తల ఊడి రాదే! అరుస్తున్నా... ఏడుస్తున్నా...!

మా అమ్మావాళ్లకు దిక్కు తెలీలేదు "ఏంచేయాలిరా భగవంతుడా.... గోవిందా! గోవిందా!! గోవిందా!!! ఆపద మొక్కుల వాడా! మమ్మల్ని ఈ గండం నుంచి గట్టున పడెయ్యిస్వామీ!" అని మొక్కుకుంటున్నారు. ప్రజలు గుంపు కూడారు. నలుగురు నాలుగురకాలుగా నన్ను ఆడిపోసు కుంటున్నారు. మా గుంపులో ఎవరో "నరసిమ్ములు తల పక్కకు పెట్టి దూర్చినట్లు ఉంది". వెంటనే, మా మేనమామ వచ్చి సుతారంగా ఏటవాలుగా వంచి నా తలను బయటకు తీశాడు.

మా అమ్మ నన్ను ఉతికి ఆరేసింది. మళ్లీ హృదయానికి హత్తుకొని ఏడ్చేసింది. స్వామివారు భక్తుల మొరలాలించే



సులభుడు కదా! ఆయన క్షమాహృదయుడు కదా... తన కొండ ప్రయాణం ఆపేస్తాడా ఏంటి?

శ్రీవారి కడగంటి చూపు సర్వశుభాల్ని కలిగిస్తుంది. అందుకే ఆయన 'శుభేక్షణుడు'. ఓసారి ఆయన చల్లని చూపు నా మీద ఎలా ప్రసరించిందో అది అద్భుతదృశ్యం.

ఒక రోజు అన్నమయ్య జయంతి ఉత్సవాల్లో ఉదయం ఉపన్యాసం ఇచ్చాక, ఆ సాయంత్రం స్వామివారి దర్శనం చేయిస్తామన్నారు. తి.తి.దేవస్థానం వారి బస్సులో 20మంది ఉపన్యాసకులు, అతిథులు బయలుదేరాం. స్వామిదర్శనం క్యూలో నిలుచున్నాం. బంగారువాకిలి దాటి స్వామివారి సన్నిధి క్యూలో నిలబడ్డాం. గోవిందనామస్మరణలు చేస్తూ మెల్లగా ముందుకు సాగుతున్నాం. స్వామివారిని కంటిమీద రెప్ప వేయకుండా చూస్తూ చాలామంది దర్శనం పూర్తి చేసు కుని బయలు దేరి వెళ్లిపోయారు. ఇంతలో మహాద్భుతం జరిగింది. క్యూలైను ఆపేశారు. బయటనుండి ఉత్సవ మూర్తులను లోపలికి తెచ్చి, హారతి ఇచ్చారు. దీనికి పదిహేను నిముషాలు పట్టింది. అంతసేపు స్వామివారిని చూచేందుకు నాకు రెండూ కళ్లు సరిపోలేదు. ఎంతో అలౌకిక అనుభూతి అది. స్వామివారు నా పట్ల శుభేక్ష ణుడు అయ్యాడు.



# మోక్షమార్గదర్శి

– ఆచార్య మాడభూషి శ్రీధర్

శ్రీరామానుజులు గొప్ప రచయిత. సంస్కృతం, తమిళం, మణిప్రవాళభాషలలో నిష్ణాతుడు. తాము రచించిన తొమ్మిదిగ్రంథాలతో రామానుజులు శ్రీభాష్యకారులని పేరు పొందారు. పన్నెండుగురు శ్రీవైష్ణవ ఆళ్వార్ల రచనలను సమష్టిగా నాలాయిరదివ్యప్రబంధం అంటారు. వీరి రచనలను ప్రజలలోకి తెచ్చిన ఘనత రామానుజలదే.

సమభావాన్ని చాటే సహపంక్తి భోజనాలను శ్రీరామాజునులు ప్రోత్సహించారు. రామానుజకూటమి పేరుతో అన్నదానాలను, మధ్యాహ్నభోజనాలను నిర్వహించేవారు. ఇప్పటికీ వైష్ణవక్షేత్రాలలో రామానుజకూటములు కొనసాగుతున్నాయి. పదిదశాబ్దాలకిందట దక్షిణాన తిరువనంతపురంనుంచి పశ్చిమాన ద్వారకదాకా, ఉత్తరాన కాశ్మీరం, నేపాల్‌నుంచి ముక్తినాథ్‌దాకా, తూర్పున పూరీజగన్నాథ్ దాకా పర్యటన చేసి, శాస్త్రచర్చలలో విజయాలు సాధించి వైష్ణవపరంపరను నెలకొల్పిన జగదాచార్యుడు.

తొండనూరులో 2200ఎకరాల గుడి చెరువును నిర్మించిన జలాశయ నిర్మాణ నిపుణుడు శ్రీరామానుజుడు. కులం, మతం అని చూడకుండా అందరికీ ప్రతి ఆలయంలో భోజనం పెట్టే సంప్రదాయం శ్రీరామానుజుడు ప్రారంభించిందే.

యోగం, జ్ఞానం, రచన, కళలు, శాస్త్రం, సాంఖ్య, ఆధ్యాత్మిక, పురాణాలు, వేదాలు, జనార్ధనుడినుంచే ఉత్పన్నమైనాయని విష్ణుసహస్రనామంలో భీష్ముడు వివరిస్తాడు. పరమాత్ముడి విజ్ఞానం మొత్తం అందరికీ చెందింది. ఈ విజ్ఞానం మీద ఎవరికీ ఆధిపత్యం లేదు.

జ్ఞానమే శక్తి. తెలుసుకున్న సమాచారమే మనిషిని విముక్తం చేస్తుంది. విద్యే ప్రగతికి మూలం.

ఉపవాసాలు చేస్తూ, ఆచార్యుని పరీక్షలను సహిస్తూ, కాలినడకన వందల మైళ్లు పదేపదే ప్రయాణిస్తూ పద్దెనిమిది సార్లు శ్రీరంగం నుంచి తిరుగోష్ఠియూర్‌కు వెళ్లి గురువుగారి దయను అత్యంత సహనంతో సాధించిన శ్రీరామానుజుడు పట్టుదలకు, దీక్షకు సరైన ఉదాహరణ. ప్రతీసారీ పరమార్థాన్ని తెలుసుకోవడానికి తిరుగోష్ఠియూర్ వెళ్లడం, మళ్లీ రా అని చెప్పడం, శ్రీరామానుజుడు వెళ్లి ఓపిగ్గా మళ్లీ రావడం, చివరకు గురువుగారి అనుగ్రహాన్ని, తిరుమంత్రార్థాన్ని సాధించడం అనూహ్యమైన విజయం. అంత కష్టపడి తెచ్చుకున్న నారాయణుని నిధిని ఒక్కనిమిషంలో చెప్పి శ్రీరామానుజుడు అందరికీ పంచిపెట్టారు. తిరుగోష్ఠియూర్ గోపురం ఎక్కి అందరికీ నారాయణ మంత్రార్థ రహస్యాన్ని బయట పెట్టి ఎవ్వరైనా నారాయణుని దయకు అర్హుడే అని మోక్షమార్గాన్ని చూపిన జగద్గురువు శ్రీరామానుజులు.

వేయేళ్ల కిందట నారాయణ తత్త్వాన్ని విశదీకరించేందుకే అవతరించిన మహాపురుషుడు భగవద్ శ్రీరామానుజులు. 120 సంవత్సరాలే ఆయన జీవనకాలం అయినప్పటికీ భగవద్ రామానుజులు ఎన్నటికీ అమరుడే. మరవడానికి సాధ్యం కాని చిరంజీవి.



గోపురం ఎక్కి తిరుమంత్రార్థ రహస్యాలు వెల్లడించిన రామానుజాచార్యుడు, మతం అనే అడ్డుగోడలను కూల్చి అందరినీ కాంతి వైపు నడిపించిన జగదాచార్యుడు. పరమాత్మను అందుకునే అవకాశాలు పొందాలని తపించిన సమతామూర్తి, అధ్యాపకుడు, ప్రబోధకుడు, మోక్షమార్గదర్శి.

ఈ నెల 25న శ్రీరామానుజ జయంతి సందర్భంగా...

గృహలక్ష్మి

# రవ్వంత పుణ్యానికి కొండంత ఫలితం

– శ్రీమతి జానపాటి మనస్విని,
83175 81997

త్రికరణశుద్ధిగా చేసే ఏ చిన్న పనైనా సరే అది భగవంతుడి అనుగ్రహాన్ని పొందుతుందని చెప్పటానికి ప్రతీకగా నిలిచే పండుగ అక్షయతృతీయ. వైశాఖశుద్ధతదియకు అక్షయ తృతీయ అని పేరు. ఈ రోజున చేసే పుణ్యం రవ్వంతైనా సరే అది కొండంత ఫలితాన్నిస్తుంది. అందుకనే ఈ పండుగకు అంతులేని ఆదరణ.

అక్షయం అంటే క్షయం లేనిది, నాశనం కానిది అని అర్థం. ఈ ప్రకారం చూస్తే అక్షతదియ రోజున చేసే పనులన్నీ క్షయంకాని ఫలితాన్నిస్తాయి. కేవలం నాశనం లేకుండా ఉండటమే కాదు. చేసిన పుణ్యకార్యం మరిన్ని ఎక్కువ రెట్లు ఫలితాన్ని కూడా ఇస్తుంది. అందుకే అక్షతదియ రోజున ఏదో ఒక చిన్న పుణ్యకార్యమైనా చెయ్యాలని పెద్దలు చెబుతారు.

అక్షతదియ వ్రతాన్ని పెళ్లికానివారు ఆచరిస్తే అతిస్వల్ప కాలంలో వివాహం జరుగుతుందని నమ్మిక. ఈ వ్రతాన్ని లక్ష్మీ నారాయణులు, గౌరీశంకరుల్ని ఉద్దేశించి చెయ్యాలి. అమ్మవారి ప్రతిమను మంటపంలో ఉంచి పూజించాలి. అమ్మవారికి బెల్లం, నెయ్యి, నూనె, కలకండ, ఉప్పు, ఆకుకూరలు, జీలకర్ర నివేదన చెయ్యాలి. పగలంతా ఉపవాసం ఉండి రాత్రికి ఉప్పు, కారం లేని పదార్థాలు భుజించాలి. తప్పనిసరిగా రాత్రివరకు మౌనం పాటించాలి. అరుంధతి ఈ వ్రతాన్ని ఆచరించిన ఫలితంగానే సప్తర్షిమండలంలో స్థానం సంపాదించిందని పురాణాలు చెబుతున్నాయి.

**ఈ నెల 23వ తేదీ అక్షయతృతీయ సందర్భంగా...**

అక్షతదియ రోజున ఉప్పును విసర్జించటం వల్ల అమ్మవారు సంతోషించి లావణ్యాన్ని, రూపసౌభాగ్యాన్ని ప్రసాదిస్తుందని భవిష్యపురాణం చెబుతోంది. లక్ష్మీదేవితో పాటు గౌరీదేవికి కూడా ఈ రోజున విధివిధానంగా పూజలు చెయ్యాలి. ఈ రోజున సూర్యోదయానికి ముందే నిద్రలేచి, స్నానాది కార్యక్రమాలు పూర్తి చేసుకోవాలి. విష్ణుమూర్తిని ప్రార్థన చెయ్యాలి. ఈ రోజున దేవతలతో పాటు పితృదేవతలను కూడా ఆరాధించాలి. యథాశక్తిగా గోదానం, భూదానం, సువర్ణదానం, వస్త్ర దానం చెయ్యాలి. ముత్తయిదువులు చిన్ని కృష్ణుడుకి, గౌరీదేవికి డోలోత్సవం నిర్వహించాలి. అనంతరం ముత్తయిదువులకు, కన్యలకు సుమంగళద్రవ్యాలు, నూతనవస్త్రాలతో పాటు శనగలు వాయనం ఇవ్వాలి. దీనివల్ల దీర్ఘసుమంగళీయోగం కలుగుతుంది.

వైశాఖమాసం ఎండలు నెమ్మదిగా తీవ్రంగా పెరిగే సమయం కాబట్టి విసనకర్రలు దానం చెయ్యాలి. ఈ కాలంలో పండే మామిడిపండ్లు దానం చెయ్యాలి. కొన్ని ప్రాంతాల్లో స్థానిక ఆచారాల ప్రకారం లడ్డూలు దానం చేస్తారు. పెరుగన్నం,




పాదరక్షలు, ఛత్రం, ఉదక కుంభం(నీటి చెంబు) కూడా దానం చేసే ఆచారం కొన్నిచోట్ల ఉంది. ఇటీవలి కాలంలో నీటికుండను దానం చెయ్యటానికి బదులుగా నీటికేంద్రాలు(చలివేంద్రాలు) ఏర్పాటుచేస్తున్నారు. మట్టిగ్లాసుల్లో నీటిని పాదచారులకు పంచితే ఆ నీటిలో ఎన్ని జలబిందువులు ఉంటాయో అన్ని సంవత్సరాల పాటు దివ్యలోకాల్లో జీవించే పుణ్యఫలితం దక్కుతుంది.

ఏదైనా కారణంవల్ల వైశాఖశుద్ధతదియ రోజున వ్రతాన్ని ఆచరించలేకపోతే భాద్రపదశుక్లతదియ లేదా మాఘశుద్ధ తదియరోజుల్లో కూడా ఈ వ్రతాన్ని ఆచరించవచ్చు. శక్తి ఉండి సంవత్సరంలో వచ్చే 12 శుద్ధతదియల్లోనూ ఈ వ్రతాన్ని ఆచరించగలిగితే మాటల్లో వర్ణించలేనంత పుణ్యఫలితం కలుగుతుంది.

గంగానది ఒడ్డున 64 ఘాట్లు ఉన్నాయి

ఆచారసంప్రదాయాల ప్రకారం చూస్తే అక్షతదియ రోజున వ్యవసాయం చేసేవారు తమ పొలాల్లో ఈ రోజున విత్తనాలు చల్లుతారు. గృహస్థులు కూరగాయలమొక్కలు నాటుతారు. మరికొంతమంది దానధర్మాలు చేస్తారు.



పూర్వం శాకలనగరంలో ధర్మాత్ముడైన ఓ వ్యాపారి ఉండే వాడు. ఒక రోజున అతడికి దానం చెయ్యాలనే బుద్ధి కలిగింది. అనుకున్నదే తడవుగా తన దగ్గర ఉన్న వస్తువులన్నీ చివరకు ఇంట్లోని వస్తువులు, ధాన్యాలతో సహా అన్నీ దానం చేశాడు. చివరకు కూరలు, పెరుగన్నం కూడా దానం చేశాడు. రేపటికి ఎలా అన్న ఆలోచన అతడికి కలగలేదు. భార్యాపిల్లలు వారిస్తున్నా వినిపించుకోలేదు. నిజానికి ఆ రోజు అక్షతదియ. కానీ అతడికా విషయం తెలియదు. తెలిసి చేసినా తెలియక చేసినా అక్షతృతీయ రోజున అమితమైన దానం చేసిన ఫలితంగా ఆ వ్యాపారికి తెల్లవారేసరికి కొన్నిరెట్లు ఎక్కువ వస్తువులు లభించాయి. అలా అతడు దానాన్ని తన చివరిరోజు వరకు చేశాడు.

అమితమైన దానఫలితంగా అతడు తర్వాతి జన్మలో కుశావతి అనే నగరంలో ఉత్తమక్షత్రియ వంశంలో జన్మించాడు. పూర్వజన్మ జ్ఞాపకాలు ఉండటంతో అనేక యజ్ఞయాగాలు, దానాలు లెక్కకు మిక్కిలిగా చేశాడు. ఫలితంగా తర్వాతి జన్మలో అతడు వేదాధ్యయనపరుడైన ఓ సంపన్న బ్రాహ్మణుడి ఇంట్లో జన్మించాడు. ఆ జన్మలోనూ భూరిదానాలు చెయ్యటంతో అక్షయమైన పుణ్యలోకాల్లో శాశ్వతంగా నివసించే పుణ్యఫలితాన్ని పొందాడు. అక్షతదియ నాడు చేసే దానాలు ఇంతటి సర్వోన్నతమైన పుణ్యాన్ని అందిస్తాయి.

ఈ రోజు చేసే ఏ చిన్న పుణ్యమైన అనేకరెట్లు ఎక్కువ ఫలితాన్నిస్తుందనే నానుడి వల్ల చాలామంది ఈ రోజున బంగారం కొనటానికి ప్రయత్నిస్తారు. చాలామంది కొంటారు కూడా. అయితే ఇది పూర్తిగా అవాస్తవం. మనం నిష్కామకర్మగా చేసే పుణ్యకార్యాలు అనేకరెట్లు ఎక్కువ ఫలితాన్నిస్తాయే తప్ప ఈ రోజున బంగారం కొన్నామని ఏడాదంతా బంగారంకొంటూనే ఉంటామని అనుకోవటం పూర్తిగా తప్పు. ఇది కేవలం వ్యాపారస్తులు ప్రవేశపెట్టిన పథకం మాత్రమేనని గ్రహించాలి. ఏదైనా పని వల్లనో లేదా మరే ఇతర కారణంగా అక్షతదియ రోజున బంగారం కొనుగోలు చేస్తే చేయవచ్చు కానీ అక్షయఫలితాన్ని ఆశించి బంగారం కొనటం అత్యాశ తప్ప మరొకటి కాదు. ఇందుకు శాస్త్రప్రమాణం ఏదీ లేదు.

మొత్తంగా అక్షతదియ పర్వదినం మనిషిని సత్కర్మల వైపు ప్రేరేపిస్తుంది. కర్మయోగిని చేస్తుంది. తనతో పాటు సమాజాన్ని కూడా సత్కర్మల వైపు నడిపించే ధర్మబుద్ధిని కలిగిస్తుంది.

**26వ పేజీలోని.. 'తేడాలు గుర్తించండి' కి జవాబులు**





మణికర్ణికలో మధ్యాహ్నం 11.30 గం॥ నుండి 12.30 మధ్య స్నానం చేయడం పుణ్యప్రదం

# ఒక్కసారి స్నానం చేస్తే చాలు..

- శ్రీమతి పి.యస్.యమ్.లక్ష్మి,
***98660 01629***

మహాప్రళయకాలంలో సమస్తబ్రహ్మాండమూ చీకటిమయమై ఏమీ గోచరించని సమయంలో నామ రూప వర్ణాలులేని మహా తేజస్సు ఒకటి ఉండేది. అద్వితీయుడైన అతనికి సృష్టి కార్య నిర్వహణకు మరొకరు ఉంటే ఉత్తమమని గోచరించింది. తానా ఆకారం లేనివాడు. తనకు సహాయకారి సమూర్తమైన తన స్వరూపమే. అతడు తన లీలచే ఒక మాయాశక్తిని సృష్టించాడు. పర అని పిలవబడే ఆ మాయ సర్వస్వరూపిణి, సమస్తాన్ని చూచేది, సమస్తాన్ని సృష్టించేది. ఆ సమస్త సృష్టి నిర్వాహకురాలిని అరూపుడైన ఈశ్వరుడు తనలో లీనం చేసుకున్నాడు. అమూర్తిస్వరూపుడైన బ్రహ్మ, పర అని పిలవబడే ఆ మాయాశక్తి స్వరూపమే.. పరబ్రహ్మ. ప్రకృతి స్వరూపిణియైన ఆ మాయా శక్తికి, పార్వతికి భేదం లేదు. పురుషస్వరూపుడైన ఈశ్వరుని క్షేత్రమే శక్తి. ఈ ఉభయులకలయిక వల్ల కాశీపట్టణం నిర్మింప బడింది. ఈ క్షేత్రం ప్రళయకాలంలో కూడా పరబ్రహ్మచేత వదిలి పెట్టబడదు. అందుకే ఇది అవిముక్తక్షేత్రమైంది. పరమే శ్వరునిచే సృష్టింపబడ్డ కాశీ స్వయంగా సృష్టి, స్థితి, లయ కారకురాలు. అంటే అది సృష్టింపగలదు, పరిపాలింపగలదు, చివరికి సంహరించగలదు.

కొంతకాలం తర్వాత తిరిగి సృష్టి చేయాలనే ఆలోచన కలిగిన ఈశ్వరుడు ప్రకృతిరూపిణియైన పార్వతి శరీరాన్ని సాభిప్రాయంతో చూచాడు. వెంటనే ఆమె శరీరంనుంచి అత్యంత సుందరుడైన ఒక పురుషుడు ఆవిర్భవించాడు. ఆ మహాపురుషుని చూచి ఈశ్వరుడు, "అచ్యుతా, నీవు మహావిష్ణువువి కమ్ము. నీ ఉచ్ఛ్వాస నిశ్వాసాలవల్ల వేదాలు ఉద్భవిస్తాయి. వాటి వల్ల నీవు సర్వం తెలుసుకుంటావు. ఆ విధంగా నడచుకొమ్ము" అని అతణ్ణి బుద్ధితత్త్వానికి అధిపతిని చేశాడు.


అప్పుడు శ్రీమహావిష్ణువు కొంతసమయం తపస్సు చేయ సంకల్పించాడు. తన సుదర్శనచక్రంతో ఒక పుష్కరిణిని తవ్వి, తన శరీరానికి పట్టిన చెమటబిందువులతో ఆ పుష్కరిణిని నింపాడు. ఆ చక్ర పుష్కరిణీతీరంలో అతను చాలాకాలం మహోగ్రతపస్సు చేశాడు. ఏకాగ్రమనస్సుతో నిమీలితనేత్రుడై తపస్సు చేస్తున్న హరిని పార్వతీసమేతుడైన ఈశ్వరుడు మెచ్చు కోలుగా చూసి తల పంకించాడు. ఆ సమయంలో ఆయన చెవి పోగులు ఊగిసలాడి చెవినుండి ఒక మణికర్ణిక ఆ నేలపై బడింది. ఆ మణిభూషణం పడినచోటు మణికర్ణికగా పిలువ బడుతోంది. మహాశివుడి కర్ణభూషణంకాదు, అమ్మవారి చెవి భూషణం అని కూడా కొందరంటారు.



శ్రీమహావిష్ణువు తవ్విన మణికర్ణికా కుండం

ఆ సమయంలో శ్రీమహావిష్ణువు సర్వజగద్రక్షాకరమైన ఇంకొక వరాన్ని కోరాడు. మహాప్రళయం సమయంలో కూడా కాశీ అలాగే ఉండాలి. పిపీలికాది బ్రహ్మ పర్యంతమైన భూతజాలమంతా ఈ కాశీ పట్టణాన్ని సేవిస్తే ముక్తిచెందాలి. ఈ తీర్థంలో స్నానసంధ్యా, జప, హోమ వేదాధ్యయనాలు ఉత్తమమైనవి కావాలి. తర్పణలు వగైరా పితృకార్యాలు, దేవతాపూజలు, దానాలు చేసిన పుణ్యాలు అక్షయమవ్వాలి అని. ఈ ప్రదేశంలో శివుడి ప్రమథగణాలు త్రిశూలపాణులై సంచరిస్తూ ఉంటారు. వారికి భయపడి మనుష్యుల మహాపాపాలు వారితో ఈ క్షేత్రంలో అడుగుపెట్టవు. ఈ క్షేత్రంలో పాపరహితుడై ప్రవేశించి మణికర్ణికలో స్నాన మాచరించినవారు ఉత్తమపుణ్యాల్ని పొందుతారు. సమస్తతీర్థాల్లో స్నానం చేస్తే లభించే పుణ్యం మణికర్ణికలో ఒక్కసారి స్నానం


చేస్తే లభిస్తుంది. గోమయం, కుశలు, దూర్వ ఉత్తరేణి, దర్భలు మొదలైన వాటితో విధివిధానంగా ఈ మణికర్ణికతో స్నానం చేసినవారికి సర్వతీర్థాలలో స్నానపుణ్యం, సర్వదానపుణ్యఫలం లభిస్తుంది. శ్రద్ధ లేకుండా మణికర్ణికలో స్నానమాచరించిన వారు కూడా స్వర్గప్రాప్తికరమైన పుణ్య ఫలాన్ని పొందుతారు. ఇంక శ్రద్ధతో స్నానమాచరించి దేవతాదులకు తిలలు ఉదకాదులచేత తర్పణమాచరించినవారు సమస్తయజ్ఞాలాచరించిన ఫలాన్ని పొందుతారు. మౌనంగా ఈ మణికర్ణికా ఘట్టమున స్నానమాచరించి విశ్వేశ్వర సందర్శన మాచరించినవారు సమస్త


శ్రీకాశీవిశ్వనాథ ఆలయమార్గం

వ్రతాలు ఆచరించినట్లవుతుంది. ఈ అవిముక్తక్షేత్రంలో న్యాయార్జితమైన ధనాన్ని ఏ కొంచెమైనా దానంచేసినవాడు ఎప్పటికీ దరిద్రుడు కాడు.

ఇక్కడ స్నానం గురించి కూడా భక్తులలో అనేక నమ్మకాలు ఉన్నాయి. మణికర్ణికాఘాట్ దగ్గర గంగానదిలో స్నానం చేసి తర్వాత పైన చక్రకుండంలో స్నానం చేసి మళ్లీ మణికర్ణికాఘాట్‌లోని గంగానదిలో స్నానం చెయ్యాలని కొందరు చెబితే, మణికర్ణికాఘాట్‌లో మధ్యాహ్నం పన్నెండు గం॥లకి సకలదేవతలూ స్నానం చెయ్యటానికి వస్తారనీ, ఆ సమయంలో అక్కడ స్నానం చెయ్యటం మహాపుణ్యప్రదమని ఇంకొందరంటారు.

చారిత్రకంగా చూస్తే ఈ ఘాట్ గురించి 5వ శతాబ్దానికి చెందిన గుప్తుల శాసనాల్లో కనిపిస్తుంది. దీనికి ఉన్న రాతి మెట్లు 1303లో మొదట నిర్మింపబడి తర్వాత 1730లో బాజీరావు పేష్వా చేత పునర్నిర్మింపబడ్డాయి. 1791లో రాణీ అహల్యాబాయి హోల్కర్ ఘాట్‌మొత్తాన్ని పునర్నిర్మించింది. తర్వాత 1872లోనూ, 1965లో కూడా పునర్నిర్మాణం పనులు జరిగాయి. ఈ ఘాట్ సమీపంలోనే తారకేశ్వరాలయం, ఇంకా ఇతర ఆలయాలతో బాటు నీటిలోకి ఒరిగిన రత్నేశ్వర ఆలయాన్ని చూడవచ్చు. ఇది 19వ


రత్నేశ్వర ఆలయం

శతాబ్దంలో ఇలా ఒరిగిందనీ, దీనికి కారణం గంగానది ప్రవాహప్రాంతంలో నిర్మించటమేనని అంటారు.

ఈ క్షేత్రాన్ని మహాస్మశానం అని కూడా అంటారు. కాశీలో పోవాలనీ, ఇక్కడే అంత్యక్రియలు జరగాలనీ కోరుకునే వారెందరో. దానికి కారణం ఇక్కడ జీవన్ముక్తులైనా, అంత్యక్రియలు జరిగినా మోక్షం లభిస్తుందనీ, పునర్జన్మ ఉండదనే నమ్మకం. అందుకనే ఇక్కడ శవదహనాలు కూడా ఎక్కువే. కాశీలో జరిగే అంత్యక్రియలలో ఎక్కువ భాగం మణికర్ణికా ఘాట్‌లో, తర్వాత హరిశ్చంద్రఘాట్‌లోనే జరుగుతాయి.


హరిశ్చంద్రఘాట్‌లో హరిశ్చంద్రుడు ప్రతిష్ఠించిన శివలింగం

ఇంతటి మహత్తరమైన మణికర్ణికాఘాట్ కాశీ వెళ్లిన ప్రతిఒక్కరూ దర్శించాల్సిన పుణ్యస్థలం.



కాశీలో తెలుగువాళ్లందరూ ఎక్కువగా కుమారస్వామిమఠంలో బసచేస్తారు

ఏప్రిల్ 6న తుంబురుతీర్థముక్కోటి సందర్భంగా...

# తిరుమల అడవుల్లోని అద్భుతం!

శ్రీ బి.వి.రమణ
97045 67641



మనిషి పుట్టుకే ఆశ్చర్యమనుకుంటే... ఆ ఆవిర్భవానికి కారణమైన మూలప్రకృతి మరెంతటి నిబిడాశ్చర్యకరమో! అలాంటి అచ్చెరువొందించే, కుతూహలం రేకెత్తించే ప్రాకృతిక చమత్కృత శిలాశిల్పాలయం తుంబురుతీర్థం! నింగీ, నేలా, నీరూ, వేడీ, వాయువూ కలగలసి తమ్ము తాము శిల్పించుకుంటూ సృష్టించుకున్న ఓ మార్మికప్రదేశం-తుంబురుతీర్థం. శ్రీవేంకటేశ్వర స్వామి వేట విడిది! ఎందరో ఋషులు, యోగులు, సిద్ధులు, సాధకుల తపఃస్థలి!

**భువిపై దివి-** మెరిసే నక్షత్రాల జడి నడుమనుండి జారిపడ్డ గ్రహశకలం లాంటి తుంబురుతీర్థం శేషాచలసానువుల్లోని సమ్మోహన స్థలం. తూర్పుకనుమలు, దక్కను పీఠభూమికి చెందిన శేషాచలం ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రంలోని తిరుపతి, కడపజిల్లాల ఉమ్మడి అటవీప్రాంతం. ప్రఖ్యాత పుణ్యక్షేత్రం తిరుమలకు శేషాచలమే పుట్టినిల్లు. శేషాచలం హృదయస్థానమే తిరుమల క్షేత్రం! తిరుమల మరోపేరు ఆదివరాహక్షేత్రం! తిరుమల గర్భగుడిలోని శ్రీనివాసుడికి ఈ ప్రాంత స్థలదాత ఆదివరాహస్వామి.

తిరుమల కేంద్రంగా భక్తి, ధర్మ, జ్ఞాన, ముక్తి ప్రదాలైన 108 దివ్యతీర్థాలున్నట్లు పురాణాలు పేర్కొంటున్నాయి. ఈ తీర్థాలన్నింటిలోకి తలమానికమైంది తుంబురుతీర్థం. దీనికే ఘోణ తీర్థం, ఫల్గుణీతీర్థం అనికూడా పేర్లు. తుంబురుడు అనే నాద యోగి తపస్సు చేసిన స్థలం. అంతేగాక తుంబురుడు అనే గంధర్వుడి ధర్మపత్ని శాపవిమోచనం పొందిన ప్రదేశం కూడా అయినందున తుంబరతీర్థం సార్థకనామధేయురాలయ్యింది. వరాహ, బ్రహ్మ, స్కాంద, గరుడపురాణాల్లో ఈ తీర్థమాహాత్మ్యం వర్ణితం. బ్రిటిష వాళ్ళు 1843సం॥లో తిరుమల, ఇతర అనుబంధఆలయాల విచారణకర్తలుగా మహంతులకు బాధ్యతలు అప్పజెప్పేటప్పుడు కొన్ని తీర్థాలను సైతం ప్రస్తావించారు. అందులో తుంబురుతీర్థం కూడా ఒకటి. బ్రిటిషుఅధికారి ఎఫ్.వికిన్సన్ తన నివేదికలో తుంబురుకోన దూరాన్ని 4390 గజాలుగా పేర్కొన్నాడు.

**మార్గం-** తిరుమలనుండి రోడ్డుమార్గాన పాపవినాశనం చేరుకుని అక్కడ్నుంచి ట్రెక్కింగ్ చేయాల్సి వుంటుంది. లేదా తిరుమల నుండే ఉత్తరంగా పురాతన కాలిదోవల గుండా కూడా తుంబురుతీర్థం వెళ్లవచ్చు. అయితే ఒక మంచిగైడ్ తప్పనిసరి. పాపవినాశనం నుండి తుంబురుకోనకు సుమారు 7కి.మీ. దూరం. పావవినాశనం డ్యామ్ మీదుగా బయల్దేరి సనక సనందన తీర్థం, సలీంద్రబండ, పింగదీసిన మడుగు మీదుగా తుంబురు కోన చేరుకోవచ్చు. లేదా తిరుపతి-కడప రాష్ట్ర హైవే మీదుగా మామండూరు, కుక్కలదొడ్డి గ్రామాలనుండి బయల్దేరి కూడా తుంబురుతీర్థం చేరుకోవచ్చు. కుక్కలదొడ్డి నుండి తుంబురుతీర్థానికి సుమారు 14కి.మీ. దూరం.

## క్విజ్-7 సమాధానాలు

1)వామదేవలింగం 2)యాజ్ఞవల్క్యస్మృతి 3)కొబ్బరికాయ 4)జాబాలోపనిషత్ 5)సాంఖ్యయోగం 6)సాగరుడు 7)తొండమానుడు 8)శ్రీకృష్ణపరమాత్ముడు 9)చండి 10)ధనం 11)భరతఖండము 12)డమరుకనాదం 13)స్వామితిరునామం 14)మార్కండేయుడు 15)మంథర 16)ఓం నమశ్శివాయ 17)కంబోడియా 18)మహాశివరాత్రి 19)దక్షుడు 20) దైవనామధ్యానం

**సరైన సమాధానాలు వ్రాసినవారు-**

01) బులుసు శ్రీలక్ష్మీశ్వేతప్రియ, 2వ తరగతి, తణుకు.
02) వై.ఎస్.సత్కృత్, 6వ తరగతి, బెంగళూరు.
03) బలివాడ హితేంద్ర, 6వ తరగతి, పుల్లాజీపేట.

కుక్కలదొడ్డి నుండి అయితే పశ్చిమంగా బయల్దేరి తొలుత పందిగుంట, బండిఇరుసులు, చాకిరేవుబాన, పగడమాను గుండాం, కరవుకోన మొత్త, చెంచమ్మలపేటు, సన్యాసోడిగవిల మీదుగా తుంబురుకోన చేరుకోవచ్చు. అంటే కుక్కలదొడ్డి నుండి ఎగబడి వెళితే తుంబురుతీర్థం వస్తుంది. లేదా తిరుమల నుండి బయలుదేరి తుంబురుతీర్థం దర్శనానంతరం కుక్కలదొడ్డికి రావచ్చు. అది వారివారి ఆసక్తి, అనురక్తి, శక్తి సామర్థ్యాలను బట్టి ఉంటుంది. ఒకటిమాత్రం నిజం. మొత్తం మీద తుంబురు తీర్థయాత్ర- జీవితంలో మరపురాని, మధురమైన అనుభవం. దోవపొడవునా చెట్టుచేమలు, కొండశిఖరాలు, సెలయేళ్ళు జలమడుగులు, జంతుజాలం జాడలు తారసపడుతూ ఉంటాయి.



**తీర్థస్నానం-** ప్రతిఏటా ఫాల్గుణమాసం, ఉత్తర ఫల్గుణీ నక్షత్రయుక్త పున్నమినాడు (మార్చి, ఏప్రిల్ మాసాల మధ్య కాలంలో) తుంబురుతీర్థముక్కోటి తీర్థపర్వదినం రోజు లక్షలాది మంది భక్తులు ఇక్కడకు వచ్చి తీర్థస్నానం ఆచరిస్తారు. తీర్థస్నానం సర్వపాపహరణంగా భక్తులు సంబరపడతారు. తిరుమల శ్రీవారికి తెప్పోత్సవాలు ముగిసిన మరుసటిరోజుగా కొందరికి కొండగుర్తు. జ్యోతిశ్శాస్త్రరీత్యా ఆకసానగల పున్నమిచంద్రుడిని భూమ్మీది తుంబురుకోనతో అనుసంధానించడం ఓ అపూర్వ సన్నివేశం. నిండుచందమామను కొండల కౌగిట్లో చూడ్డం మహత్తరానుభూతి.

**తీర్థ స్థలి-** తుంబురుకోన చేరుకోవడం ఒకెత్తు. కోననుండి తుంబురు తీర్థస్థలికి వెళ్లడం మరోఎత్తు. విరాట్‌పురుషుడికి నైవేద్యచందంగా ప్రకృతిమాత కొట్టిన కొబ్బరికాయ రెండు ఒప్పులై నారికేళ జలం చిప్పిల్లిన రీతిని తలపిస్తుంది ఇక్కడి కొండల దృశ్యం. ఎన్నో అమూల్యమైన మూలికల సారాన్ని ఇముడ్చుకుని ప్రవహిస్తున్న సంజీవనీ జలం. ఆత్మను అభిషేకించే లాగున తనివితీరా తడిస్తే ఒళ్లు, మనస్సు ప్రక్షాళన అవుతాయి. షట్చక్రాలు ఉత్తేజితమౌతాయి. తపస్సిద్ధి కలుగుతుంది.

## గ్రంథసమీక్ష

# శ్రీరంగనాథరామాయణము ప్రేయోరసపోషణము

రచన-డా॥ మైలవరపు లలితకుమారి, పుటలు-252; సైజు-1/8 డెమ్మీ, వెల-రూ. 250/-; ప్రతులకు-99595 10422

తెలుగులో వెలసిన రామాయణాలలో ద్విపదలో కూర్చబడ్డ శ్రీరంగనాథరామాయణం ఆద్యం. ఈ గ్రంథంలో పరిపోషింపబడ్డ ప్రేయోరస సన్నివేశాలను అత్యంతరమణీయంగా విశ్లేషించిన గ్రంథం 'శ్రీరంగనాథరామాయణము-ప్రేయోరసపోషణము'.

శ్రీరాముడు-వాల్మీకి; రామలక్ష్మణులు-విశ్వామిత్రుడు; శ్రీరాముడు- దశరథుడు; శ్రీరాముడు- కైకేయి; శ్రీరాముడు-కౌసల్య; శ్రీరాముడు-భరతుడు- ఈ జంటలలో శ్రీరాముడు వారిపట్ల చూపిన స్నేహం, ఆర్ద్రత, పూజ్యత ప్రేయోరసంగా పరివర్తితమైన రసస్ఫూర్తిని రచయిత్రి నిరూపించారు.

ఆదర్శదంపతులైన సీతారాములహృదయాలలో పెనవేసుకున్న అనుబంధం అద్వైతానుబంధం. ఈ దంపతులు సున్నితమైన స్నేహబంధంతో జీవనం సాగించిన తీరు రంగనాథరామాయణంలో ప్రతిఫలించిన విధానం లలితకుమారిగారు వెలికితీశారు.

శ్రీరాముడు-హనుమ, సుగ్రీవుల మధ్య ఉన్న స్నేహం, సాయంచేసిన ఉడుతను శ్రీరాముడు ఆదరించిన వైనం, సకలజీవులపట్ల స్నేహపూర్వకమైన వర్తన కలిగి ఉండాల్సిన ఆవశ్యకతను మానవాళికి బోధిస్తుంది. రామ-విభీషణుల మైత్రి శత్రువైనా శరణాగతుడైన వానిని సఖ్యతతో ఆదరించాలనే సత్యం ప్రతిష్ఠించిన సన్నివేశం, శబరిపట్ల రామునిలోని నిర్వ్యాజానుబంధం తాత్త్వికతాచిహ్నం. దీన్ని రచయిత్రి నిరూపించారు.

ఈ బహుముఖీనమైన ప్రేయస్సు సమాజశ్రేయోదాయకం. కులమతవర్గప్రాంతభేదాతీతంగా ప్రాణులు అనుష్ఠింపదగ్గ సనాతనధర్మం. ఈనాటి సమాజానికి దివ్యోపదేశం.

*- డా॥ వెలువోలు నాగరాజ్యలక్ష్మి, 93941 13848.*



# ఆకలి తీర్చే తల్లి

- డా॥ కందుకూరి వేంకటసత్యబ్రహ్మాచార్య
94914 11090

అన్నం పరబ్రహ్మ స్వరూపం. అటువంటి అన్నాన్ని జగత్తులోని ప్రతి ఒక్కరికీ అందించి వారి ఆకలి తీర్చడానికి అమ్మవారు కాశీక్షేత్రంలో అన్నపూర్ణావతారం ధరించింది.

పూర్వం ఒకసారి కైలాసపర్వతంపై పరమేశ్వరుణ్ణి ఆట పట్టించడానికి అమ్మవారు వెనుక నుండి ఆయన రెండు కళ్లూ మూసింది. ఇంకేముందీ ప్రపంచమంతా గాఢాంధకారం అలుముకుంది. కారణమేంటంటే... సూర్యచంద్రులే శివుడి నేత్రాలు. ఇలా కొంతసేపే అయినా భూలోకంలో మానవులకు మాత్రం అనేక సంవత్సరాలు కరవు తప్పలేదు. ప్రజలంతా ఆహారం లేక, పంటలు పండక ఆకలితో అలమటించారు. జరిగిన దానికి లోకమాత పార్వతీదేవి చాలా బాధపడింది. నందిని వృషభంగా మారి పంటలు పండించమన్నాడు శివుడు. అమ్మవారు కూడా శివుని అనుమతితో కాశీనగరం చేరి ప్రజలందరి ఆకలి తీర్చే అన్నపూర్ణగా అవతరించింది. కాశీ ప్రజలు అమ్మవారి చలువతో ఆకలి అన్న మాటే లేకుండా



సంతోషంగా ఉండసాగారు. అప్పటిదాకా కాశీకి ఉన్న మహా స్మశానం అనే పేరు తొలగి మహాసనం (పెద్దవంటగది) అనే పేరు ప్రచారంలోకి రాసాగింది.

అన్నపూర్ణాదేవి అన్నదాన నిరతిని పరిశీలిద్దామని స్వయంగా శివుడే ఆమె వద్దకు వెళ్లితే క్షణాల్లో ఆహారం అందించిందని కాశీమాహాత్మ్యం చెబుతోంది.

## అన్నపూర్ణ ధ్యానం


**నిత్యానందకరీ వరాఽభయకరీ సౌందర్యరత్నాకరీ**
**నిర్ధూతాఖిల ఘోరపాపనికరీ ప్రత్యక్షమాహేశ్వరీ।**
**ప్రాలేయాచల వంశపావనకరీ కాశీపురాధీశ్వరీ**
**భిక్షాం దేహి కృపావలంబనకరీ మాతాఽన్నపూర్ణేశ్వరీ॥**

కాశీ అన్నపూర్ణ ఆలయం దశాశ్వమేధఘాట్ వెళ్లే దారిలో ఉంది. ఇక్కడి అమ్మవారి విగ్రహం స్వర్ణమయం. ఆలయగర్భగుడిలో అమ్మవారు పద్మాసనం వేసుకుని కూర్చుని ఉంటుంది. ఎడమచేతిలో అన్నం నిండిన పాత్రను పట్టుకుని, కుడిచేతిలో గరిటెతో పరమేశ్వరుని భిక్షాపాత్రలో అన్నం నింపుతూ దర్శనమిస్తుంది.

ప్రతిసంవత్సరం దీపావళి తర్వాత పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అన్నపూర్ణాదేవి ఆలయంలో అన్నకూటఉత్సవం చేస్తారు.

అవిముక్తక్షేత్రంలో అందరి ఆకలి తీర్చడానికి అమ్మవారు అన్నపూర్ణాదేవిగా, ప్రజల తరుపున వారి బాధలను తీర్చడానికి పరమేశ్వరుడు, ఇలా ఇద్దరూ కలిసి ఇక్కడ దర్శనమివ్వడం చాలా విశేషం. ఈ అమ్మవారిని దర్శించుకున్న వారికి ఆకలి బాధలు ఉండవు. లోకానికి కరవుకాటకాలు రావు.

విశ్వదాభిరామం వేమన పద్యసూక్తి



# అల్పుల అధికారం

అధికు డైనరాజు అల్పుని చేపట్ట,
వానిమాట చెల్లు వసుధలోన;
గణకు లొప్పియున్న గవ్వలు చెల్లవా?
విశ్వదాభిరామ! వినుర వేమ!

**అర్థాలు:** అధికుడు= గొప్పవాడు; చేపట్ట= దగ్గరకు తీస్తే; గణకులు= లెక్కలు చూచేవారు; గవ్వలు= సముద్రం ఒడ్డున, ఏటి తీరంలోను, చెరువుల ఒడ్డులలోను, నీటిప్రక్కన– ఇవి కన్పిస్తాయి.

**భావం:** అధికుడైన రాజు అల్పుని (నీచుని) దగ్గరకు తీస్తే లోకంలో ఆ అల్పుని మాటే చెల్లుబాటవుతుంది. రాజులు గణకుల మీద ఆధారపడితే గవ్వలు కూడా చెల్లుబాటు అవుతాయి.

**వివరణ:** లోకంలో గవ్వలు విలువ లేనివి. కాని ముద్రాధికారులు వాటిని డబ్బులుగా నిర్ణయిస్తే, అన్నింటికీ మించినవిలువ వస్తుంది. ఇవి అందరికీ సులువుగా అందుబాటులో ఉండేవి కాబట్టి క్రమంగా డబ్బుకు విలువ నశించిపోతుంది. అలాగే రాజ్యంలో రాజు అందరికంటె అధికుడు. అతడిమాటకు తిరుగుండదు. ఆ రాజు నీచుడికి అధికారమిస్తే ప్రజలు వాడి ఆజ్ఞను పాటించాల్సిందే! నీచుడు కాబట్టి వాడి పనులు ప్రజలకు బాధ కలిగించేవి, సమాజానికి అనర్థం కలిగించేవి అవుతాయి. దానివల్ల రాజ్యంలో తిరుగుబాటు వచ్చి, ఆ రాజును వదిలించుకుంటారు. నీచుడికి అధికారం ఇవ్వడం వల్ల రాజు తన అధికారాన్నే కోల్పోవాల్సి వస్తుంది. అందుచేత రాజు నీచులను చేరదీయరాదు. – కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు

భాస్కరశతకం

# దేహముంటేనే ధర్మాచరణ సాధ్యం!

ఉ. నడవక చిక్కి లేమియగునాఁడు నిదరపోషణార్థమై
యడగిభుజించుటల్ నరులకారయ వ్యంగ్యముకాదు పాండవుల్
గడుబలశాలు లేవురు నఖండవిభూతిఁదొలంగి భైక్ష్యముల్
గడువరె యేకచక్రపురిఁగుంతియు దారొకచోట భాస్కరా.

**తాత్పర్యం:**

భాస్కరా! జరుగుబాటులేక పేదరికంలో ఉన్నప్పుడు, శరీరాన్ని పోషించుకోవడానికి ఇతరులను యాచించడంలో అవమానమేమీ లేదు. మహాబలవంతులైన పాండవులు సంపదలకు దూరమైన సందర్భంలో, ఏకచక్రపురంలో బిచ్చమెత్తి తమ తల్లి కుంతీదేవితో పాటుగా జీవించారు కదా!

ఎంతటివారికైనా ఆపదలు రావడం సహజం. అటువంటి సందర్భంలో పరులను యాచించి అయినా శరీరాన్ని కాపాడుకోవాలి. అదొక అవమానమేమీ కాదు. ఎందుకంటే దేహముంటేనే ధర్మాచరణ సాధ్యం. తాత్కాలికమైన ఇబ్బందులతో పౌరుషానికి పోయి శరీరాన్ని నశింప చేసుకుంటే ఇక ధర్మాచరణకు ఆస్కారం ఎక్కడుంటుంది?

కౌరవ పాండవులు పెదతండ్రి పినతండ్రి బిడ్డలు. దుర్యోధనుడు పాండవుల పట్ల అసూయాద్వేషాలతో వారిని చంపివేయాలనుకున్నాడు. వారణావతంలో లక్క ఇల్లు నిర్మించి అందులోకి పాండవులను ప్రవేశపెట్టాడు. ఆ ఇంటిని తగులపెట్టి వారిని కాల్చి బూడిద చేయడానికి పన్నాగం పన్నాడు. విదురుని సహాయంతో పాండవులు తప్పించుకుని ప్రాణాలు కాపాడుకున్నారు. కొంతకాలం అజ్ఞాతంగా ఉండదలచి, బ్రాహ్మణ వేషాలలో తల్లితో పాటు ఏకచక్రపురం చేరారు. అక్కడ పాండవులు భిక్షాటన చేసి, ఆ ఆహారంతో తాము శరీరాలను పోషించుకున్నారు. ఆ తరువాత తిరిగి రాజ్యాన్ని పొందారు.

కనుక ఆపద వేళ పౌరుషానికి పోకుండా రాబోయే శుభాల కోసం ఎదురుచూస్తూ తగ్గి ఉండడం అమర్యాదకరమైన పనికాదు. –డా॥ వడ్డేపల్లి శ్రీనివాసరావు



కాశీలో పాపపరిహారం చేయడానికి శిక్షించేవాడు కాలభైరవుడు

ఆయుర్వేదం

# వేసవిని జయించండి!!


– డా॥చిట్టిభొట్ల మధుసూదనశర్మ,
90007 61390


వేసవిలో వడగాల్పులు, ఉష్ణతాపాలు, మండుటెండలు, ఉక్కపోతలు భరించలేక ఆరోగ్యం దెబ్బతినే అవకాశముంది. ఈ సమస్యను అధిగమించేందుకు ఆయుర్వేదం చక్కటి పరిష్కారాలు సూచించింది. వేసవిలో సంభవించే సాధారణ రుగ్మత వడదెబ్బ. రక్తప్రసారం అధికమై చర్మం కందిపోవడం, ముఖం, కళ్లు ఎర్రగా మారడం, అధికదాహం, విపరీతమైన తలనొప్పి, ఒళ్లునొప్పులు, కండరాల, పిక్కలనొప్పులు, చర్మం పొడిబారడం, మగత, తలత్రిప్పుట, స్పృహతప్పిపోవటంలాంటివి వడదెబ్బలక్షణాలు.



వడదెబ్బనుండి కాపాడుకోవడానికి కొన్ని జాగ్రత్తలు–

బయటకు వెళ్లాల్సివస్తే వీలైనంతవరకు ఉదయం 11 గంటల లోపు సాయంకాలం 4 గంటల తరువాత వెళ్లి పనులు చూసుకోవడం శ్రేయస్కరం.

వేసవి కాలంలో ఉప్పు, కారం, మసాలాలతో చేసిన ఆహారపదార్థాలు, వేపుళ్లు, అధికంగా నూనె వేసిన పదార్థాలు అసలు వాడకూడదు.

మట్టిపాత్రలో ఉంచుకున్న పానీయాలు శ్రేష్ఠం. వడదెబ్బ సమస్యను అధిగమించేందుకు నీటితో పాటు మజ్జిగ చాలా మంచిది.

మజ్జిగ తనువును చల్లబరుస్తుంది. మన ప్రాంతాల్లో ఈ మజ్జిగనే చల్ల అంటారు. దీనివల్ల మనకు వివిధలవణాలు, విటమిన్లు, శక్తి అందుతాయి. ఇందులో వేసే ఉప్పు, అల్లం, కొత్తిమిర, పుదీనా, నిమ్మరసంలాంటివి ఒంట్లో ద్రవాలస్థాయిని బాగా పెంచి ఎలక్ట్రోలైట్స్‌గా బాగా పనిచేయటంతో పాటు నిర్జలీకరణ (డీహైడ్రేషన్) లేకుండా చేస్తాయి. అలాగే కొబ్బరి నీళ్లు, చెరకురసం, పళ్లరసాలు లాంటివి చాలా ఉపయుక్తం.

ఏలకులు, లవంగాలు, పచ్చకర్పూరం, మిరియాలు, పటికబెల్లం వగైరాలు నీటిలో కలిపి తయారుచేసిన ద్రవాన్ని రోజూ సేవించటం కూడా వేసవికాలంలో మంచిది.

రోజూ సాన మీద అరగదీసిన మంచిగంధం ఒక చెంచావంతున కప్పు నీటిలో కలిపి తీసుకుంటే వడదెబ్బను చాలా వరకు నివారించవచ్చు.


వడదెబ్బ తగిలినప్పుడు చల్లని నీటిలో బట్టను ముంచి శరీరంపై కప్పాలి. మరియు చల్లని నీటిని ఒంటిపై చల్లుతుండాలి. ఉల్లిపాయరసంలో బట్టను లేదా దూదిని ముంచి పిండి తలమీద, నుదుటిపై పెడుతుండాలి. బట్ట వేడి అయితే మరల ఉల్లిపాయరసంలో బట్టను అద్ది నుదుటిపై పెడుతుండాలి. వట్టివేరును నీటిలో సుమారు రెండుగంటలు నానించి ఆ నీటితో కూడా పై విధంగా చెయ్యవచ్చు.

రోజూ ఒకసారి 200మి.లీ. పాలలో ఒక టీస్పూను సుగంధి పాలవేర్లపొడి కలిపి మరగించి దించి వడబోసి తగినంత పటికబెల్లం కలిపి సేవిస్తుండాలి.

రోజూ ఒకసారి 50మి.లీ. పాలలో ఒక టీ స్పూను శుద్ధ గులాబీజలం కలిపి త్రాగాలి.

రోజూ రాత్రిపూట 50మి.లీ. పాలను తోడుపెట్టి 30–50 గ్రాముల ఉల్లిపాయముక్కలు వేసి వుంచి ఉదయం ఆ పదార్థమంతా తింటుండాలి.


రోజూ ఒకట్రెండుసార్లు 100 మి.లీ. వేడి నీటిలో 2 గ్రాముల ధనియాల పొడి, 2 గ్రాముల తాటి కలకండ కలిపి గంట నానించి, వడగట్టి ఆ నీటిని త్రాగినా మంచి ప్రయోజనం ఉంటుంది.




చిత్ర కథ

# భగీరథప్రయత్నం

కథ– డా॥కంపల్లె రవిచంద్రన్
చిత్రాలు– శ్రీ తుంబలి శివాజీ




భగీరథుడు బొటనవ్రేళ్లమీద నిలబడి వాయువును
ఆహారంగా తీసుకుంటూ ఒక సంవత్సరం
తపస్సు చేశాడు.
భగీరథా! నీ కోరిక నెరవేరుస్తాను.
నేను గంగను నా శిరస్సున ధరిస్తాను.
శంకరుడు హిమాలయాలలోని బిందుసరోవరం దగ్గర
నిలబడి గంగను వదిలాడు. గంగ అక్కడ నుండి
ఏడు పాయలుగా చీలింది.
అందులో ఒక పాయ భగీరథుని వెంట వెళ్లింది.
గంగ జహ్ను మహర్షి ఆశ్రమంగుండా ప్రవహించి ఆశ్రమాన్ని
ముంచేసింది. మహర్షి కోపగించి గంగను మింగేశాడు.
మహర్షీ నేను మా పితరులను తరింపజేయడానికి
వచ్చాను.ఇంత దూరం తీసుకువచ్చిన గంగను
మీరు లోపలికి తీసేసుకున్నారు.
నన్ను అనుగ్రహించి గంగను విడిచిపెట్టండి.
జహ్నుమహర్షి గంగను వదిలాడు.
గంగ భగీరథుని వెంట పాతాళలోకం వెళ్లి
అరవైవేల మంది సగరుల భస్మరాశులపై
ప్రవహించింది.
సకలపాపహారిణి గంగా తరంగాలలో ఓలలాడి
శాపవిముక్తులై సగరపుత్రులు అరవైవేలమంది
దివిని చేరారు.
శుభం




# శివాజ్ఞ లేనిదే...


- శ్రీమతి నల్లాని రాజేశ్వరి,
99086 02443

ధనంజయుడనే వైశ్యుడు ఉండేవాడు. అతని ఊరు దక్షిణ సముద్రపురంలో సేతువు దగ్గరగా ఒక గ్రామం. అతడికి తల్లి అంటే పంచప్రాణాలు. ప్రత్యక్షదేవత తల్లి అనే సద్భావంగల మంచికొడుకు.

అలా ఉండగా తల్లి బాగా వయస్సయి ముసలితనం పండి, కాలగతిని పొందింది. ధనంజయుడు తల్లికి చేయాల్సిన పారలౌకిక క్రియలన్నీ శ్రద్ధాభక్తులతో చేసి, అస్థికలు వేరుగా ఒక కలశంలో భద్రపరచి ఉంచాడు. వాటిని కాశీకి వెళ్లి గంగలో కలిపితే కాని మాతృఋణవిముక్తి కాదని అనుకున్నాడు. నిజమే!

పంచగవ్యంతో ప్రక్షాళనచేసి, పంచామృతస్నానం చేయించి, గంధంపూసి, పువ్వులతో పూజచేసి, అస్థికలను పట్టు బట్టలో కట్టి, ఆ మూట ఒక తోలుసంచిలో ఉంచి, మూతి బిగించి, దాన్ని ఒక కంబళిలో ఉంచి, మన్నుమెత్తి, ముద్రవేశాడు. దాన్ని ఒక రాగిపెట్టెలో భద్రపరచి, దిట్టమైనతాళం వేశాడు.

యాత్రకు కావాల్సిన బియ్యం, పిండి వగైరా సర్దుకున్నాడు. అస్థికలమూట పట్టుకున్నాడు. ఆగి, వండుకుని తింటూ, ఏ చెట్టునీడనో నిద్రిస్తూ పయనిస్తున్నాడు. అలా పోగాపోగా జ్వరం సోకింది. మూట మొయ్యలేక ఒక ఆటవికపల్లెలో ఒక ఆటవికుణ్ణి జీతానికి కుదుర్చుకుని, మూట వాడికి అప్పగించి, మళ్లీ మజిలీలలో ఎలాగైతేనేమి- కాశీకి చేరాడు.



కాశిలో ఒక వైశ్యుని ఇంట బస కుదుర్చుకుని, వంటసామాను కోసం అంగడికి వెళ్లాడు. ఆ సమయంలో వెంట వచ్చిన ఆటవికుడు, మూటలో ధనం ఉందని ఊహించి, దాన్ని కాజెయ్యాలనే దుస్సంకల్పంతో నెత్తిన పెట్టుకుని అడ్డుత్రోవన పడి తన పల్లెకుపోయాడు.

కొంతసేపటికి బియ్యం వగైరా కొని, ధనంజయుడు బసకు వచ్చి, వాకిటి అరుగుమీద నీరసంచేత నడుంవాల్చి, "ఒరే, రారా ఇలా!" అని ఆటవికుణ్ణి పిలిచాడు. ఎప్పుడో పారిపోయిన అతడెక్కడ వస్తాడు? పాపం! వైశ్యుడు చప్పున లేచి, అటు ఇటూ వెతికాడు. విసవిసలాడాడు. వెర్రెత్తినట్లు అరిచాడు. అమ్మని తల్చుకుని ఏడ్చాడు.

"మధ్యాహ్నసమయం కాగానే గంగానదిలో స్నానం చేద్దామనుకున్నాను. ఆ విశ్వేశ్వరస్వామినీ, డుంఠి గణపతినీ, దక్షిణామూర్తినీ, కాలభైరవుణ్ణి, విశాలాక్షీదేవినీ, కన్నులారా దర్శించి, సేవించాలనుకున్నాను. ఆ పాపాత్ముడు ఆటవికుడు- సొమ్ము ఉందని మా తల్లి అస్థికలమూట ఎత్తుకుని, పారిపోయాడు. ఎంత పాపిష్ఠి వాడు? వదులు తానా?" అని ఏడిచి, లేచి, ఆ వేగంతో ఆటవిక పల్లెకు ప్రయాణించాడు.

అంతకుముందు మూట ఎత్తుకొని పారిపోయిన ఆటవికుడు, పోయిపోయి ఒక అడవిలో ఆ మూట విప్పి, దానిలో సొమ్ము లేకపోయేసరికి, ఎంత మోసం! ఇన్నాళ్లూ నేను మోసింది అస్థికలా! వైశ్యుడు ఎంతపని చేశాడు? అని విసిగి, అవి అక్కడే పారవేసి, తనపల్లెకు పోయి, దొంగచాటుగా ఉన్నాడు. వైశ్యుడు వస్తాడని అతడి అనుమానం. అతడి అనుమానానికి తగినట్లే ధనంజయుడు అతడి గుడిసెకు వెళ్లి, వాడిభార్యకు మంచిమాటలు చెప్పి, తలమీద చెయ్యివేసి ప్రమాణవాక్కు పలికి, "అమ్మా! నీకేమీ భయం లేదు. నీ మగణ్ణి ఏమీ చెయ్యను. ఎక్కడ ఉన్నాడో చెప్పు" అని బుజ్జగించాడు. ఆమె వెళ్లి తన మగణ్ణి తీసుకుని వచ్చి, అతనికి అప్పగించింది. ధనంజయుడు అతణ్ణి బతిమాలి, మంచిమాటలాడి "బాబూ! నాతో రా! అస్థికలు ఎక్కడ పారవేశావో చెప్పు. నీకు కట్నం ఇస్తాను. కానుక ఇస్తాను" అని తీయనిమాటలు పలికి, ముందు నడిపించాడు.

ఇద్దరూ అడవిలో పడ్డారు. ఆటవికుడు అక్కడ కాదు, ఇక్కడ, ఇక్కడ కాదు అక్కడ అని అడవంతా తిప్పాడు. అతని వెంట ధనంజయుడు విసుగు లేక తిరిగాడు. ఎక్కడా అస్థికలు కనిపించలేదు. చివరకు విసిగి, ఆ ఆటవికుణ్ణి నాలుగుతిట్టి, అతడు కాశికి పోయి, గంగాస్నానంచేసి, నా దౌర్భాగ్యం ఇలా ఉంది? ఏమి చేస్తానని తనను నాలుగు తిట్టుకుని, తన ఊరికిపోయాడు.

విశ్వేశ్వరుని ఆజ్ఞ అయితేగాని ఎవరూ కాశిలో కాలు పెట్టలేరు. ఒకవేళ పెట్టారే అనుకో, వచ్చే విఘ్నాలతో ఉక్కిరి బిక్కిరి అయి పడరానిపాట్లు పడతారు. వారి లక్ష్యం నెరవేరదు." అని ఈ కథలోని రహస్యం.

# బాలవినోదం

పిల్లలూ... మీ మేధకు పదును పెట్టండి....

## కదంబం

### కాశీలోని ముఖ్యఘాట్‌లు

| | | |
|---|---|---|
| 01) అసీసంగమం | 08) సరోవర్ | 15) లలిత |
| 02) తులసీ | 09) నారద | 16) మణికర్ణిక |
| 03) ఆనందమయి | 10) పాండే | 17) రామ్ |
| 04) హనుమాన్ | 11) రాణా | 18) పంచగంగ |
| 05) హరిశ్చంద్ర | 12) దశాశ్వమేథా | 19) ప్రహ్లద |
| 06) కేదార్ | 13) ప్రయాగ | 20) వరుణాసంగమం |
| 07) క్షేమేశ్వర్ | 14) రాజేంద్రప్రసాద్ | 21) త్రిలోచనాఘాట్ |

## గుర్తించండి!

పిల్లలూ! పక్క గడులలో కాశీలోని జ్యోతిర్లింగాలు కొన్ని దాగి ఉన్నాయి. వాటిని గుర్తించండి!

| | | | | | |
|---|---|---|---|---|---|
| నా | సో | థు | మ | డు | శ్రీ |
| ళ్లి | ర్జు | ను | మే | కా | డు |
| కా | శ్వ | రు | ళే | హా | మ |
| యం | బ | శ్వ | త్ర | కే | ఘృ |
| వి | ష్ణే | నా | వై | థే | ధ్య |
| ఓం | దా | రే | శం | కే | గే |

జవాబులు

01) శ్రీసోమనాథుడు
02) శ్రీమల్లికార్జునుడు
03) శ్రీమహాకాళేశ్వరుడు
04) శ్రీవైద్యనాథేశ్వరుడు
05) ఓంకారేశ్వరుడు
06) శ్రీవిశ్వనాథుడు
07) శ్రీత్ర్యయంబకేశ్వరుడు
08) శ్రీఘృష్ణేశ్వరుడు
09) శ్రీకేదారేశ్వరుడు
10) శ్రీనాగేశ్వరుడు
11) శ్రీకామేశ్వరుడు

## మీకు తెలుసా?



1) కాశీలో ప్రహ్లాద్‌ఘాట్ దగ్గరున్న ఈశ్వరుడు?
2) కాశీక్షేత్రానికి రాజు?
3) కాశీలో గరుత్మంతుని తల్లి వినత ప్రతిష్ఠించిన లింగం?
4) కాశీలో వ్యాసుడు ఆశ్రమం నిర్మించుకున్న ప్రదేశం?
5) కాశీలో అతిపెద్దలింగం?
6) కాశీక్షేత్రంలో మొదటి లింగం?
7) బెనారస్ హిందూవిశ్వవిద్యాలయం ఎక్కడ ఉంది?

జవాబులు:
1) స్వరలింగేశ్వరుడు
2) శ్రీవిశ్వనాథుడు
3) ఖఖోలాదిత్య
4) వ్యాసకాశీ
5) అగ్నేశ్వర్
6) ఓంకారేశ్వరుడు
7) కాశీ

## కనుక్కోండి


ఈ అక్షరాలతో ఒక సూక్తి వస్తుంది...

| | | | | | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | శి | | డి | | జ్ఞ | | ని | | చీ | | నా | | ట్ట | | కు | | |
| వు | | ఆ | | లే | | దే | | మ | | యి | | అ | | దు | | | |

జవాబు:
శివుడి ఆజ్ఞ లేనిదే
చీమ అయినా కుట్టదు

## చిత్రలేఖనం

ఈ క్రింది బొమ్మకు రంగులు వేద్దామా...



ఈ పక్కన ఉన్న బొమ్మను క్రింది గడులలో గీయండి...

# క్విజ్ 09

01) మానుషము కానిది? జ)..........
02) క్లైబ్యం అంటే...? జ)..........
03) తిరుమలకు హృదయస్థానం? జ)..........
04) హరికంటాపురం అని ఏ క్షేత్రానికి పేరు? జ)..........
05) 'గంగానది భారతీయుల ఆత్మ' అని అన్నదెవరు? జ)..........
06) 'పూర్ణిమ' ఎవరిపేరు జ)..........
07) హరిద్వార్ నుంచి గంగ ఏ దిక్కుకు ప్రవహిస్తుంది? జ)..........
08) 'కన్హరీ' ఏ నదికి ఉపనది? జ)..........
09) గోదావరీతీరం ఇసుకపల్లె నుంచి నాలుగువిగ్రహాలు తీసుకువచ్చినవారు? జ)..........
10) 'ఎదుర్కోలు' ఉత్సవం ఎక్కడ జరుగుతుంది? జ)..........
11) అనంతరాజు ఏ ప్రాంతాన్ని పరిపాలించాడు? జ)..........
12) కొంకణతీరంలో ఎవరి గుడులు ఉన్నాయి? జ)..........
13) అష్టవసువులలో ఒకడు? జ)..........
14) తనియ అంటే...? జ)..........
15) కాజలి అంటే...? జ)..........
16) చంద్రేశ్వర ఆలయం ఎక్కడ ఉంది? జ)..........
17) మహానసం అంటే...? జ)..........
18) ఈ నెలలో ప్రారంభమైన నూతన ధారావాహిక? జ)..........
19) గృహస్థులు కూరగాయలమొక్కలు నాటే తిథి? జ)..........
20) చైత్ర బహుళ అమావాస్యను ఏమంటారు? జ)..........

## నియమనిబంధనలు

01) పదిహేనేళ్లలోపు బాలబాలికలు మాత్రమే ఈ 'క్విజ్'లో పాల్గొనాలి.
02) ఇందులో పాల్గొనే పిల్లలు తప్పనిసరిగా హిందువులై ఉండాలి.
03) నిర్దేశించినస్థలంలోనే జవాబులు రాసి పంపాలి. క్విజ్ సమాధానపత్రం జిరాక్సుప్రతులు పంపేటట్లు అయితే, చందా నమోదుసంఖ్య తప్పనిసరి.
04) సమాధానాల్లో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండకూడదు.
05) జవాబులు చేరాల్సిన చివరితేది 25-04-2023.
06) ఈ క్విజ్‌లో అన్ని సమాధానాలు సరిగ్గా రాసిన బాలబాలికల పేర్లను వచ్చేతదుపరినెల సప్తగిరిమాసపత్రికలో ప్రచురిస్తాం.
07) తి.తి.దే. ప్రధానసంపాదకులవారి కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులపిల్లలు ఈ క్విజ్‌పోటీలో పాల్గొనకూడదు.
08) క్విజ్‌కు సంబంధించి ఏ సమాచారమూ ఫోన్‌ద్వారా ఇవ్వ బడదు.
09) ఈ క్విజ్‌లో పాల్గొనే పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా సప్తగిరి మాసపత్రిక చందాదారులై ఉండాలి. క్విజ్ సమాధాన పత్రంలో ఈ క్రిందివివరాలు స్పష్టంగా రాసి పంపాలి.
10) జవాబులను బాల్‌పెన్నుతో మాత్రమే రాసిపంపాలి. పెన్సిల్, స్కెచ్, జెల్‌పెన్నులతో రాయకూడదు.
11) ఈ ప్రశ్నలకు జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. వెతికి రాయండి.

చందాసంఖ్య: .......... వయస్సు: ..........
పాఠశాల: .......... తరగతి: ..........
పేరు: ..........
చిరునామా: ..........
..........
..........
.......... పిన్‌కోడ్: ..........
ఫోను నెంబరు: ..........

**జవాబులు చేరాల్సిన చిరునామా**
ప్రధాన సంపాదకులు, 'సప్తగిరి' మాసపత్రిక, తి.తి.దే.ప్రెస్ కాంపౌండ్,
కె.టి.రోడ్డు, తిరుపతి-517 507. తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్

# రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి



**మేషం–** తెలివితేటలు, ప్రతిభ, తగిన చొరవ చూపి అనుకున్నది సాధిస్తారు. ఇంట్లో మంగళ కరమైన వాతావరణం, ఉన్నత ఉద్యోగవృద్ధి, సంతానంవృద్ధి, ఆదాయం, గౌరవం. సుబ్రహ్మణ్యస్వామి ఆరాధన మంచిది.



**వృషభం–** కవిత్వం, గాత్రంవంటి విద్యలలో రాణిస్తారు. సృజనాత్మకశక్తి పెరిగి చదువులలో విద్యార్థులు బాగా రాణిస్తారు. ధనసంపాదన మెరుగౌతుంది, భూయోగం కల్గుతుంది.



**మిథునం–** సంతృప్తికరమైన ఆదాయముంటుంది. నూతనవ్యాపారాలకు పెట్టుబడులు ఆచితూచి పెట్టడం అవసరం. సంపదలు వృద్ధి చెందు తాయి. కీర్తి విస్తరిస్తుంది, స్నేహితుల మద్దతు లభిస్తుంది. అన్ని ప్రయత్నాలలో విజయం పొందుతారు.



**కర్కాటకం–** శుభకార్యాచరణకు శ్రీకారం చుడ తారు. ఆర్థికలోపాలను అధిగమిస్తారు. వృత్తి వ్యాపారాల్లో అధికాదాయాన్ని పొందుతారు. జీవితభాగస్వామితో సత్సంబంధం ఉంటుంది.



**సింహం–** నిందారోపణలు వచ్చే అవకాశం ఉంది. ఆర్థికపరంగా కొంచెం ఇబ్బందికరమైన సమయం. ఖర్చులను తగ్గిస్తే మంచిది. మాస ద్వితీయార్ధం అనుకూలం. వృత్తి, ఉద్యోగాలలో అనుకూలత.



**కన్య–** వాదనలకు దిగడం మంచిది కాదు. శత్రువృద్ధి అవుతుంది. మనస్సులో ఆరోగ్య సమస్యల గురించి నిరంతరం భయాన్ని కలిగిస్తుంది. వ్యవహార ప్రతిబంధకాలతో సతమతమౌతూ ఉంటారు.



**తుల–** అధికారంతో కూడిన ఉద్యోగం, ప్రభుత్వం నుండి కొంత గుర్తింపు లేదా ప్రతిఫలం సాధ్య మౌతుంది. కోర్టు కేసుల్లో తీర్పు మీకు అనుకూలం. ఈ నెలలో ఆరోగ్యం మెరుగవుతుంది.



**వృశ్చికం–** అన్నిరంగాలలో చాలా అభివృద్ధిని అనుభవిస్తారు. ప్రేమ, కరుణ పెరుగుతాయి. పిల్లలు సహాయకారులుగా ఉంటారు. సమాజంలో మీ స్థానం కూడా మెరుగుపడుతుంది. శ్రేయోభిలాషులను పొందుతారు.



**ధనుస్సు–** ప్రతి పనిని యుక్తితో చేస్తారు. భాగ స్వామ్య వ్యాపారాలు కలిసిరావు. ఆదాయం కొద్దిగా తగ్గవచ్చు, కాబట్టి డబ్బును పొదుపు చేయడం మంచిది. ఆరోగ్యం సామాన్యం.



**మకరం–**విద్యార్థులకు ఇది ప్రగతిశీలసమయం. వ్యాపారాలలో, లాభాలు వస్తాయి. మెరుగైన పని తీరుకు అనుగుణంగా మీరు చాలా ప్రశంసలు, పదోన్నతులు పొందుతారు.



**కుంభం–** ప్రశాంతంగా ఉండటానికి స్నేహితులు, కుటుంబసభ్యులతో మంచి సంబంధాల్ని కొనసాగించడానికి తగిన సమయం. ఆహార అలవాట్లపై నిఘా ఉంచాలి. కుటుంబఖర్చులు పెరిగే అవకాశం ఉంది.



**మీనం–** జన్మరాశిలో రవి, గురువు సంచారాల వల్ల కోపం అధికంగా ఉంటుంది. అందువల్ల ఇతరులతో మాట్లాడేటప్పుడు జాగ్రత్త. స్నేహితు లతో, కుటుంబసభ్యులతో ఉద్రిక్తతలు తగ్గవచ్చు. ఆదాయానికి లోటుండదు.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# సప్తగిరి

(ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక)

## చందా నమోదు పత్రం

1. పేరు మరియు చిరునామా :
(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

(పిన్‌కోడ్ తప్పనిసరి)

సెల్ నెం.

2. కావలసినభాష :
తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐
హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం ☐

3. సంవత్సరచందా : ☐ రూ.240/-
జీవితచందా ☐ రూ.2400/- (12 సం॥రాలు)

4. విదేశాలకు సంవత్సరచందా : ☐ రూ.1030/-

5. చందా పునరుద్ధరణ :
(అ) చందానెంబరు :
(ఆ) భాష :

6. చెల్లించిన మొత్తం :
డి.డి.నెం. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్ మాత్రమే :
........................................ తేది : ..................

ప్రదేశం :
తేది :
చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.240/-, జీవితచందా(12 సం॥రాలు) రూ.2400/-లు, విదేశాలకు సంవత్సర చందా రూ.1030/-; డి.డి. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్‌లను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి', తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.


2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులోగానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప- మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.

3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.

4) మా చిరునామా "ప్రధాన సంపాదకుడు, సప్తగిరి కార్యాలయం, టి.టి.డి. ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".

5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# వైకుంఠపాళి 87



నిర్వహణ: శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు, 90003 24024

### అడ్డం

1)గంగను భూమి మీదికి తీసుకువచ్చినవాడు(5); 3)అష్టవసువులలో ఒకడు(4); 6)గంగాశంతనుల కుమారుడు(3); 7)పార్వతి(3); 10)సరస్వతి వాహనం(2); 12)ఈ నెలలో గంగానదికి వచ్చేవి(4) 13)భీముడు తెచ్చిన పుష్పం(4); 17)లక్ష్మణుడికి రాముడు(2); 18)నవరసాల్లో ఒకటి(3); 19)కలహాభోజనుడు(4); 22)కాశీలోని అష్టభైరవులలో ఒకడు(3); 23)కాశీకి గల మరొకపేరు(4)

### నిలువు

2)రుక్మరేఖ భర్త(3); 4)వ్యాసుడు రచించింది(3); 5)కాశీలో ముఖ్యమైనఘాట్(4); 6)పాండవులలో ఒకడు(3); 8) గంగావాహనం(3); 9)గంగఒడ్డులోని ముఖ్యఘాట్(4); 11)వంట చెఱకు(3); 14)కాశీలో అతిముఖ్యమైంది(5); 15)గంగను ఇలా కూడా పిలుస్తారు(4); 16)కాశీక్షేత్రానికి రాణి(4); 20)శ్రీకృష్ణుణ్ణి ఆరాధించింది(2); 21)శివుడి మెడలో ఉండేది(2)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

- ప్రధాన సంపాదకుడు



Printed by Sri P.Ramaraju, M.A., and Published by Dr. K.Radharamana, M.A., M.Phil., Ph.D., on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.

తి.తి.దే. శిల్పకళాశాలలో 2023 ఫిబ్రవరి 13వ తేదీ నుండి 16వ తేదీ వరకు శిల్పకళాప్రదర్శన జరిగింది. ఇందులో తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి, తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారిణి శ్రీమతి సదా భార్గవి, ఐ.ఏ.ఎస్., తి.తి.దే. విద్యాశాఖాధికారి శ్రీ భాస్కర్ రెడ్డి, తి.తి.దే. శిల్పకళాశాల ప్రిన్సిపాల్ శ్రీ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.









తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో తి.తి.దే. పురుష ఉద్యోగులకు జీవనశైలి, రుగ్మతలపై జరిగిన అవగాహన కార్యక్రమం (11-02-2023 నుండి 13-02-2023 వరకు)లో పాల్గొన్న తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఈ.ఎస్., తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారిణి శ్రీమతి సదా భార్గవి, ఐ.ఏ.ఎస్., స్విమ్స్ డైరెక్టర్ డా॥ బి.వెంగమ్మ, శ్రీపద్మావతీ చిన్నపిల్లల హృదయాలయం ఆసుపత్రి డైరెక్టర్ డా॥ శ్రీనాథ్ రెడ్డి తదితరులు.










SAPTHAGIRI (TELUGU) SPIRITUAL ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams printing on 25-03-2023 and posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under RNI No.21139/1970. Postal Regd.No.TRP/155/2021-2023 "Licenced to post without prepayment No.PMGK/RNP/WPP-04(1)/2021-2023" posting on 5th of Every Month.

